VELTHURU TELUGU DAILY

# వెలుతురు

తెలుగు దిన పత్రిక

రంగారెడ్డి, నల్గొండ : మంగళవారం 09.06.2026

సంపుటి : 07 సంచిక : 365 , పేజీలు : 12 , వెల:రూ . 5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRAPRADESH

www.velthuru.com



11

## పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

- ఇరాన్ వదిలి వచ్చేయండి.. భారతీయులకు ఎంబసీ అత్యవసర ఆదేశాలు!

# జెండాలకు, ఎజెండాలకు అతీతంగా హైదరాబాద్‌ను అభివృద్ధి చేసుకుందాం




- సైబరాబాద్ పరిధిలో రూ.1,674.74 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- మియాపూర్‌లో ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక బహిరంగ సభలో సీఎం ప్రసంగం
- భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా హైదరాబాద్‌ను మూడు కార్పొరేషన్లుగా విభజించామని వెల్లడి
- మియాపూర్, శేరిలింగంపల్లి, బాచుపల్లిలో కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులు
- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన
- గాజులరామారంలో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మాణానికి సన్నాహాలు
- తెలంగాణకు నిధులు తేవడంలో బీజేపీ ఎంపీలు విఫలమయ్యారని విమర్శ
- మెట్రో రెండో దశ విస్తరణ, లక్ష ఇండ్ల నిర్మాణంపై కీలక ప్రకటన
- మూసీ అభివృద్ధిని అడ్డుకోవద్దంటూ కేంద్రంపై ప్రశ్నల వర్షం
- వచ్చే 24 నెలలు అభివృద్ధిపైనే ప్రభుత్వ పూర్తి దృష్టి



2 లో

## రాహుల్‌ను టార్గెట్ చేస్తూ పోస్టర్ల కలకలం!



- కేంద్ర ప్రభుత్వ విధానాలపై పోరాటమే అజెండాగా కానిస్టిట్యూషనల్ క్లబ్‌లో విపక్షాల ఉమ్మడి సమావేశం
- సమావేశానికి ముందే ఢిల్లీ వీధుల్లో వెలిసిన రాహుల్ గాంధీ వ్యతిరేక పోస్టర్లు.. రాజకీయంగా పెరిగిన వేడి
- మమతా బెనర్జీ, శరద్ పవార్, కేజ్రీవాల్ గతంలో కాంగ్రెస్‌పై చేసిన ఘాటు వ్యాఖ్యలతో కూడిన ఫ్లెక్సీల ప్రదర్శన
- తమిళనాడులో డీఎంకేకు హ్యాండ్ ఇచ్చి.. విజయ్ నూతన పార్టీ 'టీవీకే'తో చేతులు కలిపిన హస్తం పార్టీ

12

## రేవంత్ మార్క్ 'సర్కస్'



11

- విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేస్తున్న కాంగ్రెస్.. కల్వకుంట్ల కవిత తీవ్ర ఆగ్రహం

## భూ రికార్డులకు రాజముద్ర



- నల్లచట్టాన్ని శాశ్వతంగా పూడ్చిపెట్టాం..
- 'మీ భూమి-మీ హక్కు' సభలో సీఎం చంద్రబాబు ప్రకటన

10

## ప్రభుత్వ భూములను కాజేసేవారిపై ఉక్కుపాదం

- బి. ఆర్.ఎస్ హయాంలో ప్రభుత్వ అధికారులే భూదందాలకు పాల్పడ్డారు
- ఇందిరమ్మ ఇళ్ల స్థలపరిశీలనలో వెలుగు చూసిన భూదందా
- హౌసింగ్ బోర్డు భూములను కాజేసిన డిప్యూటీ కలెక్టర్ రాముునాయిక్ సస్పెన్షన్
- సహకరించిన ఉద్యోగుల్లో ఒకరు డిస్మిస్, మరొకరు సస్పెన్షన్
- ఉద్యోగం నుంచి శాశ్వత తొలగింపునకు చర్యలు
- 2016 నుంచి రాము నాయిక్ భూదందాలపై లోతైన దర్యాప్తు
- సబ్ రిజిస్ట్రార్‌ల పాత్రలపై కూడా విచారణ
- అక్రమ సేల్ డీడ్‌ల రద్దుకు మంత్రి పొంగులేటి ఆదేశం



11

## ప్రగతి ప్రస్థానం

మోదీ సంక్షేమ పాలనకు 12 ఏళ్లు



10

## రైతులకు పారదర్శకంగా ఎరువుల పంపిణీ

### దేశానికే ఆదర్శంగా నిలిచిన రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్



- రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రత్యేక యాప్‌కు ప్రణాళికలు రూపొందిస్తున్న పొరుగు రాష్ట్రాలు
- యాప్ లో మరిన్ని మెరుగుదలలు, మీ సేవా కేంద్రాల ద్వారా మరియు టెలిఫోన్ ద్వారా కూడా బుకింగ్ సదుపాయం
- కేంద్రం అన్ని రకాల ఎరువుల సరఫరాలను fertilisers scales application system (FSAS) యాప్ అమలుకు నిర్ణయం

2



## ధరల మంట..!

- వంటగ్యాస్ పెంపుపై కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి విచారం
- గ్లోబల్ సంక్షోభం వల్లే తప్పనిసరి నిర్ణయం
- సిలిండర్ రేటు పెంపుతో సామాన్యుడి కష్టాలు తెలుసన్న మంత్రి
- రవాణా అడ్డంకులు, పరిమిత వనరుల వల్లే ధరల పెంపు

2

## మంత్రి పొన్నం ప్రభాకర్ తో సమావేశమైన రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య, బీసీ సంఘాల నేతలు

- బీసీ ల సమస్యల పై మంత్రి పొన్నం ప్రభాకర్ వినతి పత్రం సమర్పించిన బీసీ సంఘాల నేతలు



హైదరాబాద్ వెలుతురు జూన్ 08:

రాష్ట్రం లో బీసీ గురుకులాలు , హాస్టల్ లకు సొంత భవనాలు నిర్మించాలని ,పెండింగ్ ఫీజుల బకాయిలు చెల్లించాలని , బీసీ రిజర్వేషన్ల రోస్టర్ విధానం సవరించాలని ,విదేశీ విద్య నిధి సంఖ్య పెంచాలని , బీసీ సంక్షేమ శాఖ లో బీసీ ఉద్యోగులు ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరిన బీసీ సంఘాల నేతలు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజేందర్ ,కార్యదర్శి పృథ్వీ గౌడ్ , బలరాం, సాయి మహేందర్, తదితరులు.

# జెండాలకు, ఎజెండాలకు అతీతంగా హైదరాబాద్‌ను...

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**

హైదరాబాద్ మహానగర అభివృద్ధికి రాజకీయాలు, జెండాలు, ఎజెండాలకు అతీతంగా అందరూ కలిసి పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. మియాపూర్‌లో నిర్వహించిన ప్రజాపాలన–ప్రగతి ప్రణాళిక బహిరంగ సభలో పాల్గొన్న ఆయన, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) పరిధిలో రూ.1,674.74 కోట్ల వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

దేశ ఆర్థిక వ్యవస్థను ఢిల్లీ, ముంబై, బెంగుళూరు, కలకత్తా, చెన్నై, హైదరాబాద్ నగరాలు ముందుకు నడిపిస్తున్నాయని సీఎం పేర్కొన్నారు. ఢిల్లీలో కాలుష్యం, ముంబైలో వర్షాల ఇబ్బందులు, బెంగుళూరు, చెన్నై, కలకత్తాల్లో ట్రాఫిక్ సమస్యలు ఉన్నాయని గుర్తుచేస్తూ, హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి అవసరమని చెప్పారు.

భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మహానగరాన్ని మూడు కార్పొరేషన్లుగా విభజించామని, పోలీసు, మున్సిపల్ శాఖల మధ్య సమన్వయం ఉండేలా సరిహద్దులను నిర్ణయించామని తెలిపారు. విశ్వనగరంగా ఎదగాలంటే అందుకు తగిన మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

ఈ సందర్భంగా రూ.161 కోట్లతో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రూ.530 కోట్లతో మియాపూర్ చౌరస్తాలో ఫ్లైఓవర్, రూ.308 కోట్లతో శేరిలింగంపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులకు పునాది వేశారు. రూ.65.53 కోట్లతో నిర్మించిన బాచుపల్లి ఫ్లైఓవర్‌ను ప్రారంభించారు.





అలాగే రూ.229 కోట్లతో ఓఆర్ఆర్ ఇరువైపులా సర్వీస్ రోడ్ల కోసం ప్రధాన వంతెన నిర్మాణం, కొత్త సర్వీస్ రోడ్డు ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. రూ.110 కోట్లతో ఎంజీఐటీ నుంచి మణికొండ వరకు పైప్‌లైన్ రోడ్డు నిర్మాణం, రూ.29.25 కోట్లతో కొల్లూరు ఇంటర్‌చేంజ్ సమీపంలో నాలుగు లేన్ల అప్రోచ్ ర్యాంపుల నిర్మాణం, రూ.26.50 కోట్లతో నానక్‌రామ్‌గూడ–గచ్చిబౌలి ప్రధాన క్యారేజ్‌వే విస్తరణ పనులకు శ్రీకారం చుట్టారు.

విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తూ రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి, రూ.14.40 కోట్లతో మాదాపూర్, నానక్‌రామ్‌గూడ ప్రాంతాల్లో వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

పేదల పిల్లలకు నాణ్యమైన విద్య అందించేందుకు యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ పబ్లిక్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని సీఎం తెలిపారు.

పాఠశాలల నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నామని చెప్పారు.

ఈ సందర్భంగా బీజేపీపై విమర్శలు గుప్పించిన రేవంత్ రెడ్డి, తెలంగాణకు కేంద్ర నిధులు తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు చొరవ చూపడం లేదని ఆరోపించారు. మూసీ అభివృద్ధిని అడ్డుకోవడం ఎందుకని ప్రశ్నించారు. పదేళ్ల కేసీఆర్ పాలన, పన్నెండేళ్ల మోదీ పాలన, తమ 30 నెలల పాలనపై బహిరంగ చర్చకు సిద్ధమని సవాల్ విసిరారు.

త్వరలో గాజులరామారంలో 100 ఎకరాల్లో అంతర్జాతీయ బస్ టెర్మినల్ నిర్మాణం చేపడతామని, మూడు నెలల్లో పనులు ప్రారంభిస్తామని ప్రకటించారు. మెట్రో రెండో దశ విస్తరణ చేపడుతున్నామని, మహానగరంలో లక్ష ఎల్ఐజీ, ఎంఐజీ ఇండ్లను నిర్మించి పేదలకు అందిస్తామని వెల్లడించారు.

ప్రభుత్వ భూములను ఆక్రమణల నుంచి విముక్తం చేసి అక్కడ పేదలకు ఇండ్ల నిర్మాణం చేపడతామని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఇందిరా మహిళా శక్తి ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు.

వచ్చే 24 నెలలు పూర్తిగా అభివృద్ధిపైనే ప్రభుత్వ దృష్టి ఉంటుందని స్పష్టం చేసిన సీఎం, రాజకీయాలకు అతీతంగా హైదరాబాద్ నగరాన్ని, తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు హర్కరా వేణుగోపాల్ రావు, మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎంపీలు వేమ్ నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు అరికెపూడి గాంధీ, మల్‌రెడ్డి రంగారెడ్డి, నవీన్ యాదవ్, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రైతులకు పారదర్శకంగా...

(మొదటి పేజీ తరువాయి)

- **రెండు జిల్లాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్న కేంద్రం**
- **ఇప్పటికే రాష్ట్రానికి చేరిన 3.89 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా**
- **కేటాయింపుల ప్రకారం జూన్ వరకు రావాల్సిన 6 లక్షల మెట్రిక్ టన్నుల కోసం నిరంతర ప్రయత్నాలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**

రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టిన ఫెర్టిలైజర్ యాప్ దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటోందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఎరువుల పంపిణీలో పారదర్శకత, సమర్థత, జవాబుదారీతనాన్ని పెంపొందించడంలో ఈ యాప్ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రైతులకు అవసరమైన సమయంలో, అవసరమైన ప్రాంతంలో ఎరువులు అందుబాటులో ఉండేలా సాంకేతికతను వినియోగిస్తూ తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమం ఇతర రాష్ట్రాలకు సైతం ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.

తెలంగాణలో విజయవంతంగా అమలవుతున్న రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్ పనితీరును పరిశీలించిన అనంతరం, పొరుగు రాష్ట్రాలు కూడా ఇదే తరహాలో ప్రత్యేక యాప్‌లను రూపొందించే దిశగా చర్యలు చేపడుతున్నాయని మంత్రి తెలిపారు. రైతు సంక్షేమం, ఎరువుల పంపిణీలో పారదర్శకత, స్టాక్ నిర్వహణ వంటి అంశాల్లో తెలంగాణ నమూనా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారిందన్నారు.

రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్‌కు ఇప్పటికే కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ ప్రశంసలు లభించాయని తెలిపారు. ఎరువుల పంపిణీలో అక్రమాలకు అడ్డుకట్ట వేయడం, రైతులకు సకాలంలో సమాచారం అందించడం, డీలర్ల వద్ద స్టాక్ లభ్యతపై స్పష్టత కల్పించడం వంటి అంశాల్లో ఈ యాప్ విశేష ఫలితాలను ఇస్తోందన్నారు. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా యాప్ ఆధారిత ఎరువుల పంపిణీ వ్యవస్థను విస్తరించేందుకు కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ కూడా ప్రయత్నాలు చేస్తోందని, ఈ వానాకాలం నుండి పలు రాష్ట్రాల్లోని పైలట్ జిల్లాల్లో కేంద్ర ఎరువుల యాప్ FSAS అమలుచేసేందుకు నిర్ణయం తీసుకుందన్నారు.

రైతుల నుంచి వచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ఫెర్టిలైజర్ యాప్‌లో మరిన్ని మార్పులు, మెరుగుదలలు చేపట్టామని మంత్రి తెలిపారు. జిల్లా వారీగా డీలర్ల స్టాక్ నిర్ధారణకు షెడ్యూలింగ్ వ్యవస్థ, మండల మ్యాపింగ్ సదుపాయం, మీ సేవ కేంద్రాల ద్వారా మరియు టెలిఫోన్ ద్వారా ఎరువుల బుకింగ్ విధానం, రైతుల సందేహాల నివృత్తి కోసం ప్రత్యేక హెల్ప్‌లైన్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పారు. రైతులకు మరింత సులభంగా, వేగంగా సేవలు అందించడమే ఈ మార్పుల లక్ష్యమన్నారు.

ఈ యాప్ ద్వారా రైతులు తమ ప్రాంతంలోని డీలర్ల వద్ద అందుబాటులో ఉన్న ఎరువుల నిల్వలను ముందుగానే తెలుసుకునే అవకాశం కల్పించామని మంత్రి వివరించారు. ఏ డీలర్ వద్ద ఎంత స్టాక్ ఉందో రైతులు తమ మొబైల్ ఫోన్ ద్వారానే తెలుసుకోవచ్చన్నారు. దీంతో అనవసరంగా ఒక దుకాణం నుంచి మరొక దుకాణానికి తిరగాల్సిన అవసరం ఉండదని తెలిపారు. అలాగే ఎరువుల కోసం గంటల తరబడి క్యూలలో నిలబడాల్సిన పరిస్థితులు తగ్గాయని, రైతులు తమకు అనుకూలమైన సమయంలో ఎరువులు పొందగలుగుతున్నారని చెప్పారు.

గతంలో ఎరువుల కొరత సమయంలో లేదా డిమాండ్ అధికంగా ఉన్న సందర్భాల్లో ఎరువులు పక్కదారి పట్టడం, కొందరు మధ్యవర్తులు లాభపడడం వంటి పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. ప్రస్తుతం ఫెర్టిలైజర్ యాప్ అమలుతో ప్రతి దశలో పారదర్శకత పెరిగి, ఎరువుల పంపిణీపై సమర్థవంతమైన పర్యవేక్షణ సాధ్యమవుతోందన్నారు. రైతులకు న్యాయంగా, సకాలంలో ఎరువులు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన యూరియా సరఫరా విషయంలో రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటోందని మంత్రి తెలిపారు. ఏప్రిల్, మే, జూన్ నెలలకు నెలకు 2 లక్షల మెట్రిక్ టన్నుల చొప్పున మొత్తం 6 లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను రాష్ట్రానికి కేటాయించాలని కేంద్ర ఎరువులు మరియు రసాయనాల శాఖ మంత్రి శ్రీ జె.పి. నడ్డాకు పలుమార్లు లేఖలు రాశామని పేర్కొన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం చేసిన నిరంతర ప్రయత్నాల ఫలితంగా ఇప్పటి వరకు రాష్ట్రానికి 3.80 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా చేరిందన్నారు. మిగిలిన యూరియా కూడా సకాలంలో రాష్ట్రానికి చేరేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి ఢిల్లీలోని కేంద్ర శాఖల అధికారులు, ఎరువుల సంస్థలతో నిరంతరం సమన్వయం చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేకంగా ఒక నోడల్ అధికారిని నియమించామని చెప్పారు.

అదేవిధంగా, పోర్టులకు చేరిన యూరియా నిల్వలను రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు త్వరితగతిన తరలించేందుకు ప్రత్యేక అధికారిని కూడా నియమించామని తెలిపారు. రైతులకు అవసరమైన సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందేలా ప్రతి దశను ప్రభుత్వం పర్యవేక్షిస్తోందన్నారు.

ఇలాంటి రైతు సంక్షేమ కార్యక్రమాలను కూడా ప్రతిపక్షాలు రాజకీయ కోణంలో చూడడం బాధాకరమని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. రైతులకు మేలు జరిగే ప్రతి కార్యక్రమాన్ని అడ్డుకునే ప్రయత్నం చేయడం, అపోహలు సృష్టించడం, ప్రజలను తప్పుదోవ పట్టించడం ప్రతిపక్షాల వైఖరిగా మారిందన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన యూరియా యాప్‌పై కూడా బురద చల్లే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

కేంద్ర ప్రభుత్వం సైతం ప్రశంసించే విధంగా తెలంగాణ ప్రభుత్వం సాంకేతికత ఆధారిత వ్యవస్థను రూపొందిస్తే, దానిని అభినందించాల్సింది పోయి విమర్శించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలను రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించడం మానుకోవాలని హితవు పలికారు.

దీర్ఘకాలికంగా ఈ ఫెర్టిలైజర్ యాప్ దేశవ్యాప్తంగా రైతులకు ఎంతో మేలు చేస్తుందని మంత్రి స్పష్టం చేశారు. ఎరువుల లభ్యతపై స్పష్టమైన సమాచారం, సమయపాలన, పారదర్శక పంపిణీ, అక్రమాల నియంత్రణ, రైతులకు సౌకర్యవంతమైన సేవలు వంటి అనేక ప్రయోజనాలు ఈ వ్యవస్థ ద్వారా అందుతాయని పేర్కొన్నారు. వ్యవసాయ రంగంలో సాంకేతికత వినియోగాన్ని మరింత విస్తరించి రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడూ ముందుంటుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు.

# ధరల మంట..!

(మొదటి పేజీ తరువాయి)

- **ప్రత్యామ్నాయ గ్యాస్ సేకరణకు ముమ్మర ప్రయత్నాలు**
- **రవాణా సమయం పెరగడంతో భారీగా ఎగబాకిన రవాణా ఖర్చులు**
- **మూడు నెలల్లోనే రెండోసారి పెరిగిన వంటగ్యాస్ ధర**
- **సిలిండర్‌పై రూ.703 భారీ నష్టాన్ని చవిచూసిన చమురు సంస్థలు**
- **పొరుగు దేశాల కంటే భారత్‌లోనే తక్కువ ధర**
- **వాస్తవ సరఫరా ఖర్చు రూ.1600 పైమాటే**
- **కాంగ్రెస్ సర్కార్‌లో అవినీతి, అంతర్గత కుమ్ములాటలు**
- **డీకే శివకుమార్ పాలనపై జోషి ఘాటు విమర్శలు**

**ధార్వాడ్ వెలుతురు జూన్ 08:**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న అసాధారణ పరిస్థితులు మరియు ఇంధన సంక్షోభం కారణంగానే దేశంలో గృహ వినియోగ వంటగ్యాస్ (ఎల్‌పీజీ) సిలిండర్ ధరలను పెంచాల్సి వచ్చిందని కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి స్పష్టం చేశారు. కర్ణాటకలోని ధార్వాడ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. గ్యాస్ సిలిండర్ ధరల పెంపు పట్ల కేంద్ర ప్రభుత్వం కూడా ఎంతగానో బాధపడుతోందని, విచారం వ్యక్తం చేస్తోందని పేర్కొన్నారు. అయితే ప్రస్తుత అంతర్జాతీయ మార్కెట్ ఇబ్బందులను గమనించకుండా కేవలం రాజకీయం కోసం కేంద్ర ప్రభుత్వాన్ని విమర్శించడం సరికాదన్నారు. ఇంధన రవాణా మార్గాల్లో సజావుగా సరఫరా సాగకపోవడం, ప్రపంచంలో చాలా పరిమిత వనరుల నుంచే ఎల్‌పీజీ లభించడం వంటి సాంకేతిక సమస్యలు ప్రస్తుతం తలెత్తాయని వెల్లడించారు.

ప్రస్తుత కఠిన పరిస్థితుల్లోనూ దేశంలోని ఎల్‌పీజీ మరియు పెట్రోల్, డీజిల్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేదా ఇంధన కొరత కలగకుండా చూసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వం రాత్రింబగళ్లు శ్రమిస్తోందని ప్రహ్లాద్ జోషి తెలిపారు. ఇందులో భాగంగానే గ్యాస్ సేకరణ వనరులను పెంచడానికి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు. భారత్‌కు ఎంతో దూరంలో ఉన్న సరికొత్త దేశాల నుంచి కూడా ప్రస్తుతం గ్యాస్ మరియు ముడి చమురు సేకరణ జరుగుతోందని, దీనివల్ల రవాణా ఖర్చులు (ఫ్రైట్ చార్జీలు) విపరీతంగా పెరిగాయని వివరించారు. సముద్ర మార్గంలో దాదాపు 40 నుండి 45 రోజుల పాటు సుదీర్ఘంగా రవాణా సమయం పడుతుండటంతో అంతర్జాతీయంగా ఇంధన బీమా (ఇన్సూరెన్స్) ఖర్చులు కూడా అమాంతం పెరిగాయని, అందువల్ల సామాన్యుల భారంపై ఆందోళన ఉన్నప్పటికీ గ్యాస్ ధరల పెంపు అనివార్యంగా మారిందని మంత్రి పేర్కొన్నారు.

ప్రపంచవ్యాప్తంగా ఇంధన వ్యయాలు ఊహించని విధంగా పెరిగిపోవడంతో దేశీయ ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ తరుణంలో గృహ వినియోగ వంట గ్యాస్ (ఎల్‌పీజీ) ధరను సిలిండర్‌కు రూ.29 మేర పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గత మూడు నెలల స్వల్ప వ్యవధిలోనే వంటగ్యాస్ ధర పెరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. పశ్చిమా□□యా (మిడిల్ ఈస్ట్) ప్రాంతంలో నెలకొన్న తీవ్ర సైనిక ఘర్షణల కారణంగా అంతర్జాతీయంగా ఇంధన సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మార్చి 7వ తేదీన సిలిండర్‌పై రూ.60 పెంచిన కేంద్ర సర్కార్, మళ్లీ జూన్ 7న గ్యాస్ సిలిండర్ రేటును పెంచుతూ సామాన్యుడిపై అదనపు భారాన్ని మోపింది.

ప్రస్తుతం చమురు సంస్థలు ఎదుర్కొంటున్న నష్టాల తీవ్రతను కేంద్ర ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. తాజా రేటు పెంపు నిర్ణయానికి ముందు వరకు, ప్రభుత్వ రంగ చమురు మార్కెటింగ్ సంస్థలు దేశంలో విక్రయించే ప్రతి ఎల్‌పీజీ సిలిండర్‌పై సుమారు రూ.703 భారీ నష్టాన్ని (అండర్ రికవరీ) చవిచూస్తున్నట్లు ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ భారీ లోటును భరిస్తూ చమురు సంస్థలు ఎక్కువ కాలం సరఫరాను కొనసాగించలేవని, అందుకే వ్యవస్థను కాపాడేందుకు స్వల్ప ధరల సవరణ చేయాల్సి వచ్చిందని కేంద్రం తన నిర్ణయాన్ని సమర్థించుకుంది. అంతర్జాతీయ మార్కెట్ ఒడిదుడుకుల నుండి చమురు సంస్థలను కాపాడటం కూడా దేశ ఇంధన భద్రతలో ఒక భాగమేనని స్పష్టం చేసింది.

వంట గ్యాస్ ధరల పెంపుపై దేశవ్యాప్తంగా విపక్షాల నుండి వస్తున్న విమర్శలను కేంద్ర పెట్రోలియం శాఖ గట్టిగా తిప్పికొట్టింది. పశ్చిమాసియా సంక్షోభం తర్వాత అంతర్జాతీయంగా ఎల్‌పీజీ ముడిసరుకు ధరలు గణనీయంగా పెరిగినప్పటికీ, ప్రపంచంలోని మిగతా దేశాలతో పోలిస్తే అతి తక్కువ ధర మన దేశంలోనే ఉందని వెల్లడించింది. ప్రస్తుతం భారతదేశంలో ప్రతి ఇంటికీ ఒక వంటగ్యాస్ సిలిండర్‌ను సురక్షితంగా సరఫరా చేయడానికి ప్రభుత్వానికి రూ.1,600 కు పైగా వాస్తవ ఖర్చవుతోందని పేర్కొంది. ఈ అంతర్జాతీయ ధరలు పూర్తిగా గ్లోబల్ ప్రామాణికమైన 'సౌదీ కాంట్రాక్ట్ ప్రైస్' తో ముడిపడి ప్రతి నెలా మారుతుంటాయని కేంద్రం స్పష్టమైన ప్రకటన విడుదల చేసింది.

ప్రపంచ దేశాల చమురు, గ్యాస్ రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద ఇటీవలి కాలంలో తీవ్రమైన అంతరాయాలు, దాడులు జరిగాయి. దీనివల్ల గల్ఫ్ ప్రాంతం నుంచి ప్రపంచ దేశాలకు జరిగే గ్యాస్ సరఫరా ఒక్కసారిగా పడిపోయింది. ఈ రవాణా సంక్షోభం కారణంగా ఫిబ్రవరి నెలతో పోలిస్తే అంతర్జాతీయ గ్యాస్ ప్రామాణిక ధర ఏకంగా 46 శాతం మేర పెరిగిందని కేంద్రం వివరించింది. అయినప్పటికీ, మన పొరుగు దేశాలైన పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక వంటి దేశాలలో విక్రయిస్తున్న గ్యాస్ రేట్ల కంటే చాలా తక్కువ ధరకే భారతదేశంలో సామాన్యులకు వంట గ్యాస్‌ను అందిస్తున్నామని, ప్రజలు వాస్తవాలను గ్రహించాలని కోరింది.

కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఇదే వేదికపై కన్నడనాట సాగుతున్న ప్రస్తుత రాజకీయ పరిణామాలపై ఎంతో కీలకమైన, సంచలన వ్యాఖ్యలు చేశారు. కర్ణాటక రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అవినీతి, బంధుప్రీతి మరియు అంతర్గత వర్గపోరుతో కుదేలైపోతోందని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసి కాంగ్రెస్ నేతలు కేవలం పదవుల కోసం కొట్లాడుకుంటున్నారని విమర్శించారు. అధికార పార్టీలో ఉన్న అంతర్గత అసంతృప్తి, అసమ్మతి జ్వాలలు ఇప్పుడు బహిరంగంగానే వీధి రౌడీయిజంలా కనిపిస్తున్నాయని మండిపడ్డారు.

కర్ణాటక ముఖ్యమంత్రిగా డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టిన నాటి నుండి రాష్ట్రంలో అసలైన పాలన పూర్తిగా పడకేసిందని ప్రహ్లాద్ జోషి ఆరోపించారు. ఆయన సీఎంగా సీట్లో కూర్చున్న వెంటనే మంత్రివర్గంలో తీవ్ర అసంతృప్తి చెలరేగిందని, శాఖల కేటాయింపు నచ్చక ఒక సీనియర్ మంత్రి తన పదవికి ఏకంగా రాజీనామా చేసేశారని గుర్తుచేశారు. ఆ అసమ్మతి అక్కడితో ఆగలేదని, మరికొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులు సైతం బహిరంగంగానే ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ధోరణిపై తమ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. కర్ణాటకలో కాంగ్రెస్ సర్కార్ పాలన అస్సలు సవ్యంగా లేదని, రాష్ట్రం వెనుకబడిపోతోందని చెప్పడానికి అక్కడ నిత్యం జరుగుతున్న ఈ రాజకీయ గందరగోళ పరిస్థితులే సజీవ సాక్ష్యాలని ప్రహ్లాద్ జోషి ఎద్దేవా చేశారు.

## మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి, సమస్యలు పరిష్కరించాలి

### ప్రజావాణిలో బీజేపీ కార్పొరేటర్ల వినతి


**కరీంనగర్ వెలుతురు జూన్ 08:**



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించి, పాఠశాలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి విద్యార్థుల ఇబ్బందులను తొలగించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ కార్పొరేటర్లు బండ రమణారెడ్డి , తోట అనిల్ , ఎన్నం లక్ష్మీ ప్రకాష్ , కర్రె పద్మ లు సోమవారం రోజున ప్రజావాణిలో అధికారులకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ కార్పొరేటర్లు మాట్లాడుతూ, కార్పొరేషన్ పరిధిలోని పలు ప్రభుత్వ పాఠశాలలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాఠశాలలు ఈనెల 15న ప్రారంభమవుతాయని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో నగరంలోని అన్ని పాఠశాలలో మౌలిక వసతుల కల్పనపై దృష్టిసారించడానికి తక్షణం చర్యలు చేపట్టాలని కోరారు. ప్రధానంగా త్రాగునీరు , మరుగుదొడ్ల నిర్వహణ , విద్యుదీకరణ , తరగతి గదిలో మరమ్మత్తులపై , మధ్యాహ్న భోజన కిచెన్ షెడ్లు, రక్షణ గోడలు తదితర విషయాలపై అధికారులు దృష్టి సారించాలని విజ్ఞప్తి చేశారు. ప్రధానంగా పాఠశాల ఆవరణలో భారీ వృక్షాల వల్ల ప్రమాదాలు తలెత్తే అవకాశం ఉందని , రాబోయే వర్షాకాలం , ఈదురు గాలులను దృష్టిలో ఉంచుకొని వెంటనే ఆ వృక్షాలను తొలగించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. "కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల దుస్థితిపై అధికారులు, విద్యాశాఖ వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన జరిపి, యుద్ధప్రాతిపదికన సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని అధికారులకు బిజెపి కార్పొరేటర్లు ఎన్నం లక్ష్మీ ప్రకాష్, కర్రె పద్మ , బండ రమణారెడ్డి , తోట అనిల్ లు విజ్ఞప్తి చేశారు.

## CMRF చెక్ అందజేసిన బిఆర్ఎస్ నాయకులు పగిళ్ల రాము

**మునుగోడు, జూన్ 8 వెలుతురు:**



మునుగోడు మండలం లోని పులిపలుపుల గ్రామానికి చెందిన జనగాం మణికంఠ (తండ్రి: శంకర్)కు మంజూరైన ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) రూ.21,000 చెక్కును BRS నాయకులు పగిళ్ల రాము ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా పగిళ్ల రాము మాట్లాడుతూ, ఆపదలో ఉన్న పేద ప్రజలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జనగాం నర్సింహ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను మరింత కట్టుదిట్టం చేయాలి

**నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై కఠిన చర్యలు తప్పవు : మంత్రి పొన్నం ప్రభాకర్**





**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**

రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ కార్యకలాపాలను మరింత విస్తృతంగా చేపట్టి, నిబంధనలు ఉల్లంఘిస్తున్న వాహనాలపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. సెక్రటేరియట్ లో రవాణా శాఖ అధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, ఓవర్‌లోడింగ్ చేస్తున్న వాహనాలు, త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలు, ఫిట్‌నెస్ లేని వాహనాలపై ప్రత్యేక దృష్టి సారించి రాష్ట్రవ్యాప్తంగా విస్తృత తనిఖీలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను ఉల్లంఘిస్తున్న వాహనాలను అవసరమైతే సీజ్ చేయాలని ఆదేశించారు.

చెక్‌పోస్టులు రద్దు చేసిన సమయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను బలోపేతం చేస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తుచేసిన మంత్రి, ప్రస్తుతం అందుబాటులో ఉన్న సిబ్బందిని మరింత సమర్థవంతంగా వినియోగించి తనిఖీలను పెంచాలని సూచించారు. ఈ మేరకు ఉమ్మడి జిల్లాల వారీగా 10 ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందాలు, రాష్ట్ర స్థాయిలో 2 స్పెషల్ స్క్వాడ్‌లను తనిఖీలు ముమ్మరం చేయనున్నాయి.

విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్న మంత్రి, విద్యార్థులను తరలించే స్కూల్ బస్సులు, మినీ వ్యాన్‌లకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ తప్పనిసరిగా ఉండాలని స్పష్టం చేశారు.

అనుమతించిన సామర్థ్యానికి మించి విద్యార్థులను తరలిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేయాలని ఆదేశించారు. ఫిట్‌నెస్ స్కూల్ బస్సులు నడుపుతున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు రాష్ట్రంలో పన్నులు చెల్లించకుండా తిరుగుతున్న అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని మంత్రి అధికారులను ఆదేశించారు. త్రైమాసిక పన్నులు చెల్లించని వాహన యజమానులపై భారీ జరిమానాలు విధించడంతో పాటు అవసరమైతే వాహనాలను సీజ్ చేయాలని పేర్కొన్నారు.అలాగే ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని స్లీపర్ బస్సుల్లో నిబంధనల ఉల్లంఘనలను ఏమాత్రం ఉపేక్షించవద్దని, ఉల్లంఘనలు గుర్తించిన వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి స్పష్టం చేశారు.

సమీక్షా సమావేశంలో స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, అడిషనల్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్, జెటిసి చంద్రశేఖర్ గౌడ్, డిటిసి రవీందర్ కుమార్ గౌడ్, వెంకట రమణ, సురేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పర్యాటక రంగానికి 'రూట్ మ్యాప్'



- రాష్ట్రంలో ఎనిమిది ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రణాళికలు
- ప్రపంచ స్థాయి వసతులు, ఐకానిక్ కట్టడాల దిశగా అడుగులు
- ప్రపంచ స్థాయి పర్యాటక అనుభూతి కల్పించడమే లక్ష్యం
- పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, కన్సల్టెంట్లు, ఆర్కిటెక్టులు, ఇంజినీర్లతో మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష

**హైదరాబాద్, వెలుతురు జూన్ 8:**

తెలంగాణ పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పర్యాటక శాఖ ప్రభుత్వం కసరత్తు మొదలుపెట్టింది. తెలంగాణ నూతన పర్యాటక విధానంలో భాగంగా తొలి దశలో ఎంపిక చేసిన 8 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలను (మొత్తం 27 ప్రత్యేక పర్యాటక ప్రాంతాలు) ఆకర్షణీయమైన గమ్యస్థానాలుగా అభివృద్ధి చేసేందుకు 'సమగ్ర మాస్టర్ ప్లాన్ల' రూపకల్పనపై పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టి సారించారు. సోమవారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో పర్యాటక శాఖ ఉన్నతాధికారులు, ఆర్కిటెక్చరల్ ఇంజనీర్లు, కన్సల్టెంట్లతో ఆయన సుదీర్ఘంగా సమీక్షించారు.

పర్యాటకులు కేవలం ప్రాంతాలను చూడటానికే పరిమితం కాకుండా, ఒక విభిన్నమైన అనుభూతిని (Experience) కోరుకుంటున్నారని మంత్రి పేర్కొన్నారు. పర్యాటకులు మన రాష్ట్రానికి వస్తే వారికి అదొక మరపురాని జ్ఞాపకంగా మిగిలిపోవాలి. ప్రకృతి, వారసత్వం, ఆధ్యాత్మికత, సాహస క్రీడల కలబోతతో కూడిన 'స్లో టూరిజం'ను ప్రోత్సహించాలి అని ఆయన దిశానిర్దేశం చేశారు. పర్యాటకులు కేవలం ఒక ప్రాంతాన్ని సందర్శించి వెళ్లిపోయేలా కాకుండా, అక్కడి ప్రకృతి, చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మికత, స్థానిక జీవనశైలిని ఆస్వాదిస్తూ మరపురాని అనుభూతిని పొందేలా సమగ్ర మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మొదటి దశలో భాగంగా వికారాబాద్, సోమశిల–అలంపూర్, వరంగల్–రామప్ప, నాగార్జునసాగర్, యాదాద్రి–పోచంపల్లి, ఆదిలాబాద్ గిరిజన క్లస్టర్, భద్రాచలం, కాళేశ్వరం ప్రత్యేక పర్యాటక ప్రాంతాలకు ఒకే తరహా ప్రతిపాదనలు కాకుండా, ఆయా ప్రాంతాల ప్రత్యేకతలు, భౌగోళిక పరిస్థితులు, చారిత్రక నేపథ్యం, పర్యాటక అవకాశాలను అధ్యయనం చేసి ప్రత్యేక మాస్టర్ ప్లాన్లు రూపొందించాలని స్పష్టం చేశారు.

ప్రపంచంలోని విజయవంతమైన పర్యాటక గమ్యస్థానాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేసి తెలంగాణకు అనువుగా అమలు చేయాలని సూచించిన మంత్రి, కేరళలోని జటాయు తరహా ప్రాజెక్టులు పర్యాటకులను ఆకర్షిస్తున్న విధానాన్ని పరిశీలించాలని అన్నారు. తెలంగాణలోనూ ఐకానిక్ ల్యాండ్‌మార్క్‌లు, క్యాంటిలీవర్ వ్యూ డెక్స్, స్కైవాక్‌లు, అడ్వెంచర్ యాక్టివిటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రకృతి ఆధారిత అనుభూతులను కల్పించేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.

భువనగిరి కోట అభివృద్ధికి అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్న మంత్రి, కేరళలోని జటాయు ప్రాజెక్టు కంటే భువనగిరి కొండ ప్రాంతం మరింత విస్తీర్ణం కలిగి ఉందని అన్నారు. చారిత్రక వారసత్వాన్ని పరిరక్షిస్తూ దేశంలోనే అత్యుత్తమ హెరిటేజ్, అడ్వెంచర్ టూరిజం కేంద్రంగా భువనగిరిని అభివృద్ధి చేసే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.


సోమశిల–అలంపూర్ సర్క్యూట్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని మంత్రి ఆదేశించారు. సోమశిల కృష్ణా బ్యాక్‌వాటర్స్ ప్రాంతంలో క్రూయిజ్ టూరిజం, వాటర్ స్పోర్ట్స్, ట్రెక్కింగ్ మార్గాలు, ఎత్తైన వ్యూ పాయింట్లు, ఎకో టూరిజం, వెడ్డింగ్ డెస్టినేషన్‌ల అభివృద్ధికి విస్తృత అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. జటప్రోలు, మదనగోపాలస్వామి ఆలయం వంటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రాంతాలను అనుసంధానం చేస్తూ సోమశిల సర్క్యూట్‌ను రాష్ట్రంలోనే అత్యంత ఆకర్షణీయమైన పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దాలని సూచించారు.

తెలంగాణ పర్యాటక రంగం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు కీలక శక్తిగా మారేలా ప్రత్యేక పర్యాటక ప్రాంతాల అభివృద్ధి ప్రణాళికలు ఉండాలని మంత్రి స్పష్టం చేశారు.

ఈ సమీక్ష సమావేశంలో పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్, తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ గౌతమి, పర్యాటక శాఖ డైరెక్టర్ లక్ష్మణ్ రంజిత్ నాయక్, వివిధ ఏజెన్సీల ప్రతినిధులు, కన్సల్టెంట్లు, ఆర్కిటెక్టులు, ఇంజినీర్లు, శాఖ అధికారులు పాల్గొన్నారు.

# పాఠ్యపుస్తకాలను విద్యార్థులకు మొదటి రోజే అందించాలి

**మండల విద్యాధికారి తంగళ్ళపల్లి సత్యనారాయణ**



**మోత్కూర్, జూన్ 8 వెలుతురు న్యూస్:**

ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పాఠశాలలు పునఃప్రారంభమయ్యే తొలి రోజే అందించాలని మండల విద్యాధికారి తంగళ్ళపల్లి సత్యనారాయణ ప్రధానోపాధ్యాయులకు సూచించారు. సోమవారం స్థానిక మండల వనరుల కేంద్రం (ఎంఆర్సీ)లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా 2026–27 విద్యా సంవత్సరానికి సంబంధించిన పాఠశాల సంసిద్ధత కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. పాఠశాలల పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు, బడిబాట కార్యక్రమం ద్వారా విద్యార్థుల నమోదులో కనీసం 10 శాతం వృద్ధి సాధించేలా చర్యలు చేపట్టాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి మోత్కూర్, దాచారం గ్రామాల ఎంపీపీఎస్ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అన్ని పాఠశాలలు ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎస్ మోత్కూర్ ప్రధానోపాధ్యాయులు డి. అరవింద్ రాయుడు, ఆర్‌పీలు పి. సుధాకర్, వీరవెల్లి ప్రవీణ్ కుమార్, ప్రధానోపాధ్యాయులు ఆర్. సంధ్యారాణి, వి. శ్రీదేవి, వెంకటహరి, శ్యామ్‌కుమార్, అరుణాదేవి, ఎంఆర్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బుజిలాపురంలో దొంగల హల్చల్, పట్టపగలే ఐదున్నర తులాల బంగారం, 33 తులాల వెండి అపహరణ



**మోత్కూర్, జూన్ 8, వెలుతురు న్యూస్:**

మోత్కూర్ మున్సిపాలిటీ పరిధిలోని బుజిలాపురం గ్రామంలో సోమవారం పట్టపగలు దొంగతనం జరిగిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. దుండగులు ఇంటి తాళాలు పగులగొట్టి ఐదున్నర తులాల బంగారం, 33 తులాల వెండి ఆభరణాలతో పాటు నగదును అపహరించినట్లు బాధితులు తెలిపారు. బాధితులు మల్లిపెద్ది వెంకటరెడ్డి, భార్య పద్మ తెలిపిన వివరాల ప్రకారం, సోమవారం ఉదయం 11 గంటల సమయంలో వెంకట్ రెడ్డి వ్యవసాయ అవసరాల కోసం ఎరువులు తెచ్చేందుకు మోత్కూరుకు వెళ్లారు. గత మూడు రోజుల క్రితం ఆయన భార్య కూడా వేరే గ్రామానికి వెళ్లడంతో ఇంటికి తాళం వేసి వెళ్లాడు. అనంతరం మధ్యాహ్నం ఒంటిగంటన్నర సమయంలో తిరిగి ఇంటికి చేరుకోగా ప్రధాన ద్వారానికి ఉన్న తాళాలు పగులగొట్టి ఉండటం గమనించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పాటు కుటుంబ సభ్యులను పిలిపించారు. అనంతరం ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి ఉండటంతో అందులో భద్రపరిచిన నాలుగు తులాల బంగారు చంద్రహారం, అర తులం బంగారు బ్రాస్లెట్, అర తులం బంగారు ఉంగరాలు రెండు, అర తులం బంగారు కమ్మలు, మూడు తులాల వెండి గొలుసు, 30 తులాల వెండి పట్టాలు రెండు జతలు, రూ.5 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. గ్రామంలోని సీసీ కెమెరాల పుటేజీలను సేకరించి, అనుమానితుల కదలికలపై దర్యాప్తు చేపట్టారు. బాధితుడు మల్లిపెద్ది వెంకటరెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు.వారం క్రితం పక్కన గ్రామం అనాజిపురంలో కూడా ఇదే తరహా దొంగతనం జరిగింది.వరుస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు.పోలీసు విభాగం నిఘా పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

# మహిళా శక్తి మహాసభకు సర్వం సిద్ధం

- తెలంగాణ మహిళల ఆర్థిక సాధికారతకు మరో చారిత్రక మైలురాయి
- మహిళా శక్తి మహాసభను విజయవంతం చేయాలని రాష్ట్ర మహిళలకు మంత్రులు సీతక్క ,పొన్నం ప్రభాకర్ పిలుపు

**హైదరాబాద్, వెలుతురు జూన్ 8:**

తెలంగాణ మహిళా సాధికారత చరిత్రలో మరో సువర్ణ అధ్యాయానికి హైదరాబాద్ పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న "మహిళా శక్తి మహాసభ"కు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి విస్తరణ, వ్యాపారాభివృద్ధి, నిర్ణయాత్మక భాగస్వామ్యాన్ని లక్ష్యంగా పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం గత రెండేళ్లుగా అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ మహాసభ ప్రతీకగా నిలవనుంది. ఈ నేపథ్యంలో సోమవారం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు ఆధ్వర్యంలో అన్ని శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ మహాసభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. మహిళా సంఘాల బలోపేతం కోసం ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను, మహిళల ఆర్థికాభివృద్ధికి చేపట్టిన కార్యక్రమాలను ఆయన సభలో వివరించనున్నారు. అదే వేదికపై మహిళా సంఘాలకు ప్రస్తుతం అందుతున్న రూ.5 లక్షల రుణ పరిమితిని రూ.10 లక్షలకు పెంచే కీలక నిర్ణయాన్ని ప్రకటించనున్నారు. సభ సందర్భంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులు, మహిళా సంఘాలు నిర్వహిస్తున్న ఆర్టీసీ అద్దె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులు పంపిణీ చేయనున్నారు. అదేవిధంగా కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్‌ఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు.

మహిళా సంఘాల భాగస్వామ్యంతో కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు.

మహిళల ఆర్థిక భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న నమూనా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని ప్రభుత్వం భావిస్తోంది.

అలాగే మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు కలిగిన రూ.10,700 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనాలను సభలో వివరిస్తారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన సానుకూల మార్పులను ప్రజలకు తెలియజేయనున్నారు.

రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు చేరుకునేందుకు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకున్నారు. తెలంగాణ నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ మహాసభ, మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణంలో మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది.

సోమవారం సాయంత్రం పరేడ్ గ్రౌండ్‌లో సభ ఏర్పాట్లను మంత్రులు దనసరి అనసూయ సీతక్క, పొన్నం ప్రభాకర్ పరిశీలించారు.

వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి సభను విజయవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. మహిళల రాకపోకలు, తాగునీరు, వైద్య సదుపాయాలు, పారిశుధ్యం, భద్రత, ట్రాఫిక్ నియంత్రణ తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ముందుకు నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, సూక్ష్మ వ్యాపారాల విస్తరణ, ఉపాధి అవకాశాల పెంపునకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని తెలిపారు.

రాష్ట్రంలోని ప్రతి స్వయం సహాయక సంఘ సభ్యురాలు ఈ మహాసభలో భాగస్వామ్యం కావాలని, మహిళా ఐక్యత, ఆత్మవిశ్వాసం, ఆర్థిక శక్తిని ప్రపంచానికి చాటిచెప్పే ఈ చారిత్రక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్ పిలుపునిచ్చారు.

# కాంగ్రెస్ సీఎం కుర్చీలో టీడీపీ ఆత్మనా....?

రాజకీయాల్లో సంకేతాలకు ప్రత్యేక ప్రాధాన్యం ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఒక నాయకుడు చేసే వ్యాఖ్య, ఒక కార్యక్రమానికి హాజరుకావడం, ఒక చారిత్రక వ్యక్తిత్వాన్ని ప్రస్తావించడం వంటి అంశాలు సాధారణ రాజకీయ చర్యలుగా కనిపించినా వాటి వెనుక దాగి ఉన్న సందేశాలు ఎంతో లోతైనవిగా ఉంటాయి. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవలి కాలంలో దివంగత నందమూరి తారక రామారావు (ఎన్టీఆర్) పేరును తరచుగా ప్రస్తావించడం, హైదరాబాద్ అమీర్‌పేట మైత్రీవనం చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో స్వయంగా పాల్గొనడం, ఆయన ఆశయాలను కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలతో అనుసంధానించడం వంటి పరిణామాలు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చలకు దారితీశాయి.

తెలుగుదేశం పార్టీ పుట్టుకే కాంగ్రెస్ వ్యతిరేక రాజకీయాల పునాదులపై జరిగింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తరచూ ముఖ్యమంత్రులను మార్చడం, ఢిల్లీ నాయకత్వం నిర్ణయాలకు రాష్ట్ర నాయకత్వం బందీగా మారడం, తెలుగువారి ఆత్మగౌరవానికి భంగం కలిగించే రాజకీయ పరిస్థితులను ఎదుర్కొన్న నేపథ్యంలో ఎన్టీఆర్ తెలుగుదేశం పార్టీని స్థాపించారు. "తెలుగు వారి ఆత్మగౌరవం" అనే నినాదం కేవలం రాజకీయ నినాదం మాత్రమే కాదు, ఒక సామాజిక ఉద్యమంగా మారింది. కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా ఏర్పడిన ఆ పార్టీ దశాబ్దాల పాటు తెలుగు రాజకీయాలపై గాఢమైన ముద్ర వేసింది.

అలాంటి పార్టీ ద్వారా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన వ్యక్తే నేడు తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి నాయకత్వం వహిస్తున్న రేవంత్ రెడ్డి. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణలో టీడీపీ ప్రభావం క్రమంగా తగ్గిపోతుండగా, రాజకీయ పరిస్థితులను అంచనా వేసిన రేవంత్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. కొద్దికాలంలోనే ఆయన పార్టీకి ప్రధాన ముఖచిత్రంగా ఎదిగారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధిపత్యం కొనసాగుతున్న సమయంలో కాంగ్రెస్‌లో చాలామంది నాయకులు రక్షణాత్మక ధోరణిలో వ్యవహరిస్తే, రేవంత్ మాత్రం ప్రత్యక్ష రాజకీయ పోరాటాన్ని ఎంచుకున్నారు. అదే ఆయన ఎదుగుదలకు బాట వేసింది.

పీసీసీ అధ్యక్షుడిగా పార్టీకి కొత్త ఊపు తీసుకురావడం, కాంగ్రెస్ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపడం, చివరకు పార్టీని అధికారంలోకి తీసుకురావడం ద్వారా రేవంత్ తన రాజకీయ సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు. అయితే ఆయన ఎదుగుదల కాంగ్రెస్‌లో దశాబ్దాలుగా పనిచేసిన సీనియర్ నాయకులకు సహజంగానే అసౌకర్యాన్ని కలిగించిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో వినిపిస్తూ ఉంటుంది. ఉత్తమ్ కుమార్ రెడ్డి, భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు, దామోదర రాజనర్సింహ, షబ్బీర్ అలీ, వి.హనుమంతరావు వంటి నాయకులు సంప్రదాయ కాంగ్రెస్ రాజకీయ సంస్కృతికి ప్రతినిధులు. కానీ పార్టీ అధిష్ఠానం మద్దతు రేవంత్ వైపే ఉండటంతో ప్రత్యక్ష సవాళ్లు పెద్దగా కనిపించలేదు.

ఇక్కడే మరో ఆసక్తికర అంశం ముందుకు వస్తోంది. కాంగ్రెస్ ముఖ్యమంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి ఎందుకు మళ్లీ మళ్లీ ఎన్టీఆర్‌ను ప్రస్తావిస్తున్నారు? ఖమ్మం సభలో టీడీపీని అణచివేయడానికి బీఆర్ఎస్ కుట్ర చేసిందని విమర్శించడం, ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన రెండు రూపాయల బియ్యం పథకాన్ని ప్రస్తుత సన్నబియ్యం పథకానికి స్ఫూర్తిగా పేర్కొనడం, కాంగ్రెస్‌కు ఇందిరాగాంధీ ఎంత ముఖ్యమో తెలుగు ఆత్మగౌరవానికి ఎన్టీఆర్ అంతే ముఖ్యమని చెప్పడం రాజకీయంగా గమనించదగ్గ పరిణామాలు.

ఇది కేవలం వ్యక్తిగత అభిమానమా? లేక రాజకీయ వ్యూహమా? అన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నమవుతోంది.

తెలంగాణలో టీడీపీ సంస్థాగతంగా బలహీనపడినా, ఆ పార్టీకి చెందిన కేడర్ పూర్తిగా కనుమరుగైపోలేదు. గ్రామీణ ప్రాంతాల్లో, ముఖ్యంగా పాత రాజకీయ కార్యకర్తల్లో ఇప్పటికీ ఎన్టీఆర్ పట్ల అభిమాన భావం ఉంది. తెలంగాణ ఏర్పాటుతో టీడీపీకి రాజకీయ స్థలం తగ్గిపోయినప్పటికీ, ఆ పార్టీకి చెందిన సామాజిక, భావోద్వేగ వారసత్వం ఇంకా మిగిలే ఉంది. రేవంత్ రెడ్డి ఈ వర్గాలను కాంగ్రెస్‌కు మరింత దగ్గర చేయాలనే వ్యూహంతో ఎన్టీఆర్ వారసత్వాన్ని ప్రస్తావిస్తున్నారనే అభిప్రాయం కూడా ఉంది.

మరోవైపు విమర్శకులు మాత్రం భిన్నమైన వాదన చేస్తున్నారు. ఓటుకు నోటు కేసు, కేంద్ర రాజకీయాల ప్రభావం, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో రేవంత్‌కు ఉన్న పాత రాజకీయ అనుబంధాలు వంటి అంశాలను ప్రస్తావిస్తూ ఆయన చర్యలను అనుమానాస్పద కోణంలో చూస్తున్నారు. అయితే ఇప్పటివరకు వీటికి సంబంధించిన నిర్ధారిత ఆధారాలు లేకపోవడం వల్ల ఇవి ప్రధానంగా రాజకీయ ప్రచారంగానే మిగిలిపోయాయి.

వాస్తవానికి రాజకీయాల్లో గత అనుబంధాలను పూర్తిగా విడిచిపెట్టడం చాలా అరుదు. ఒక నాయకుడు పార్టీ మారినా తన రాజకీయ ప్రయాణాన్ని తీర్చిదిద్దిన వ్యక్తుల పట్ల గౌరవాన్ని కొనసాగించవచ్చు. అందువల్ల ఎన్టీఆర్‌ను స్మరించడం తప్పనిసరిగా టీడీపీ పునరుద్ధరణకు సంకేతం అని చెప్పడం కూడా అతిశయోక్తే అవుతుంది.

అయితే ఈ చర్చల మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం ఎదుర్కొంటున్న అసలు సవాలు మాత్రం వేరే ఉంది. అది పాలన. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలు, వందలాది వాగ్దానాల అమలు విషయంలో ప్రజల్లో పెరుగుతున్న అంచనాలు ప్రభుత్వానికి పెద్ద పరీక్షగా మారుతున్నాయి. ఆర్థిక పరిమితులు, పెరుగుతున్న సంక్షేమ వ్యయాలు, అభివృద్ధి అవసరాలు అన్నీ కలిసి ప్రభుత్వంపై ఒత్తిడిని పెంచుతున్నాయి. ముఖ్యమంత్రి స్వయంగా ఆర్థిక పరిమితుల గురించి ప్రస్తావించడం కూడా ఈ పరిస్థితికి ప్రతిబింబం.

ప్రజాస్వామ్యంలో చివరకు నాయకుడిని అంచనా వేయేది అతని రాజకీయ గతం కాదు, ప్రస్తుత పాలన. రైతులకు ఇచ్చిన హామీలు అమలవుతున్నాయా? నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయా? మహిళా సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అమలవుతున్నాయా? సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతుల్యత సాధ్యమవుతోందా? ఇవే ప్రజల తీర్పును నిర్ణయించే అంశాలు.

ఇలాంటి సమయంలో కర్ణాటక రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలు తెలంగాణ కాంగ్రెస్‌లో కూడా చర్చనీయాంశమవుతున్నాయి. కర్ణాటకలో ముఖ్యమంత్రి మార్పు ప్రక్రియ సజావుగా కొనసాగుతుండటం, సిద్ధరామయ్య తర్వాత డీకే శివకుమార్ బాధ్యతలు చేపట్టారు.కాంగ్రెస్ అంతర్గత వ్యవస్థ ఎలా పనిచేస్తుందనే విషయాన్ని గుర్తు చేస్తోంది. కాంగ్రెస్ పార్టీ సంప్రదాయంగా వ్యక్తుల కంటే సంస్థకు ప్రాధాన్యం ఇచ్చే రాజకీయ సంస్కృతిని కలిగి ఉంది. అధిష్ఠానం నిర్ణయాలు తుది నిర్ణయాలుగా మారడం కాంగ్రెస్ రాజకీయ వ్యవస్థలో కొత్త విషయం కాదు.

అందుకే తెలంగాణలో కూడా కొందరు వర్గాలు ముఖ్యమంత్రి మార్పుపై ఊహాగానాలు చేస్తుంటాయి. కానీ ప్రస్తుతం అందుబాటులో ఉన్న రాజకీయ సంకేతాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ అధిష్ఠానం తెలంగాణలో నాయకత్వ మార్పు గురించి ఆలోచిస్తున్నట్లు ఎటువంటి స్పష్టమైన ఆధారాలు కనిపించడం లేదు. రాష్ట్రంలో పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇంకా చాలా తక్కువ సమయం మాత్రమే గడిచింది. ప్రభుత్వం పనితీరు ఆధారంగా భవిష్యత్తులో నిర్ణయాలు ఉండవచ్చు గానీ, ప్రస్తుత పరిస్థితుల్లో స్థిరత్వానికే అధిష్ఠానం ప్రాధాన్యం ఇస్తున్నట్లు కనిపిస్తోంది.

రాజకీయ చరిత్ర ఒక విషయాన్ని స్పష్టంగా చెబుతుంది. నాయకత్వ సంక్షోభాలు ఒక్కరోజులో పుట్టవు. చిన్నచిన్న అసంతృప్తులు, ఎన్నికల ఫలితాలు, పరిపాలనా వైఫల్యాలు, సామాజిక సమీకరణాల్లో మార్పులు కలిసి పెద్ద రాజకీయ పరిణామాలకు దారితీస్తాయి. అదే సమయంలో సమర్థవంతమైన నాయకత్వం ఈ సవాళ్లను అవకాశాలుగా మలుచుకొని మరింత బలపడగలదు.

తెలంగాణలో రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు ఈ నేపథ్యంలో అత్యంత కీలకంగా మారనున్నాయి. హైదరాబాద్ రాజకీయాలు రాష్ట్ర రాజకీయాల దిశను నిర్ణయించే స్థాయిలో ప్రభావం చూపుతాయి. కాంగ్రెస్ నగరంలో తన ప్రభావాన్ని పెంచుకోగలిగితే రేవంత్ నాయకత్వం మరింత బలపడుతుంది. ఫలితాలు నిరాశాజనకంగా ఉంటే అంతర్గత విమర్శలు పెరిగే అవకాశం ఉంటుంది.

అంతిమంగా చూస్తే తెలంగాణ రాజకీయాల్లో ప్రస్తుతం జరుగుతున్న చర్చలన్నీ ఒకే అంశం చుట్టూ తిరుగుతున్నాయి. అది నాయకత్వం కాదు, ప్రజా విశ్వాసం. ఎన్టీఆర్ పేరు ప్రస్తావన కావచ్చు, టీడీపీ వారసత్వంపై చర్చ కావచ్చు, కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలు కావచ్చు, కర్ణాటకలో నాయకత్వ మార్పు కావచ్చు – ఇవన్నీ రాజకీయ చర్చలకు అంశాలే. కానీ ప్రజల జీవితాలను ప్రభావితం చేసేది ప్రభుత్వ పనితీరు మాత్రమే.

రైతు సంక్షేమం, ఉపాధి, పెట్టుబడులు, మౌలిక వసతులు, విద్య, వైద్యం, సామాజిక న్యాయం వంటి అంశాల్లో ప్రభుత్వం విజయవంతమైతే రాజకీయ విమర్శలు క్రమంగా బలహీనపడతాయి. అదే ప్రజల అంచనాలను అందుకోలేకపోతే బలమైన నాయకత్వం కూడా సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇదే ప్రజాస్వామ్య రాజకీయాల అసలు సూత్రం.

కాబట్టి తెలంగాణలో ముఖ్యమంత్రి మార్పు గురించి జరుగుతున్న చర్చలను ఇప్పటికైతే రాజకీయ ఊహాగానాలుగానే చూడాలి. కానీ ఆ ఊహాగానాలు ఎందుకు పుడుతున్నాయి, అవి ఎలాంటి రాజకీయ సంకేతాలను ప్రతిబింబిస్తున్నాయి అనే అంశాలను నిర్లక్ష్యం చేయలేం. ఎందుకంటే రాజకీయాల్లో ప్రతి సంకేతం ఒక సందేశం. ప్రతి సందేశం వెనుక ఒక వ్యూహం ఉంటుంది. ఆ వ్యూహాల కంటే గొప్పది మాత్రం ప్రజల తీర్పే. చివరకు తెలంగాణ రాజకీయాల భవిష్యత్తును నిర్ణయించేది నాయకుల మధ్య సంబంధాలు కాదు, ప్రజలకు ఇచ్చిన హామీల అమలే.



మన్నారం నాగరాజు
సామాజిక రాజకీయ విశ్లేషకులు

# గురుకులాల్లో అడ్మిషన్ల నుంచి అకాడమిక్స్ వరకు పూర్తి పారదర్శకత పాటించాలి



- విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్యపై రాజీ లేదు
- ఫుడ్ పాయిజన్ ఘటనలకు తావులేకుండా పకడ్బందీ చర్యలు
- టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ సిబ్బందితో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సమీక్ష

**హైదరాబాద్, వెలుతురు జూన్ 8:**

తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు రాష్ట్రంలోని పేద, దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే జ్ఞాన కేంద్రాలని, విద్యార్థుల భద్రత, నాణ్యమైన విద్య, పోషకాహార విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని సంక్షేమ శాఖ మంత్రి శ్రీ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గారు స్పష్టం చేశారు.

జూన్ విద్యా సంవత్సరాన్ని దృష్టిలో ఉంచుకుని విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

సోమవారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయం నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) పరిధిలోని ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది, జోనల్ అధికారులు, ప్రధాన కార్యాలయ సిబ్బందితో మంత్రి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... తెలంగాణ గురుకులాలు నేడు కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ఫలితాలు సాధిస్తూ దేశవ్యాప్తంగా గుర్తింపు పొందుతున్నాయని అన్నారు. ఈ స్థాయికి తీసుకురావడంలో ప్రిన్సిపాల్స్, ఉపాధ్యాయులు, సిబ్బంది చేసిన కృషి అభినందనీయమని పేర్కొన్నారు.

అయితే సాధించిన విజయాలతో సంతృప్తి చెందకుండా మరింత మెరుగైన ఫలితాల కోసం కృషి చేయాలని సూచించారు.

విద్యార్థుల సంక్షేమం, విద్యా ప్రమాణాల పెంపు, క్రమశిక్షణ, భద్రత వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యంతో చూడాలని ఆదేశించారు.

### ఫుడ్ పాయిజన్ ఘటనలకు అవకాశం ఇవ్వొద్దు

ఇటీవలి కాలంలో కొన్ని విద్యాసంస్థల్లో చోటుచేసుకున్న ఆహార సంబంధిత ఘటనలను ప్రస్తావించిన మంత్రి, గురుకులాల్లో అలాంటి పరిస్థితులు తలెత్తకుండా అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు అందించే ఆహార పదార్థాల కొనుగోలు నుంచి వంట ప్రక్రియ, నిల్వ, పంపిణీ వరకు ప్రతి దశలో నాణ్యతా ప్రమాణాలు ఖచ్చితంగా పాటించాలని ఆదేశించారు. వంటశాలలు, స్టోర్‌రూమ్‌లు, డైనింగ్ హాల్స్‌ను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాలని, తాగునీటి నాణ్యతను తరచూ పరీక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యం పట్ల సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని చెప్పారు.

### "ప్రతి పీరియడ్‌కు ప్రణాళికా బద్ధమైన బోధన

అకాడమిక్ పరంగా ఈ విద్యా సంవత్సరాన్ని మరింత ఫలవంతంగా మార్చేందుకు ప్రతి పాఠశాల కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని మంత్రి సూచించారు.పీరియడ్ వారీగా పాఠ్యాంశాల బోధన, వారాంత సమీక్షలు, నెలవారీ విద్యా ప్రగతి నివేదికలు తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశించారు. విద్యార్థుల అభ్యాస స్థాయిని నిరంతరం అంచనా వేస్తూ ప్రత్యేక శ్రద్ధ అవసరమైన వారికి అదనపు అకాడమిక్ సపోర్ట్ అందించాలని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, జేఈఈ, నీట్, క్లాట్, సీయూఈటీ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

### అడ్మిషన్లలో పూర్తి పారదర్శకత

ప్రవేశాల ప్రక్రియలో ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పూర్తిస్థాయి పారదర్శకత పాటించాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ప్రతి విద్యార్థికి అవకాశం కల్పించాలని, అడ్మిషన్ల విషయంలో ఎక్కడా నిర్లక్ష్యం లేదా అవకతవకలకు అవకాశం ఇవ్వొద్దని హెచ్చరించారు.

### వర్షాకాలానికి ముందస్తు చర్యలు

ప్రస్తుతం వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో పాఠశాలలు, హాస్టళ్లలో అవసరమైన మరమ్మత్తులను వెంటనే పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. పైకప్పుల లీకేజీలు, విద్యుత్ వ్యవస్థ, తాగునీటి సౌకర్యాలు, పారిశుద్ధ్య నిర్వహణ, హాస్టల్ గదులు, వంటశాలలు, మరుగుదొడ్ల పరిస్థితిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన, అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలని తెలిపారు.

### విద్యార్థులే గురుకులాల కేంద్రబిందువు

ప్రతి విద్యార్థిని తమ సొంత పిల్లలుగా భావించి చూసుకోవాలని మంత్రి సూచించారు. వారి విద్యా ప్రగతి మాత్రమే కాకుండా ఆరోగ్యం, మానసిక స్థితి, వ్యక్తిత్వ వికాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలపై కూడా ప్రత్యేక శ్రద్ధ చూపాలని చెప్పారు. గురుకులాలు కేవలం పరీక్షల్లో మార్కులు సాధించే కేంద్రాలు కాకుండా, సమాజానికి బాధ్యతగల పౌరులను తయారు చేసే సంస్థలుగా నిలవాలని పేర్కొన్నారు.

### సిబ్బంది సమస్యల పరిష్కారానికి కృషి

ఉపాధ్యాయులు, సిబ్బంది ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందని మంత్రి తెలిపారు. సిబ్బంది సంక్షేమం, సేవా సంబంధిత అంశాలు, పరిపాలనా సమస్యలపై సంస్థ యాజమాన్యంతో ప్రత్యేకంగా చర్చించి సాధ్యమైనంత వరకు పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. సిబ్బంది సంతృప్తి, విద్యార్థుల విజయానికి పరస్పర సంబంధం ఉందని, అందుకే ఉద్యోగుల సంక్షేమానికి కూడా ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. తెలంగాణ గురుకులాలను దేశంలోనే అత్యుత్తమ రెసిడెన్షియల్ విద్యా వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, టీజీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్ కార్యదర్శి (ఎఫ్ఏసీ) కంభంపాటి శారద, డిప్యూటీ సెక్రటరీ డి. శ్రీనివాసులు, అసిస్టెంట్ సెక్రటరీ (అకౌంట్స్) చిన్న సాయిలు, ఓఎస్‌డీ వై.జే. విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళా శక్తి మహా సభకు పరేడ్ గ్రౌండ్ సిద్ధం



**తెలంగాణ మహిళల ఆర్థిక సాధికారతకు మరో మైలురాయి**

**మహిళా శక్తిని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపు**

**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**

తెలంగాణ మహిళా ఉద్యమ చరిత్రలో మరో కీలక ఘట్టానికి హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్ వేదిక కానుంది. రాష్ట్రవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలను ఒకే వేదికపైకి తీసుకువస్తూ నిర్వహిస్తున్న మహా మహిళా సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం సాయంత్రం 4 గంటలకు జరగనున్న ఈ భారీ కార్యక్రమానికి సుమారు 25 వేల మంది మహిళలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో సీఎస్ రామకృష్ణరావు, అన్ని శాఖల ఉన్నతాధికారులతో సచివాలయంలో సోమవారం నాడు సమీక్ష నిర్వహించారు.

గత రెండేళ్లుగా మహిళల ఆర్థిక స్వావలంబన, ఉపాధి అవకాశాల విస్తరణ, వ్యాపారాభివృద్ధి లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు ఈ సభ ప్రతీకగా నిలవనుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తారు. అదే వేదికపై మహిళా సంఘాల రుణ పరిమితిని ప్రస్తుతం ఉన్న రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచడంపై సీఎం ప్రకటన చేయనున్నారు. సభలో మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాల కింద రూ.500 కోట్ల చెక్కులను పంపిణీ చేయనున్నారు. మహిళా సంఘాల ఆర్టీసీ అద్దె బస్సుల హైర్ చార్జీల కింద రూ.20.30 కోట్ల చెక్కులను అందజేయనున్నారు. అలాగే కొత్త బస్సుల కొనుగోలు కోసం టీజీఎస్ఆర్టీసీకి రూ.199 కోట్ల ఆర్థిక సహాయాన్ని అందించనున్నారు. ఈ సభలో ప్రత్యేక ఆకర్షణగా మహిళా సంఘాలు కొనుగోలు చేసి ఆర్టీసీకి అద్దెకిచ్చిన 553 బస్సులను ముఖ్యమంత్రి జెండా ఊపి ప్రారంభించనున్నారు. మహిళల భాగస్వామ్యంతో నడుస్తున్న ఈ వినూత్న రవాణా నమూనా రాష్ట్రంలో మహిళా సాధికారతకు కొత్త గుర్తింపుగా నిలుస్తోంది. మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలకు ఇప్పటివరకు రూ.10,700 కోట్ల మేర కలిగిన ఆదా ప్రయోజనాలను వివరించానున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు మహిళల జీవితాల్లో తీసుకొచ్చిన మార్పులను సభలో వివరించనున్నారు. ఇప్పటికే జిల్లాల నుంచి వేలాది మంది మహిళలు తమ సంఘాలకు చెందిన సొంత బస్సుల్లో హైదరాబాద్‌కు తరలివచ్చేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి మహిళా శక్తి ఒకే వేదికపై సమీకృతం కానున్న ఈ సభ, తెలంగాణ మహిళల ఆర్థిక ప్రగతి ప్రయాణానికి మరో చారిత్రక మైలురాయిగా నిలవనుంది. సభ ఏర్పాట్లను మంత్రి సీతక్క సోమవారం సాయంత్రం పరిశీలించారు. శాఖలు సమన్వయంతో పనిచేసి సభ సజావుగా జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళలను కేవలం లబ్ధిదారులుగా కాకుండా ఆర్థిక వ్యవస్థను నడిపించే భాగస్వాములుగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. మహిళా సంఘాల బలోపేతం, ఆర్థిక స్వావలంబన, వ్యాపార విస్తరణకు ప్రభుత్వం అండగా నిలుస్తోందని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి మహిళా సంఘ సభ్యురాలు ఈ మహాసభలో భాగస్వామ్యం కావాలని, మహిళా శక్తి ఐక్యతను చాటే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి సీతక్క పిలుపునిచ్చారు.

# కట్ట మహేశ్వర స్వామి శివలింగానికి ప్రత్యేక పూజలు చేస్తున్న శివ స్వాముల గురుస్వామి లొంగరి యాదగిరి, భక్తులు

- ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి ఆధ్వర్యంలో 14వ సోమవారం అన్నదాన కార్యక్రమం
- కంఠమహేశ్వరస్వామికి శివలింగానికి ప్రత్యేక పూజలు చేసిన అన్నదాన ప్రభువు గౌడ సంఘం అధ్యక్షుడు తంగడపల్లి నరేందర్ గౌడ్





**మంచాల వెలుతురు జూన్ 08:**

మంచాల మండలం ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో ప్రతిసోమవారం రోజు గౌడ సంఘం పెద్దలు దాతల సహకారంతో శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి అ న్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు ఈసోమవారం అన్నదాన ప్రభువు గౌడ సంఘం అధ్య క్షుడు తంగడపల్లి నరేందర్ గౌడ్ ముందుగా కంఠమహేశ్వరస్వామికి శివలింగానికి ప్రత్యేక పూజలు చేసి న గౌడ సంఘం అధ్యక్షుడు తంగడపల్లి నరేందర్ గౌడ్ గౌడ సంఘం ఉపాధ్యక్షుడు సుంకరి ప్రవీణ్ గౌడ్ వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ కొత్తపల్లిశేఖర్ గౌడ్ బొద్రమోని అంజయ్య ముదిరాజ్ అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు సుంకరి జంగయ్యగౌడ్ చెరుకు నరసింహగౌడ్ ఎన్నుదుల సురేష్ మాడపాకుల యాదగిరి బొగ్గులపల్లి రాకే ష్ రెడ్డి అంతటి దశరథ గౌడ్ బూర రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ గ్రామం - సురక్షిత జీవనం లక్ష్యంగా కొండకల్ గ్రామసభ

**పరిశుభ్రత, వనమహోత్సవం, రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించిన ఎంపీడీవో ప్రవీణ్ కుమార్**





**శంకర్పల్లి, వెలుతురు జూన్ 8 :**

"స్వచ్ఛగావ్ – సురక్షిత్ జల వాయు" కార్యక్రమంలో భాగంగా కొండకల్ గ్రామపంచాయతీ ఆవరణలో సర్పంచ్ శేఖర్ అధ్యక్షతన సోమవారం గ్రామసభ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శంకర్పల్లి ఎంపీడీవో వి. ప్రవీణ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ పరిశుభ్రత, వనమహోత్సవం నిర్వహణ, వర్షాకాలం ముందస్తు జాగ్రత్తలు, రోడ్డు భద్రత, ఘన వ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొంటూ, ప్రతి ఒక్కరూ పరిశుభ్రమైన, సురక్షితమైన గ్రామ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సీతారాం రెడ్డి, మోకిల సీఐ శ్రీనివాస్ రెడ్డి, ట్రాఫిక్ సీఐ సతీష్, ఏపీఓ నాగభూషణం, పంచాయతీ కార్యదర్శి రియాజ్, ఏఎన్ఎం ధనలక్ష్మి, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్థులు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పొద్దుటూరుకు రూ.5.50 కోట్ల రోడ్ల వరం

**శంకర్ పల్లి వెలుతురు, జూన్ 8 :**

పొద్దుటూరు గ్రామ అభివృద్ధికి కీలకమైన రెండు ప్రధాన రహదారుల నిర్మాణానికి రూ.5.50 కోట్ల నిధులు మంజూరు చేయించడంలో కృషి చేసిన స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య గారిని పొద్దుటూరు గ్రామస్తులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

పొద్దుటూరు నుంచి మేడిపల్లి వరకు, అలాగే పొద్దుటూరు నుంచి టంగుటూరు వరకు ఉన్న రహదారుల అభివృద్ధి కోసం మొత్తం మూడున్నర కిలోమీటర్ల మేర రోడ్ల నిర్మాణానికి రూ.5 కోట్ల 50 లక్షలు మంజూరు కావడం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. ఈ సందర్భంగా గ్రామ ప్రతినిధులు, ప్రజలు ఎమ్మెల్యే గారిని కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి ధన్యవాదాలు తెలిపారు.




ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ, గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో ఈ నిధులను మంజూరు చేయించినట్లు తెలిపారు. అవసరమైన పరిపాలనా ప్రక్రియలు పూర్తయిన వెంటనే రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభిస్తామని, నాణ్యతతో పనులు చేపట్టి నిర్ణీత సమయంలో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

గ్రామ సర్పంచి బండ లక్ష్మి నరసింహ, గ్రామ పెద్దలు మాట్లాడుతూ, ఎన్నో ఏళ్లుగా ప్రజలు ఎదురుచూస్తున్న ఈ రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు కావడం గ్రామ అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చొరవ తీసుకున్న ఎమ్మెల్యే కాలే యాదయ్య గారికి గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

ఎమ్మెల్యే హామీతో త్వరలోనే పనులు ప్రారంభం కానున్నాయనే వార్త గ్రామంలో ఆనంద వాతావరణాన్ని నెలకొల్పింది. రహదారుల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడి, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు సహా అన్ని వర్గాల ప్రజలకు ప్రయోజనం కలుగుతుందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

# జూన్ 10న జరిగే కలెక్టరేట్ ధర్నాను విజయవంతం చేయండి:సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపు

**కుత్బుల్లాపూర్ వెలుతురు ప్రతినిధి జూన్ 08:**



పెరుగుతున్న నిత్యవసర వస్తువులు ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఐ మేడ్చల్ జిల్లా సమితి తరపున జూన్ 10 నాడు మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నాను నిర్వహిస్తున్నామని కావున అట్టి ధర్నాలో కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట కార్యాలయం వద్ద గోడ పత్రికను విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు కే ఏసురత్నములు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చినంక పెట్రోల్ డీజిల్ ధరలు అమాంతం పెరిగిపోయి నిత్యవసర వస్తువుల ధరలు రెండు రెట్లు ఎక్కువ పెరగడం వల్ల ప్రజలు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని, ధరలు పెరుగుతున్నాయి కానీ వారి ఆర్థిక పరిస్థితులు మాత్రం మెరుగవట్లేదని అన్నారు. అదే మోడీ మిత్రులైన ఆదాని, అంబానీలఆర్థిక పరిస్థితులు వేల కోట్లు పెరిగాయని, నిత్యం మోడీ ఇతర దేశాలకు వెళ్లి తన సహజ మిత్రుడు అయినటువంటి ఆదాని కీ అనేక కాంట్రాక్టులు ఇప్పించి లక్షల కోట్లాది రూపాయలను సంపాదించి పెడుతున్నాడని, మోడీకి ఓటు వేసినటువంటి పేద ప్రజల సంపాదన పెరుగుదలకు మాత్రం కృషి చేయట్లేదని అన్నారు.దేశంలో రోజురోజుకు పేదరికం పెరిగిపోతుందని, ఇప్పటికైనా వస్తువుల ధరలు తగ్గించి పేద ప్రజల ఆర్థిక స్థితిలను పెంచాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉన్నదని దానికోసం ప్రజలంతా ఐక్యమై పోరాటం చేయాల్సిన అవసరం ఉన్నదని అన్నారు. కావున భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను విజయవంతం చేయాల్సిందిగా కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు, రాములు జిల్లా కౌన్సిల్ సభ్యులు నరసింహారెడ్డి ప్రజానాట్యమండలి అధ్యక్షుడు బాబు సిపిఐ నాయకులు దేవనందం, జానకిరామ్, ఇమామ్, కృష్ణ, నాగేశ్ చారి యువజన నాయకుడు కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# మొకిలాతండ గ్రామాభివృద్ధికి మరో ముందడుగు

**టాయిలెట్స్ నిర్మాణం, నాలుగు కొత్త ట్రాన్స్ఫార్మర్ల పిల్లర్లకు శంకుస్థాపన**

**శంకర్ పల్లి, వెలుతురు జూన్ 8 :**

గ్రామాభివృద్ధి దిశగా మొకిలాతండ గ్రామ పంచాయతీ మరో కీలక అడుగు వేసింది. గ్రామ ప్రజలకు మెరుగైన పారిశుద్ధ్య సౌకర్యాలు మరియు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలనే లక్ష్యంతో గ్రామంలో నిర్మించనున్న బాత్రూమ్‌లు (టాయిలెట్స్/వాష్‌రూమ్స్) మరియు నాలుగు కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పిల్లర్లకు సోమవారం శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల మధ్య శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు.

ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని పారిశుద్ధ్య సౌకర్యాల విస్తరణకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో పరిశుభ్రత పెంపొందించేందుకు టాయిలెట్స్ నిర్మాణం ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. అలాగే విద్యుత్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో నాలుగు కొత్త ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ద్వారా లో–వోల్టేజ్ సమస్యలు తగ్గి, నిరంతర విద్యుత్ సరఫరా మెరుగుపడుతుందని అన్నారు.ఉపసర్పంచ్ మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కోసం ప్రజల సహకారం ఎంతో అవసరమని, ప్రభుత్వం అందిస్తున్న నిధులను సద్వినియోగం చేసుకుంటూ మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.గ్రామ పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.ఈ సందర్భంగా గ్రామ



ప్రజలు గ్రామంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని మౌలిక వసతులు కల్పించాలని కోరారు.ఈ కార్యక్రమంలో మొకిలాతండ గ్రామ సర్పంచ్, ఉపసర్పంచ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, విద్యుత్ శాఖ సిబ్బంది, గ్రామ పెద్దలు మరియు పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# పటేల్ చెరువు తండలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక ప్రత్యేక గ్రామసభ సమావేశం

- అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం
- పటేల్ చెరువు తండా గ్రామ సర్పంచ్ మెగావత్ రాజ్యలక్ష్మి లక్ష్మణ్ నాయక్

**మంచాల వెలుతురు జూన్ 08:**



మంచాల మండలం పటేల్ చెరువు తండాలో గ్రామపంచాయతీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ మెగావత్ రాజ్యలక్ష్మి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు సమావేశంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక అమలు గ్రామ అభివృద్ధి కార్యక్రమాలు మరియు ద్రవవ్యర్థాల నిర్వహణ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించి పలు తీర్మానాలు చేశారు గ్రామఅభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని సర్పంచ్ మెగా వత్ రాజ్యలక్ష్మిలక్ష్మణ్ అన్నారు ప్రభుత్వం ప్రవేశపెట్టి సంక్షేమ పథకాలు అర్హులైన వారందరికీ సం క్షేమ పథకాలు అందేలా కృషి చేస్తాం అని అన్నారు ఈ కార్యక్రమంలో పటేల్ చెరువుతండా ఉప సర్పంచ్ వార్డు సభ్యులు అంగన్వాడి టీచర్లు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా మాస్ ఎడ్యుకేషన్, మీడియా అధికారిగా మంజుల బాధ్యతల స్వీకరణ

- వైద్య ఆరోగ్య శాఖలో నూతన అధికారికి ఘన స్వాగతం
- మహబూబ్‌నగర్ నుంచి బదిలీపై రంగారెడ్డికి రాక
- కె. శ్రీనివాసులు నుంచి బాధ్యతల స్వీకరణ
- ప్రజారోగ్య కార్యక్రమాల ప్రచారానికి ప్రాధాన్యం
- ఆరోగ్య అవగాహన కార్యక్రమాలను విస్తృతం చేస్తామన్న మంజుల
- తల్లి-శిశు ఆరోగ్యం, టీకాలపై ప్రత్యేక దృష్టి
- ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజల్లో చైతన్యం పెంపు లక్ష్యం
- డీఎంహెచ్‌వో డాక్టర్ స్వర్ణకుమారి మార్గదర్శకత్వంలో సేవలు

**రంగారెడ్డి జిల్లా వెలుతురు జూన్ 08:**

రంగారెడ్డి జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయంలో నూతనంగా నియమితులైన జిల్లా మాస్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా అధికారి (డీఎంఈవో) శ్రీమతి జి. మంజుల సోమవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య, వైద్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ఉత్తర్వుల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయం నుంచి బదిలీపై రంగారెడ్డి జిల్లాకు వచ్చిన ఆమె, ఇప్పటివరకు ఈ బాధ్యతలను నిర్వహించిన కె. శ్రీనివాసులు నుంచి బాధ్యతలను స్వీకరించారు.



ఈ సందర్భంగా జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ కార్యాలయ సిబ్బంది నూతన అధికారిని ఆత్మీయంగా స్వాగతించి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజారోగ్య కార్యక్రమాల ప్రచారం, ఆరోగ్య అవగాహన కార్యక్రమాల నిర్వహణ, జాతీయ ఆరోగ్య కార్యక్రమాలకు సంబంధించిన సమాచార వ్యాప్తి, మీడియా సమన్వయం, ప్రజలకు ఆరోగ్య సంబంధిత సమాచారాన్ని సమర్థవంతంగా చేరవేయడంలో జిల్లా మాస్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా అధికారి కీలక పాత్ర పోషిస్తారని అధికారులు పేర్కొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం శ్రీమతి జి. మంజుల మాట్లాడుతూ జిల్లా వైద్య మరియు ఆరోగ్య అధికారిణి డాక్టర్ స్వర్ణకుమారి మార్గదర్శకత్వంలో ప్రజారోగ్య కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా ప్రజలకు చేరవేయడానికి కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా తల్లి–శిశు ఆరోగ్యం, టీకా కార్యక్రమాలు, అంటువ్యాధుల నియంత్రణ, ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, ప్రభుత్వ ఆరోగ్య సేవలపై ప్రజల్లో చైతన్యం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతామని చెప్పారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖకు చెందిన అధికారులు, వివిధ కార్యక్రమాల నిర్వాహకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని నూతన అధికారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ప్రజావాణిలో అందిన వినతులు స్వీకరించిన డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య



**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) జూన్ 08:**

సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య ప్రజల నుండి వినతులను స్వీకరించారు. ప్రజావాణిలో వినతులు అందినవి.అవి సాయిబాబా నగర్ ప్రాంతంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని కోరుతూ వినతి అందింది,మరియు దూలపల్లి ఇండస్ట్రియల్ ఏరియా – సుభాష్ నగర్ పరిధిలోని 100 అడుగుల రహదారిపై ఉన్న ప్రభుత్వ/ప్రజా భూములకు సంబంధించి జాయింట్ సర్వే నిర్వహించి, సరిహద్దుల నిర్ధారణ (Demarcation), భూముల రక్షణ చర్యలు చేపట్టి, ఆక్రమణలను తొలగించాలని కోరుతూ వినతి అందింది.ప్రజావాణిలో అందిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ కమిషనర్ డి. లావణ్య అధికారులను ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో హెచ్‌ఓడీలు తిరుపతి, డీఈఈ (ఎస్‌డబ్ల్యూఎం), విరాట్ రాజ్‌కుమార్, డీఈఈ (మెయింటెనెన్స్), సీహెచ్. వేణు, ఏఎంసీ, ఎ. రవికుమార్, ఏఎంసీ పాల్గొన్నారు.

# పెద్ద చెరువు కబ్జాపై భీమ్ ఆర్మీ ఆగ్రహం

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 08:**




102 ఫ్లాట్ల ఆక్రమణపై విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

నార్కట్‌పల్లి పట్టణ ప్రజల జీవనాధారమైన పెద్ద చెరువు (సర్వే నెం. 550) భూములను అక్రమంగా ఆక్రమించి 102 ఫ్లాట్లుగా విభజించి విక్రయిస్తున్న వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు వడ్డేపల్లి నాగరాజు తహసీల్దార్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చెరువు గర్భభూమిని ఆక్రమించి అక్రమ లేఅవుట్లు రూపొందించడం వల్ల భవిష్యత్తులో నీటి వనరులు ప్రమాదంలో పడే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ఫ్లాట్లు ఏర్పాటు చేసిన వారిపై తక్షణమే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే చెరువు ఆక్రమణ జరుగుతున్న సమయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారుల పాత్రపై కూడా సమగ్ర విచారణ జరపాలని కోరారు. అక్రమ నిర్మాణాలను తొలగించి చెరువు భూములను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకు రావాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే భీమ్ ఆర్మీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రం నుంచి నార్కట్‌పల్లి వరకు భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ మండల కన్వీనర్ రావణ్ మహారాజ్, జనసేన మండల అధ్యక్షుడు మారీదు శివకుమార్, మైనార్టీ నాయకుడు ఎస్కే జానీ, యువజన నాయకులు గోసుల హరీశ్, మెడబోయిన అశోక్, దైద అరుణ్, బోడ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభలు

- మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు
- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారీ ఐలయ్య

**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 08:**




తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నల్లగొండ జిల్లా 20వ మహాసభలు ఈ నెల 12న తిప్పర్తి మండలంలోని దుప్పలపల్లి కేవిఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారీ ఐలయ్య తెలిపారు. సోమవారం నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో జిల్లా మహాసభల కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీల హక్కుల పరిరక్షణ కోసం పోరాడుతున్న తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం నిర్వహిస్తున్న ఈ మహాసభల్లో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వామపక్ష పార్టీల పోరాటాల ఫలితంగా అమలులోకి వచ్చిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త విధానాలను రద్దు చేసి పాత చట్టాన్ని యథావిధిగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పోరాట కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా భూములు, ఇళ్ల స్థలాలు, ఉపాధి హామీ, పెన్షన్లు, విద్య, వైద్యం వంటి అంశాలపై నిర్వహించిన ఉద్యమాలను సమీక్షించి, రాబోయే మూడు సంవత్సరాల పోరాటాలకు కార్యాచరణను రూపొందిస్తామని పేర్కొన్నారు.

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు, కార్మిక, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలపై రైతులు, వ్యవసాయ కార్మికులు కలిసి ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాల్సిన అవసరంపై మహాసభలో చర్చించనున్నట్లు చెప్పారు. ఉపాధి హామీ కూలీల పెండింగ్ బిల్లుల చెల్లింపు, పని ప్రదేశాల్లో భద్రత, పనిముట్ల పంపిణీ, పట్టణ ప్రాంతాలకు ఉపాధి హామీ విస్తరణ వంటి అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీలకు ప్రకటించిన ఆత్మీయ భరోసా పథకాన్ని వెంటనే అమలు చేయాలని, 50 ఏళ్లు నిండిన వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.5,000 పెన్షన్ ఇవ్వాలని, అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే కనీస వేతనాల సవరణ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకురావాలని కోరారు.

జూన్ 12న జరిగే జిల్లా మహాసభలో వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని నారీ ఐలయ్య విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెరుకు పెద్దులు, మండల కార్యదర్శి దండు నాగరాజు, కెవీపీఎస్ నాయకులు దండు రవి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దండు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అనధికార సర్వేపై భూనిర్వాసితుల ఆగ్రహం



**నార్కట్ పల్లి వెలుతురు జూన్ 08:**

దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని సికింద్రాబాద్–నడికుడి రైల్వే మార్గానికి అనుబంధంగా నార్కట్‌పల్లి పట్టణంలోని మునుగోడు రోడ్ రైల్వే అండర్‌బ్రిడ్జి సమీపంలో సోమవారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్లాట్లు, సాగుభూముల్లో ఏకపక్షంగా (వన్‌సైడ్) రోడ్డు సర్వే నిర్వహించి జెండాలు పాతడాన్ని వ్యతిరేకిస్తూ భూనిర్వాసితులు, ప్లాట్ల యజమానులు రైల్వే అండర్‌బ్రిడ్జి వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ, నిబంధనలకు విరుద్ధంగా రహదారిని ఒకే వైపు విస్తరించేందుకు చేపట్టిన సర్వే వెనుక ఉద్దేశ్యం ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. వన్‌సైడ్ రోడ్డు విస్తరణ వల్ల తమ ఆస్తులు, భూములకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనధికారికంగా చేపట్టిన సర్వేను తక్షణమే రద్దు చేసి, ఇప్పటికే పాతిన జెండాలను తొలగించాలని కోరారు. రోడ్డు విస్తరణ అవసరమైతే ఇరువైపులా సమానంగా, నిబంధనల ప్రకారం, పారదర్శకంగా సర్వే నిర్వహించాలని డిమాండ్ చేశారు. భూమి యజమానులకు ఎటువంటి నోటీసులు లేదా ముందస్తు సమాచారం ఇవ్వకుండా వారి భూముల్లోకి ప్రవేశించడం చట్టవిరుద్ధమని మండిపడ్డారు. తమకు న్యాయం జరిగే వరకు, వన్‌సైడ్ రోడ్డు ప్రతిపాదనను ఉపసంహరించుకునే వరకు నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు. అవసరమైతే ఉన్నతాధికారులను కలిసి ఫిర్యాదు చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా వన్‌సైడ్ రోడ్డు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ రాస్తారోకో నిర్వహించారు. కార్యక్రమంలో భూనిర్వాసితులు బొబ్బలి దేవేందర్, పర్రెపాటి యాదగిరి, సామ కొండల్ రెడ్డి, వేముల వెంకన్న, రాచకొండ సందీప్, మైల ఐలయ్య, బండారు ధనంజయ్, కట్టంగూర్ సత్యనారాయణ, గోకారం నాగరాజు, చిట్యాల రాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ బడులను రక్షించుకుందామని తల్వార్ తాత పాదయాత్రకు మద్దతిచ్చిన కంచుకట్ల సుభాష్

**నల్లగొండ జిల్లా వెలుతురు జూన్ 08:**



నల్గొండ జిల్లాలో తల్వార్ తాత పాదయాత్ర ప్రభుత్వ బడులను పరిరక్షించాలని గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకోవాలని కోరుతూ గ్రామ గ్రామాన పాదయాత్రలు చేస్తూ ప్రజలను జాగృత పరుస్తు పాదయాత్ర సాగుతున్నది. ఈ పాదయాత్రకు ప్రజల నుండి అపూర్వ స్పందన మరియు మద్దతు తెలుపుతున్నారు. గ్రామీణ ప్రాంత పేద విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో చదువుకునే స్తోమత లేక అప్పులపాలు అవ్వడమే కాకుండా విద్యకు దూరమవుతున్నారని అందుబాటులో ప్రభుత్వ పాఠశాలలు ఉంటే భారత రాజ్యాంగంలో డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన విద్యా హక్కు చట్టాన్ని ప్రతిఒక్కరూ ఉచితంగా పొందాలని అన్నారు.

ఈరోజు తల్వార్ దాత పాదయాత్ర నామపురం గ్రామానికి చేరుకున్నది సాంస్కృతిక కార్యక్రమాలు కలబృందాల చేత పాటలు పాడుతూ ప్రజలు చైతన్యం చేస్తున్నారు. పాదయాత్ర నామాపురం గ్రామం రావడం ఎంతో ఆనందదాయకం ఈ సందర్భంగా డాక్టర్ కంచుకట్ల సుభాష్ రాష్ట్ర కన్వీనర్ ఫ్లోరోసిస్ విముక్తి పోరాట సమితి తెలంగాణ రాష్ట్రం తరపున సంపూర్ణ మద్దతు ఇవ్వడం జరిగింది. నల్గొండ జిల్లాలో సుమారు 350 ప్రభుత్వ పాఠశాలలో మూతపడినాయి ఈ పాదయాత్ర ద్వారానైనా తిరిగి ప్రభుత్వ పాఠశాలలో ఓపెన్ కావాలని రాష్ట్ర ముఖ్యమంత్రి మరియు విద్యాశాఖ మంత్రివర్యులు గౌరవనీయులు ఎనుముల రేవంత్ రెడ్డి గారికి విజ్ఞప్తి చేస్తున్నాను. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసి గ్రామీణ పేద విద్యార్థులకు ఉచిత నిర్బంధ విద్యా అందించాలని రాష్ట్ర ప్రభుత్వము ఈ మధ్యకాలంలో అధ్యయనం చేసిన విద్య హక్కు కమిషన్ రిపోర్ట్ ఆదేశాలను కచ్చితంగా అమలు చేయాలని కోరుతున్నాను. పాదయాత్రలో గ్రామస్తులు పెద్దఎత్తున పాల్గొని మద్దతు తెలిపినారు.

తల్వార్ తాత పాదయాత్ర దిగ్విజయంగా పూర్తి చేయాలని ప్రజలు ఇలాంటి కార్యక్రమాలకు గొప్ప వ్యక్తులకు స్వచ్ఛందంగా మద్దతు ఇవ్వాలని కోరుతున్నాను ఇది ప్రజా ఉద్యమం అందరికీ విద్య ఉచిత విద్య, అందరికీ విద్య నిర్బంధ విద్య, ప్రభుత్వ బడులను కాపాడుకుందాం ఉచిత విద్యను అందించవలసిన బాధ్యత ప్రభుత్వాలదే మనమందరము గ్రామీణ ప్రాంతాల బడులలో మనగ్రామ విద్యార్థులను చేర్పి ప్రభుత్వ బడులు మూతపడకుండా రక్షించుకుందామని కోరుతున్నాను. ఈ కార్యక్రమంలో తల్వార్ తాత కంచుకట్ల సుభాష్ ముత్యాల మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు విస్తరణ పనులు పూర్తి చేయాలి

## సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ



**రామన్నపేట వెలుతురు న్యూస్ జూన్ 08:**

పట్టణంలోని సుభాష్ సెంటర్ నుండి మల్లికార్జున రైస్ మిల్ వరకు రోడ్డు విస్తరణ పనులను పూర్తి చేయాలని మరియు పట్టణ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ రామన్నపేట సిపిఎం పట్టణ శాఖ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు, పట్టణ కార్యదర్శి మునికుంట్ల లెనిన్ మాట్లాడుతూ రామన్నపేట పట్టణం గతం ఎంతో వైభవంగా ఉండి నేడు అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, దినదినంగా దిగజారుతూ పోతుందని, నాడు తాలుకగా నియోజకవర్గ కేంద్రంగా ఉండి, నేడు మండల హెడ్కోటర్గా, మేజర్ గ్రామపంచాయతీ గా ఉన్న అభివృద్ధి మాత్రం శూన్యమని, ఊరు నుండి వలసలు వెళ్లిన జనాలు ఎప్పుడు వచ్చినా రామన్నపేట గత 50 ఏండ్ల క్రితం ఎట్లా ఉందో ఇప్పుడు అట్లాగే ఉందని వాళ్ళు విస్తుపోతున్నారు. దీనికి కారణం ఇక్కడున్న ప్రజలదా, పట్టించుకోని పాలకులదా అని వారు ప్రశ్నించారు.

రామన్నపేట పట్టణం ఎటు చూసినా సమస్యల కూపంగా మారిందని, సరైన రోడ్లు, డ్రైనేజీలు,నీటి వ్యవస్థ సరిగా లేదని, ముఖ్యంగా ప్రధాన రహదారి అయినటువంటి సుభాష్ రోడ్డు ఇరుకుమయంగా మారిందని, ఒక బండి వస్తే మరో బండి వెళ్లే పరిస్థితి లేదని, ఏదైనా లారీ, బస్సు, పెద్ద వాహనం వస్తే ద్విచక్ర వాహనాలు, పాదచారులు సైతం పక్కకు ఆగి నిలబడాల్సిన పరిస్థితి నెలకొని ఉందని, షాపింగ్ చేసే ప్రజలు పార్కింగ్ స్థలం లేక వారి వాహనాలను రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారని, దీంతో ప్రమాదాల జరిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు.

గత పాలకులు పట్టణ కేంద్రంలో రోడ్డు విస్తరణ చేస్తామని హామీ ఇచ్చి అసంపూర్తిగా చేయడం జరిగిందని ఇప్పుడు వున్న నూతన ప్రభుత్వం వచ్చి మూడు సంవత్సరాలు కావస్తున్న పట్టించుకోవడం లేదని, ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం తగదని, రామన్నపేట పట్టణ కేంద్రంలో నిలకొని ఉన్న అనేక సమస్యలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి తగిన నిధులు కేటాయించి రామన్నపేట పట్టణమును అభివృద్ధి పరచాలని సిపిఎం రామన్నపేట పట్టణ కమిటీ పక్షాన వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు గాదె నరేందర్, గొరిగే సోములు, ఆముద ఆంజనేయులు, అప్పం సంతోష్, బావండ్లపల్లి సత్యం, తరిగొప్పుల వెంకటరెడ్డి, గంజి అశోక్, పల్లె సత్యం, బోళ్ల వెంకన్న, కుందూరు వెంకటేశ్వర్లు, రాసాల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# విలేకరి సత్యనారాయణ తండ్రి బిక్షం యాదవ్ కుటుంబానికి సమ్మిగౌడ్ చిలువేరు పరామర్శ

**కేసముద్రం, వెలుతురు జూన్ 8:**

ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ప్రెస్ క్లబ్ మండల అధ్యక్షుడు, వార్త పత్రిక విలేకరి ఎసల్ల సత్యనారాయణ (సత్యం) గారి తండ్రి భిక్షం యాదవ్ (71) గారు అనారోగ్యంతో హనుమకొండ లోని రోహిణి ఆస్పత్రిలో మృతి చెందడం పట్ల సమ్మిగౌడ్ ఫౌండేషన్ అధినేత చిలువేరు సమ్మయ్య గౌడ్ (సమ్మిగౌడ్) ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

సోమవారం ఉప్పరపల్లి గ్రామంలోని మృతుడి నివాసానికి వెళ్లిన సమ్మిగౌడ్, భిక్షం యాదవ్ గారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారులు వెంకన్న, సత్యనారాయణ, మహేశ్వర్ లతో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు.

"ఇంటి పెద్దను కోల్పోవడం కుటుంబానికి తీరని లోటని,వారి ఆశీస్సులు, వారు చూపిన మార్గం కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ మార్గదర్శకంగా నిలుస్తాయన్నారు

ఈ పరామర్శ కార్యక్రమంలో CA వచ్చాల సాంబయ్య, కంచ వెంకన్న, 8వ వార్డు మెంబర్ పలుస పద్మ వెంకన్న, 9వ వార్డు మెంబర్ తండా సంపత్, బండారు గోపి, శాగంటి రాములు, ఎటూరోజు పరిపూర్ణ, కట్ల పాపయ్య, కోమాకుల రమేష్, మెట్టు రవీందర్, గంట రవి, గైయి ప్రవీణ్, మంద అఖిల్, వెన్ను సురేందర్,పాత్రికేయులు, సమ్మిగౌడ్ ఫౌండేషన్ సభ్యులు పాల్గొని నివాళులర్పించరు...





# జహీరాబాద్‌లో భృంగి ఇంటర్నేషనల్ స్కూల్ ఘన ప్రారంభం

- అంతర్జాతీయ ప్రమాణాలతో విద్య అందించడమే లక్ష్యం
- ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్

**జహీరాబాద్ వెలుతురు జూన్ 08:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో మరో ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ అందుబాటులోకి వచ్చింది. ఆధునిక సౌకర్యాలు, అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన భృంగి ఇంటర్నేషనల్ స్కూల్‌ను సోమవారం ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ ముఖ్య అతిథిగా హాజరై, భృంగి విద్యాసంస్థల ఛైర్మన్, మాజీ మంత్రి మరియు జహీరాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి డాక్టర్ ఏ. చంద్రశేఖర్, కరెస్పాండెంట్ & సెక్రటరీ ఏ. ప్రమీలతో కలిసి రిబ్బన్ కట్ చేసి పాఠశాలను ప్రారంభించారు.

ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అతిథులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన ఆధునిక తరగతి గదులు, స్మార్ట్ క్లాస్‌రూమ్స్, డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలు, క్రీడా మైదానాలు, ప్రయోగశాలలు మరియు ఇతర మౌలిక వసతులను ఎంపీ పరిశీలించి ప్రశంసించారు.

ఈ సందర్భంగా ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ మాట్లాడుతూ, వికారాబాద్‌లో భృంగి ఇంటర్నేషనల్ స్కూల్‌ను అత్యుత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్దిన డాక్టర్ ఏ. చంద్రశేఖర్ దంపతులు జహీరాబాద్‌లో కూడా అదే స్థాయిలో విద్యా ప్రమాణాలను నెలకొల్పుతారనే విశ్వాసం తనకు ఉందన్నారు. జహీరాబాద్ అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు సాగుతున్న తరుణంలో అంతర్జాతీయ స్థాయి విద్యాసంస్థ ప్రారంభం కావడం ప్రాంత ప్రజలకు ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు.



గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ఇటువంటి విద్యాసంస్థలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన తెలిపారు. విద్యార్థులలో ప్రతిభను వెలికితీసి, వారిని ప్రపంచ స్థాయి పోటీలకు సిద్ధం చేసే విధంగా విద్యా వ్యవస్థ ఉండాలని సూచించారు. భవిష్యత్ తరాలకు ఉత్తమ విద్యను అందించేందుకు యాజమాన్యం చేస్తున్న కృషిని అభినందిస్తూ, భృంగి ఇంటర్నేషనల్ స్కూల్ రాష్ట్రంలోనే ఆదర్శ విద్యాసంస్థగా ఎదగాలని ఆకాంక్షించారు.

భృంగి ఇంటర్నేషనల్ స్కూల్ వ్యవస్థాపకులు డాక్టర్ ఏ. చంద్రశేఖర్ మాట్లాడుతూ, విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాల బోధన మాత్రమే కాకుండా వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సాంకేతిక పరిజ్ఞానం మరియు విలువలతో కూడిన విద్యను అందించడమే తమ లక్ష్యమని తెలిపారు. జహీరాబాద్ ప్రాంత విద్యార్థులు నగరాలకు వెళ్లకుండానే అంతర్జాతీయ ప్రమాణాల విద్యను పొందేలా అన్ని సౌకర్యాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, స్థానిక నాయకులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొన్నారు. పాఠశాల ప్రారంభోత్సవం జహీరాబాద్ ప్రాంత విద్యారంగ అభివృద్ధికి మరో మైలురాయిగా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడ్డారు.

## ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభలో పాల్గొన్న నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ వెలుతురు జూన్ 08:**

కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలోని టీటీడీ కల్యాణ మండపంలో సోమవారం నిర్వహించిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ప్రత్యేక వార్డు సభలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు. ప్రజలకు సంక్షేమ పథకాలను మరింత చేరువ చేయడం, ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకొని పరిష్కరించడం లక్ష్యంగా ఈ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, ఆసరా పెన్షన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్య భద్రత పథకాలు తదితర సంక్షేమ కార్యక్రమాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులు, వినతులు మరియు సమస్యలను అధికారులు ప్రాధాన్యతగా తీసుకొని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. నగర అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం ఎంతో ముఖ్యమని పేర్కొన్న మేయర్, ప్రతి వార్డులో మౌలిక వసతుల కల్పనకు నగరపాలక సంస్థ కట్టుబడి ఉందన్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీ వంటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో తెలుసుకొని వాటి పరిష్కారానికి నగరపాలక సంస్థ ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రజలు తమ సమస్యలను, అవసరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. అదేవిధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో నిర్మించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను గత పాలకులు అర్హులైన లబ్ధిదారులకు కేటాయించకపోవడంతో అవి శిథిలావస్థకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులను గుర్తించి త్వరలోనే ఇళ్ల కేటాయింపు ప్రక్రియను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టాలని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. చెట్ల పెంపకం ద్వారా భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన గాలి, మెరుగైన పర్యావరణాన్ని అందించగలమన్నారు. అనంతరం టీటీడీ కల్యాణ మండపం ఆవరణలో మేయర్ కొలగాని శ్రీనివాస్ గారు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి గారు, కార్పొరేటర్లు, నగర పాలక సంస్థ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది, ప్రజాప్రతినిధులు, నాయకులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలు, వినతిపత్రాలను సమర్పించారు.

# జహీరాబాద్‌కు బుల్లెట్ ట్రైన్ దూరం చేయొద్దు.. అలైన్‌మెంట్ మార్పు వెంటనే రద్దు చేయాలి

- ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌కు బీఆర్ఎస్ కౌన్సిలర్ల వినతి
- బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేస్తే ప్రాంతానికి మరింత ఊతం

**జహీరాబాద్ వెలుతురు జూన్ 08:**

హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టులో జహీరాబాద్‌కు జరిగిన అన్యాయాన్ని సరిదిద్దాలని, ఇటీవల ప్రతిపాదించిన అలైన్‌మెంట్ మార్పును వెనక్కి తీసుకుని బుల్లెట్ ట్రైన్ మార్గాన్ని తిరిగి జహీరాబాద్ మీదుగా వెళ్లేలా చర్యలు చేపట్టాలని జహీరాబాద్ పట్టణ బీఆర్ఎస్ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం ఎస్వీ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో పాల్గొన్న జహీరాబాద్ ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్‌కు వినతిపత్రం సమర్పించారు.

ఈ సందర్భంగా కౌన్సిలర్ నామ స్రవంతి రవికిరణ్ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న పారిశ్రామిక ప్రాంతాల్లో జహీరాబాద్ ఒకటిగా ఎదుగుతోందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి పరిశ్రమలు ఇప్పటికే ఇక్కడ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని, భవిష్యత్తులో 12 వేల ఎకరాలకు పైగా విస్తరించనున్న నేషనల్ ఇన్వెస్ట్‌మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ (నిమ్జ్) ద్వారా వేలాది కోట్ల పెట్టుబడులు, లక్షలాది ఉపాధి అవకాశాలు సృష్టించబడనున్నాయని పేర్కొన్నారు.





ఇలాంటి కీలక పారిశ్రామిక ప్రాంతానికి అత్యాధునిక రవాణా సదుపాయాలు కల్పించడం ప్రభుత్వాల బాధ్యత అని అన్నారు. గతంలో హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు ప్రతిపాదనల్లో జహీరాబాద్‌కు స్టేషన్ కేటాయించే అవకాశం ఉన్నప్పటికీ, తాజాగా రూపొందించిన డీపీఆర్‌లో మార్పులు చేసి మార్గాన్ని వికారాబాద్ వైపు మళ్లించడం తీవ్ర నిరాశకు గురిచేసిందన్నారు.

జహీరాబాద్‌ను బుల్లెట్ ట్రైన్ మార్గం నుంచి తప్పించడం వల్ల ఈ ప్రాంత పారిశ్రామిక, వాణిజ్య, ఆర్థికాభివృద్ధిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దులకు సమీపంలో ఉన్న జహీరాబాద్ రవాణా పరంగా వ్యూహాత్మక ప్రాధాన్యత కలిగిన ప్రాంతమని, బుల్లెట్ ట్రైన్ స్టేషన్ ఏర్పాటు చేస్తే దేశంలోని ప్రధాన పారిశ్రామిక నగరాలతో అనుసంధానం మరింత బలోపేతం అవుతుందని తెలిపారు.

ప్రాంత ప్రజల ఆకాంక్షలు, పారిశ్రామిక అవసరాలు, భవిష్యత్ అభివృద్ధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఎంపీ సురేష్ కుమార్ షెట్కార్ కేంద్ర రైల్వే మంత్రిత్వ శాఖతో పాటు సంబంధిత ఉన్నతాధికారులతో చర్చలు జరిపి జహీరాబాద్‌కు న్యాయం చేయాలని కోరారు. హైదరాబాద్–ముంబై బుల్లెట్ ట్రైన్ అలైన్‌మెంట్‌ను తిరిగి సమీక్షించి, జహీరాబాద్ మీదుగా మార్గాన్ని పునరుద్ధరించడంతో పాటు ఇక్కడ ఆధునిక బుల్లెట్ ట్రైన్ స్టేషన్‌ను ఏర్పాటు చేసేలా డీపీఆర్‌లో తగిన మార్పులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకుని జహీరాబాద్ ప్రజల ఆశలను నెరవేర్చాలని, ప్రాంత అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని కౌన్సిలర్లు కోరారు. జహీరాబాద్ భవిష్యత్తు అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ఎంపీ ఈ విషయంలో ప్రత్యేక చొరవ చూపుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.

వినతిపత్రం సమర్పించిన వారిలో కౌన్సిలర్లు తంజీం, ప్రేమలత శంకర్ రెడ్డి, పెద్దబాయి మైపాల్, పర్వీన్ యాకూబ్, పర్వీన్ బేగం అబ్దుల్లా, మజ్జిగ సుజిత విశ్వేశ్వర్, గౌస్ ఉద్దీన్ గౌరీ, పాండు ముదిరాజ్, జాకీర్, జాహీద్, విజయరాజు, దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రవేట్ పాఠశాలలో ఎక్కువ మొత్తంలో ఫీజు దోపిడీ

**వెలుతురు నారాయణఖేడ్ జూన్ 08 :**



సంగారెడ్డి జిల్లా :– నారాయణఖేడ్ పట్టణంలో ప్రైవేట్ విద్యా సంస్థల్లో జరుగుతున్న ఫీజు దోపిడీని అరికట్టాలని బీజేపీ నారాయణఖేడ్ అసెంబ్లీ కన్వీనర్ కోటాలే రజినీకాంత్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యా సంవత్సరం ప్రారంభమైతే ఫీజులను చూసి సామాన్య ప్రజలు భయాందోళన చెందాల్సిన పరిస్థితి ఉందన్నారు. పట్టణంలో ప్రైవేట్ విద్యా సంస్థలు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని, అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యాశాఖ అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తుండటంతో పేదలు దోపిడీకి గురవుతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫీజులను నియంత్రించాలని కోరారు.

# వర్షపు నీటినే మురుగు నీరుగా చూపించి దుష్ప్రచారం..!

- కక్ష రాజకీయాలను తిప్పికొడుతూ కోహిర్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం
- మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్

**జహీరాబాద్ వెలుతురు జూన్ 08:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం కోహిర్ మున్సిపాలిటీ అభివృద్ధిని అడ్డుకునేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా అసత్య ప్రచారాలకు పాల్పడుతున్నారని మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాల కారణంగా రోడ్లపై నిలిచిన నీటిని మురుగు నీరుగా చిత్రీకరిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు.

మున్సిపాలిటీగా ఏర్పడిన తర్వాత కోహిర్ పట్టణంలో అభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయని, అయితే ఇప్పటివరకు ప్రభుత్వ నిధులు అందకపోయినా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తన సొంత నిధులతోనే అనేక పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది అవసరాలు, పారిశుధ్య కార్యక్రమాలు, అత్యవసర పనుల కోసం వ్యక్తిగతంగా ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు.

కోహిర్ అభివృద్ధి కోసం రూ.15 కోట్ల విలువైన పనులకు అనుమతులు లభించినప్పటికీ టెండర్ ప్రక్రియ పూర్తి కాకపోవడంతో పనులు ప్రారంభం కాలేదన్నారు. అయినప్పటికీ అభివృద్ధి కార్యక్రమాలు ఆగిపోకుండా ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నామని చెప్పారు.



పట్టణంలోని 16 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణను మరింత మెరుగుపరిచామని, ముఖ్యంగా రంజాన్, బక్రీద్ పండుగల అనంతరం పేరుకుపోయిన చెత్తను పూర్తిస్థాయిలో తొలగించి పరిశుభ్రమైన వాతావరణాన్ని కల్పించామని తెలిపారు. అదేవిధంగా ప్రతి వార్డుకు తాగునీటి సరఫరా నిరంతరాయంగా అందేలా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, ప్రస్తుతం పట్టణంలో ఎక్కడా తీవ్రమైన నీటి సమస్య లేదని స్పష్టం చేశారు.

ప్రతిపక్ష నాయకులు, కొన్ని పత్రికలు కలిసి కక్ష సాధింపు ధోరణితో మున్సిపాలిటీ ప్రతిష్ఠను దెబ్బతీయాలని ప్రయత్నిస్తున్నారని ఆరోపించిన చైర్మన్ అశోక్, వాస్తవ పరిస్థితులను ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అభివృద్ధి పనులపై ఆధారాలు, వివరాలతో జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులకు నివేదికలు అందజేస్తామని తెలిపారు.

మున్సిపాలిటీ పరిధిలో ఏవైనా సమస్యలు ఉంటే ప్రజలు నేరుగా అధికారులకు లేదా తనకు తెలియజేయాలని, అసత్య ప్రచారాలు చేయడం ద్వారా ప్రజల్లో అపోహలు సృష్టించడం సమంజసం కాదన్నారు. కోహిర్‌ను ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని, రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి పట్టణ రూపురేఖలను మార్చుతామని మున్సిపల్ చైర్మన్ ఎం. అశోక్ స్పష్టం చేశారు.

# వలిమా విందు నుంచి తిరుగు ప్రయాణంలో విషాదం

- అతివేగంతో డివైడర్‌ను ఢీకొన్న బైక్
- వివరాలు వెల్లడించిన టౌన్ ఎస్ఐ లవ కుమార్

## ఫ్లైఓవర్‌పై ప్రమాదంలో యువకుడు మృతి

**జహీరాబాద్ వెలుతురు జూన్ 08:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ శివారులోని కొత్తగా నిర్మించిన రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. రైకోడ్ మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన పకిత్ సోహెల్ (23) ఈ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయాడు.

జహీరాబాద్ టౌన్ ఎస్ఐ లవ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం, సోహెల్ తన మోటార్ సైకిల్ (TG1F-0033)పై జహీరాబాద్ పట్టణంలో స్నేహితుడి వలిమా విందుకు హాజరయ్యాడు. కార్యక్రమం ముగిసిన అనంతరం శనివారం అర్ధరాత్రి సమయంలో స్వగ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో జహీరాబాద్ గ్రామ శివారులోని కొత్త రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపైకి చేరుకున్న సమయంలో ప్రమాదం జరిగింది. అతివేగంగా, నిర్లక్ష్యంగా బైక్ నడపడం వల్ల వాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టినట్లు పోలీసులు తెలిపారు. ఈ ప్రమాదంలో సోహెల్ తలకు, చేతులకు, కాళ్లకు తీవ్ర గాయాలు అయ్యాయి. వెంటనే అతని స్నేహితులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడు సోహెల్‌కు ఇంకా వివాహం కాలేదని, డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నట్లు బంధువులు తెలిపారు. యువకుడి ఆకస్మిక మృతితో మామిడిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు టౌన్ ఎస్ఐ లవ కుమార్ తెలిపారు.



# కాశీయాత్రలో ఘోర ప్రమాదం





- బిహార్‌లో లారీ-బస్సు ముఖాముఖి ఢీ
- నెల్లూరు జిల్లా వాసులు ముగ్గురు దుర్మరణం
- పుణ్యక్షేత్రాల సందర్శనలో ఊహించని విషాదం
- గయా నుండి వారణాసి వెళ్తుండగా అర్ధరాత్రి ప్రమాదం
- సంగం, ఆత్మకూరు ప్రాంతాలకు చెందిన వారిగా గుర్తింపు
- హజరతయ్య, వెంకటేశ్వర్లు, పద్మావతి అక్కడి కక్కడే మృతి
- ట్రావెల్ బస్సు ముందుభాగం పూర్తిగా ధ్వంసం
- మరో 15 మంది యాత్రికులకు తీవ్ర గాయాలు
- క్షతగాత్రుల్లో ముగ్గురి పరిస్థితి అత్యంత ఆందోళనకరం
- బిహార్ ఆసుపత్రుల్లో ముమ్మర చికిత్స
- సంగం, ఆత్మకూరు, దుత్తలూరు గ్రామాల్లో విషాదం
- కన్నీరు మున్నీరవుతున్న మృతుల కుటుంబ సభ్యులు
- రేణిగుంటకు తరలించేందుకు ప్రభుత్వం సన్నాహాలు
- బాధితులకు తక్షణ సాయం అందించిన హోంమంత్రి అనిత
- బాధిత కుటుంబాలకు అండగా ఉంటామన్న మంత్రి ఆనం

**అమరావతి వెలుతురు జూన్ 08:**

కాశీ, గయ వంటి ఉత్తర భారతదేశంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాల దర్శనానికి ఎంతో భక్తిశ్రద్ధలతో వెళ్లిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నివాసితుల బృందంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన యాత్రికులు ప్రయాణిస్తున్న బస్సు బిహార్ రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో నెల్లూరు జిల్లాకు చెందిన ముగ్గురు భక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, పలువురు తీవ్రంగా గాయపడ్డారు. దైవదర్శనాలు చేసుకుని ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మిక భావనతో సాగాల్సిన పవిత్ర ప్రయాణం.. ఒక్కసారిగా ఘోర రోడ్డు ప్రమాదంతో శోకసంద్రంగా మారిపోయింది.

నెల్లూరు జిల్లాలోని సంగం, ఆత్మకూరు, దుత్తలూరు మండల కేంద్రాలు మరియు గ్రామ ప్రాంతాలకు చెందిన మొత్తం 43 మంది భక్తులు ఒక బృందంగా ఏర్పడి ఈ నెల 1వ తేదీన ప్రత్యేకంగా ఒక ప్రైవేట్ ట్రావెల్ బస్సును మాట్లాడుకుని ఉత్తర భారత పుణ్యక్షేత్రాల సందర్శనకు బయలు దేరారు. యాత్రలో భాగంగా పితృదేవతలకు పిండప్రదానాలు చేసేందుకు మొదట బిహార్‌లోని పవిత్ర గయా క్షేత్రాన్ని భక్తులు దర్శించుకున్నారు. అక్కడ పూజా కార్యక్రమాలు ముగించుకుని, తదుపరి పుణ్యక్షేత్రమైన వారణాసి (కాశీ) వైపు బస్సులో రాత్రి వేళ ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో బిహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ జాతీయ రహదారి సమీపంలోకి రాగానే అర్ధరాత్రి సమయంలో ఎదురుగా అతివేగంగా వచ్చిన ఒక భారీ లారీ.. యాత్రికుల బస్సును ముఖాముఖి (నేరుగా) బలంగా ఢీకొట్టింది.

లారీ ఢీకొట్టిన వేగం చాలా ఎక్కువగా ఉండటంతో, ట్రావెల్ బస్సు ముందుభాగం పూర్తిగా నలిగిపోయి లోపలికి దూసుకుపోయింది. ఈ ఘోర ప్రమాదంలో బస్సు ముందు సీట్లలో కూర్చున్న సంగం మండలం కొత్తూరు గ్రామానికి చెందిన చౌడం హజరతయ్య, సంగం పల్లెకు చెందిన పసుపులేటి వెంకటేశ్వర్లు, ఆత్మకూరు పట్టణానికి చెందిన తూమా పద్మావతి తీవ్ర రక్తస్రావమై బస్సు సీట్లలోనే ప్రాణాలు విడిచారు. బస్సులో నిద్రిస్తున్న మిగిలిన యాత్రికులలో మరో 15 మందికి తీవ్రమైన గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, జాతీయ రహదారి పహారా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బస్సు అద్దాలు పగలగొట్టి బాధితులను బయటకు తీశారు. గాయపడిన వారందరినీ సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించారు.

పుణ్యయాత్రకు వెళ్లిన తమ కుటుంబ సభ్యులు కాశీ విశ్వేశ్వరుడిని దర్శించుకుని క్షేమంగా ఇళ్లకు తిరిగి వస్తారని వెయ్యి కళ్లతో ఎదురుచూసిన కుటుంబాలకు ఈ ఘోర వార్త పిడుగుపాటులా తగిలింది. ప్రమాద వార్త తెలిసిన వెంటనే మృతుల ఇళ్ల వద్దకు బంధువులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో చేరుకోవడంతో ఆయా గ్రామాల్లో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుల భార్యాపిల్లలు, తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న తీరు అక్కడి వారిని కలచి వేస్తోంది. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఇంకా ఆందోళనకరంగానే ఉండటంతో, తమ వారి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందో తెలియక స్వగ్రామాల్లోని బంధువులు తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.

ప్రమాదం జరిగిన బస్సులో ఉన్న మిగిలిన యాత్రికుల పరిస్థితి మరియు పూర్తి వివరాల కోసం నెల్లూరు జిల్లాలోని వారి కుటుంబ సభ్యులు తీవ్రంగా ఆరా తీస్తున్నారు. బిహార్‌లోని స్థానిక ఆసుపత్రులకు, అలాగే అక్కడ ఉన్న తోటి ప్రయాణికులకు నిరంతరం ఫోన్ కాల్స్ చేస్తూ సమాచారం తెలుసుకునే ప్రయత్నం చేస్తున్నారు. లక్కీగా ప్రాణాలతో బయటపడిన వారు గాయపడిన వారికి సేవలు అందిస్తున్నట్లు సమాచారం అందుతోంది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వారందరూ త్వరగా కోలుకోవాలని, ప్రాణాపాయం నుంచి బయటపడి సురక్షితంగా స్వగ్రామాలకు చేరుకోవాలని గ్రామాల్లోని దేవాలయాలలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్నారు.

ఈ దారుణ రోడ్డు ప్రమాద ఘటనపై ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తక్షణమే స్పందించారు. ప్రమాదంలో జిల్లా వాసులు ప్రాణాలు కోల్పోవడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. బిహార్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులకు అక్కడి స్థానిక ప్రభుత్వ అధికారులు మరియు వైద్యులతో మాట్లాడి మెరుగైన అత్యవసర వైద్య సహాయం అందేలా రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కష్టకాలంలో బాధిత కుటుంబాలకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలా ఆర్థికంగా, సామాజికంగా అండగా ఉంటుందని మంత్రి ఆనం గట్టి హామీ ఇచ్చారు.

నెల్లూరు జిల్లా యాత్రికుల బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆమె బిహార్ రాష్ట్ర ఉన్నత స్థాయి పోలీస్, పరిపాలనా అధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి వివరాలు సేకరించారు. ప్రమాద స్థలంలో రెస్క్యూ ఆపరేషన్ వేగంగా జరిగేలా చూడాలని కోరారు. ముఖ్యంగా తీవ్రంగా గాయపడిన ముగ్గురు యాత్రికులకు అత్యవసర ప్రాణరక్షణ వైద్యం అందించేందుకు బిహార్‌లోనే నిపుణులైన డాక్టర్ల పర్యవేక్షణలో ఉంచాలని మంత్రి ఆదేశించారు. ప్రమాదంలో క్షేమంగా బయటపడిన మిగిలిన భక్తులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకున్నారు.

ప్రమాదంలో మరణించిన ముగ్గురు యాత్రికుల పార్థివ దేహాలను ఏపీలోని వారి స్వగ్రామాలకు వీలైనంత వేగంగా తరలించేందుకు హోంమంత్రి అనిత, మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. బిహార్ ఆసుపత్రుల్లో పోస్టుమార్టం ప్రక్రియ ముగిసిన వెంటనే, మృతదేహాలను ప్రత్యేక విమానం ద్వారా తిరుపతి సమీపంలోని రేణిగుంట విమానాశ్రయానికి తరలించనున్నారు. అక్కడి నుండి ప్రత్యేక అంబులెన్సుల ద్వారా మృతదేహాలను నెల్లూరు జిల్లాలోని సంగం, ఆత్మకూరు, దుత్తలూరు ప్రాంతాలలోని వారి సొంత ఇళ్లకు చేర్చేలా జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. ఈ ఘోర దుర్ఘటన నెల్లూరు జిల్లావ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని, శోకాన్ని మిగిల్చింది.

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే కఠిన చర్యలు తప్పవు: శేరిలింగంపల్లి డీసీపీ సీహెచ్. శ్రీనివాస్, ఐపీఎస్

- భూ వివాదం పేరుతో చట్టవ్యతిరేక సమావేశం నిర్వహించిన 11 మంది అరెస్ట్
- ప్రజల్లో భయాందోళనలు సృష్టించిన వారిపై కేసు నమోదు

**శేరిలింగంపల్లి వెలుతురు జూన్ 08:**

గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలోని నానక్‌రామ్‌గూడ ప్రాంతంలో భూ వివాదం నేపథ్యంలో చట్టవ్యతిరేకంగా గుమికూడి ప్రజల్లో భయాందోళనలు సృష్టించిన 11 మంది వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

07-06-2026 తేదీన నానక్‌రామ్‌గూడ ప్రాంతంలోని ఓ స్థలంలో భూ వివాదానికి సంబంధించి 10 నుంచి 15 మంది వ్యక్తులు చట్టవ్యతిరేకంగా గుమికూడి స్థానిక ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తూ శాంతిభద్రతలకు భంగం కలిగిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం గచ్చిబౌలి పోలీసులకు అందింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా, 11 మంది వ్యక్తులు చట్టవ్యతిరేక సమావేశంగా ఏర్పడి దౌర్జన్యంగా ప్రవర్తిస్తూ ప్రజా శాంతికి భంగం కలిగిస్తున్నట్లు గుర్తించారు. అక్కడ ఎందుకు ఉన్నారని ప్రశ్నించగా, వారు సరైన సమాధానం ఇవ్వకుండా పోలీసుల విధుల నిర్వహణకు ఆటంకం కలిగించారు. దీంతో పోలీసులు తక్షణ చర్యగా వారిని అదుపులోకి తీసుకుని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విచారణలో నానక్‌రామ్‌గూడ పరిధిలోని జనచైతన్య కంపెనీకి సంబంధించిన భూ వివాదం నేపథ్యంలో ఆ కంపెనీలో పనిచేసే శివప్రసాద్, శ్రీకాంత్ గౌడ్‌లు భూ వివాదాన్ని సెటిల్ చేసేందుకు కొంతమందిని అక్కడికి పిలిపించినట్లు వెల్లడైంది. అదుపులోకి తీసుకున్న వారిలో హర్విందర్ సింగ్, సూర్జీత్ సింగ్, మేరాజ్, జగదీష్ సింగ్, హరిప్రీత్ సింగ్, సిమ్రంజిత్ సింగ్, ఉపేందర్ సింగ్, చరణ్ సింగ్, బల్వేందర్ సింగ్, మన్మీత్ సింగ్ తదితరులు ఉన్నారు. వీరిలో నలుగురు నిందితులపై గతంలో కూడా క్రిమినల్ కేసులు నమోదై ఉన్నట్లు విచారణలో తేలింది. ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం, చట్టవ్యతిరేక సమావేశం నిర్వహించడం, ప్రజా శాంతికి భంగం కలిగించడం, అలాగే పోలీసుల విధుల నిర్వహణకు ఆటంకం కలిగించినందుకు నిందితులపై భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్లు 189, 132, 270 కింద కేసు నమోదు చేసి న్యాయస్థానానికి తరలించారు.

ఈ సందర్భంగా శేరిలింగంపల్లి డీసీపీ శ్రీ సీహెచ్. శ్రీనివాస్, ఐపీఎస్ మాట్లాడుతూ, చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకునే ప్రయత్నాలు, చట్టవ్యతిరేక సమావేశాలు, ప్రజల్లో భయాందోళనలు సృష్టించే చర్యలను సైబరాబాద్ పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోరని హెచ్చరించారు. భూ వివాదాలు లేదా ఇతర ఆస్తి సంబంధిత సమస్యలను చట్టబద్ధమైన మార్గాల్లోనే పరిష్కరించుకోవాలని సూచించారు. భూ వివాదాల పేరుతో బలప్రయోగం, బెదిరింపులు లేదా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



## గోదావరి డెల్టా జీవనాడికి మహర్దశ

- 46 ఏళ్ల తర్వాత ధవళేశ్వరం బ్యారేజీ ఆధునీకరణ
- రూ. 124 కోట్లతో గేట్ల మార్పు!
- బ్యారేజీ పునర్నిర్మాణానికి కూటమి సర్కార్ శ్రీకారం
- తీవ్రంగా తుప్పు పట్టిన 117 పాత గేట్ల స్థానంలో సాంకేతిక గేట్లు
- గోదావరి పరివాహక ప్రాంతాల్లోని లక్షలాది ఎకరాల ఆయకట్టుకు నీటి భరోసా
- నిపుణుల కమిటీ నివేదికలతో అప్రమత్తమైన సర్కార్
- భద్రతకు పెద్దపీట వేస్తూ కీలక నిర్ణయం
- రూ. 150 కోట్ల అంచనా వ్యయం..
- టెండర్లలో రూ. 124.34 కోట్లకు దక్కించుకున్న 'బేకమ్' సంస్థ
- రెండేళ్లలో పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం
- వరదల నియంత్రణ, నీటి నిల్వ సామర్థ్యం పెంపే ప్రధాన లక్ష్యం



**ఉమ్మడి గోదావరి జిల్లాలు వెలుతురు జూన్ 08:**

ఉమ్మడి గోదావరి జిల్లాల వ్యవసాయ రంగానికి వెన్నెముక, కోట్లాది మంది ప్రజల తాగునీటి అవసరాలను తీరుస్తున్న చారిత్రాత్మక ధవళేశ్వరం బ్యారేజీ (సర్ ఆర్థర్ కాటన్ బ్యారేజీ) అప్‌గ్రేడేషన్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడుగులు వేసింది. బ్రిటీష్ ఇంజనీరింగ్ అద్భుతంగా పేరుగాంచిన ఈ ఐకానిక్ నిర్మాణాన్ని దాదాపు 46 ఏళ్ల సుదీర్ఘ కాలం తర్వాత మళ్లీ ఇప్పుడు పూర్తి స్థాయిలో ఆధునీకరించబోతున్నారు. బ్యారేజీ రక్షణను పెంచడంతో పాటు నీటి నిర్వహణ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరచడం ద్వారా గోదావరి డెల్టా పరిధిలోని లక్షలాది ఎకరాల పంట పొలాలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ భారీ ప్రాజెక్టును ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది.

### దశాబ్దాల కాల గమనంలో బలహీనపడిన నిర్మాణం.. నిపుణుల ఆందోళన

సర్ ఆర్థర్ కాటన్ నిర్మించిన పాత ఆనకట్ట స్థానంలో ప్రస్తుతమున్న ధవళేశ్వరం బ్యారేజీకి చివరిసారిగా 1980వ సంవత్సరంలో పెద్ద ఎత్తున మార్పులు, చేర్పులు చేశారు. ఆ తర్వాత కాలంలో కేవలం చిన్నపాటి మరమ్మతులతోనే కాలం వెళ్లదీశారు. అయితే దశాబ్దాల కాలం గడవడం, ఏటా వచ్చే భారీ వరదల తాకిడికి బ్యారేజీలోని పలు కీలక భాగాలు లోపల క్రమంగా బలహీనపడ్డాయి. నదీ పరివాహక ప్రాంతంలో నిరంతరం నీటి నానుడు ఎక్కువగా ఉండటంతో నిర్మాణాల పటిష్టత తగ్గుతూ వచ్చింది. ఈ పరిణామాలపై జలవనరుల శాఖ అధికారులు అంతర్గతంగా ఆందోళన వ్యక్తం చేస్తూ వచ్చారు.

### తుప్పు పట్టిన 117 గేట్లు.. ప్రమాదకర స్థితిపై నివేదికలు

బ్యారేజీకి సంబంధించి అత్యంత ప్రధానమైన సమస్య అందులోని గేట్లకు తగిలింది. దశాబ్దాలుగా నీటిలోనే ఉండిపోవడం వల్ల బ్యారేజీకి ఉన్న మొత్తం 117 క్రెస్ట్ గేట్లు తీవ్రంగా తుప్పు పట్టిపోయాయి. వరదలు వచ్చినప్పుడు ఈ గేట్లను ఎత్తడం, దించడం అధికారులకు పెద్ద సవాలుగా మారింది. గేట్ల భద్రత అత్యంత ప్రమాదకరంగా మారిందని, ఎప్పుడు ఏ గేటు ఊడిపోతుందో చెప్పలేమంటూ ఉన్నత స్థాయి నిపుణుల కమిటీలు తమ నివేదికల్లో పలుమార్లు ప్రభుత్వాన్ని హెచ్చరించాయి. దీంతో అప్రమత్తమైన ప్రస్తుత ప్రభుత్వం, ఎలాంటి ప్రమాదాలు జరగకముందే ముందస్తు రక్షణ చర్యగా ఈ ప్రాజెక్టును తలకెత్తుకుంది.

### రూ. 124.34 కోట్లతో టెండర్ ఖరారు.. పనుల బాధ్యత 'బేకమ్' సంస్థకు

ధవళేశ్వరం బ్యారేజీ ఆధునీకరణ పనుల కోసం జలవనరుల శాఖ మొదట సుమారు రూ. 150 కోట్ల అంచనా వ్యయంతో పారదర్శక పద్ధతిలో గ్లోబల్ టెండర్లను ఆహ్వానించింది. ఈ టెండర్ల ప్రక్రియలో ప్రముఖ నిర్మాణ రంగ సంస్థ 'బేకమ్' కంపెనీ అత్యంత తక్కువ ధర పాడుకుని, రూ. 124.34 కోట్లకు ఈ ప్రతిష్ఠాత్మక కాంట్రాక్టును సొంతం చేసుకుంది.

నిధుల కొరత రాకుండా ప్రభుత్వం కూడా బడ్జెట్ నుంచి వీటికి ప్రత్యేకంగా కేటాయింపులు చేయడంతో టెండర్ల ఖరారు ప్రక్రియ ఎక్కడా ఆగకుండా చకచకా సాగిపోయింది.

### అత్యాధునిక సాంకేతికతతో కొత్త గేట్ల అమరిక.. పాత వాటికి సెలవు

ఈ భారీ ప్రాజెక్టులో భాగంగా ప్రస్తుతం పాతబడిపోయిన, తుప్పు పట్టి కాలం చెల్లిన 117 గేట్లను మెషినరీ సాయంతో పూర్తిగా తొలగించనున్నారు. వాటి స్థానంలో తుప్పు పట్టని, అత్యంత నాణ్యమైన స్టీల్‌తో తయారు చేసిన సరికొత్త హైడ్రాలిక్ గేట్లను అమర్చనున్నారు.

ఆధునిక రబ్బర్ సీలింగ్, అత్యాధునిక ఆటోమేషన్ సాంకేతికతతో కూడిన ఈ కొత్త గేట్ల వల్ల నీటి లీకేజీలు పూర్తిగా అరికట్టబడతాయి. వరద ఉధృతిని బట్టి ఎంత వేగంగానైనా గేట్లను ఆపరేట్ చేసేలా విద్యుత్ మోటార్ల వ్యవస్థను కూడా ఈ ప్రాజెక్టులో భాగంగా అప్‌గ్రేడ్ చేయబోతున్నారు.

### రెండేళ్ల రికార్డు కాలపరిమితిలోనే ప్రాజెక్ట్ పూర్తి

ఈ ప్రతిష్ఠాత్మక ఆధునీకరణ పనులన్నింటినీ రాబోయే రెండేళ్ల (24 నెలల) ఖచ్చితమైన కాలపరిమితిలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం కాంట్రాక్ట్ సంస్థకు గడువు విధించింది. సాగునీటి సీజన్‌కు మరియు వరదలు వచ్చే కాలానికి ఎక్కడా ఆటంకం కలగకుండా ప్రణాళికాబద్ధంగా పనులు చేయాలని జలవనరుల శాఖ ఉన్నతాధికారులు షెడ్యూల్ రూపొందించారు. నదిలో నీటి ప్రవాహం తక్కువగా ఉండే ఎండకాలంలోనే ఎక్కువ శాతం పనులు పూర్తి చేసేలా పర్యవేక్షణ కమిటీలను నియమించారు.

### పెరగనున్న నీటి నిల్వ, విడుదల సామర్థ్యం

ఈ ఆధునీకరణ పనుల వల్ల చారిత్రాత్మక బ్యారేజీకి సరికొత్త ఆయుష్షు లభించనుంది. పనులు విజయవంతంగా పూర్తయితే బ్యారేజీ యొక్క నీటి నిల్వ సామర్థ్యంతో పాటు వరదల సమయంలో నీటిని దిగువకు విడుదల చేసే సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని ఇంజనీరింగ్ నిపుణులు భావిస్తున్నారు. లీకేజీలు తగ్గడం వల్ల వేసవి కాలంలో కూడా డెల్టా చివరి భూములకు సైతం సమృద్ధిగా నీరు అందుతుంది. కాల్వలకు నీటి సరఫరాను క్రమబద్ధీకరించడం దీనివల్ల మరింత సులువవుతుంది.

### ఉభయ గోదావరి జిల్లాల వ్యవసాయ రంగానికి ఊతం

ఈ ఆధునీకరణ ప్రాజెక్ట్ విజయవంతం కావడం అనేది ఉభయ గోదావరి జిల్లాల వ్యవసాయ రంగానికి, దీర్ఘకాలిక తాగునీటి అవసరాలకు ఒక పెద్ద వరప్రసాదంగా మారనుంది. లక్షలాది ఎకరాల్లో పండే వరి, చెరకు, తోట పంటలకు ఈ బ్యారేజీయే ఆధారం. అవసరమైన అన్ని రకాల అధికారిక అనుమతులు, ఒప్పందాల ప్రక్రియ ముగిసిన వెంటనే క్షేత్రస్థాయిలో పనులను ప్రారంభించనున్నారు. 46 ఏళ్ల తర్వాత జరుగుతున్న ఈ చారిత్రాత్మక మార్పు పట్ల గోదావరి డెల్టా పరిధిలోని రైతాంగం హర్షం వ్యక్తం చేస్తోంది.

# ఫిలిప్పీన్స్‌లో భారీ భూకంపం



- ఎగసిపడిన సునామీ అలలు
- దేశ దక్షిణ ప్రాంతమైన మిండానోలో ప్రకంపనలు
- నలుగురు దుర్మరణం.. 200 మందికి పైగా తీవ్ర గాయాలు
- పలు నగరాల్లో కూలిన బహుళ అంతస్తుల భవనాలు
- తీరప్రాంతాల్లో మూడు మీటర్ల ఎత్తు వరకు అలలు
- అత్యవసర సునామీ హెచ్చరికలు జారీ
- ప్రజల ప్రాణాల కంటే ఏదీ ఎక్కువ కాదు
- వెంటనే ఎత్తైన సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్న అధ్యక్షుడు
- స్కూళ్లు తెరిచిన మొదటి రోజే ఘోర విపత్తు
- షాపింగ్ మాల్స్, యూనివర్సిటీ భవనాలు పాక్షికంగా ధ్వంసం
- భూకంప కేంద్రం జనరల్ శాంటోకు నైరుతిలో గుర్తింపు
- అనేక ప్రావిన్సుల్లో పూర్తిగా నిలిచిపోయిన విద్యుత్
- మలేసియా, ఇండోనేషియా, జపాన్‌లకు పొంచి ఉన్న ముప్పు
- ప్రకృతి వైపరీత్యాలకు నిలయంగా మారిన ద్వీపదేశం

**మనీలా వెలుతురు జూన్ 08:**

ఫిలిప్పీన్స్ దేశంలో సోమవారం ఉదయం ఒక పెద్ద ఘోర విపత్తు సంభవించింది. దేశ దక్షిణ భాగంలోని మిండానో ప్రాంతాన్ని అత్యంత శక్తివంతమైన భారీ భూకంపం వణికించింది. రిక్టర్ స్కేలుపై ఈ భూకంపం తీవ్రత ఏకంగా 7.8గా నమోదైందని అంతర్జాతీయ భూగర్భ పరిశోధన సంస్థలు వెల్లడించాయి. సోమవారం తెల్లవారుజామున ప్రజలంతా తమ రోజువారీ పనుల్లో మునిగిపోయిన సమయంలో ఒక్కసారిగా భూమి నిమిషాల పాటు తీవ్రంగా కంపించడంతో జనం ప్రాణభయంతో రోడ్లపైకి పరుగులు తీశారు. ఈ భయంకరమైన ప్రకృతి విపత్తు కారణంగా ఇప్పటివరకు నలుగురు ప్రాణాలు కోల్పోగా, 200 మందికి పైగా పౌరులు తీవ్రంగా గాయపడినట్లు ప్రాథమిక అధికారిక సమాచారం ద్వారా తెలుస్తోంది.

స్థానిక కాలమానం ప్రకారం సోమవారం ఉదయం సరిగ్గా 7:37 గంటలకు ఈ భారీ భూకంపం సంభవించినట్లు ఫిలిప్పీన్స్ విపత్తు నిర్వహణ అధికారులు వెల్లడించారు. మిండానో ప్రాంతంలోని ప్రధాన నగరమైన జనరల్ శాంటోకు నైరుతి దిశగా సుమారు 13 కిలోమీటర్ల దూరంలో, సముద్ర గర్భంలో కేవలం 10 కిలోమీటర్ల లోతులోనే ఈ భూకంప కేంద్రం (ఎపిసెంటర్) ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. భూకంపం వచ్చిన తీవ్రత చాలా ఎక్కువగా ఉండటంతో పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం తక్షణమే స్పందించి సముద్ర తీర ప్రాంతాలకు సునామీ హెచ్చరికలను జారీ చేసింది. ఫిలిప్పీన్స్‌లోని కొన్ని తక్కువ ఎత్తులో ఉండే తీర ప్రాంతాల్లో మూడు మీటర్ల వరకు (అంటే దాదాపు 10 అడుగులు) ఎత్తున్న భారీ సునామీ అలలు విరుచుకుపడే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

భూకంపం వచ్చిన కొద్దిసేపటికే ఫిలిప్పీన్స్ సముద్ర తీరాల్లో అలల ఉధృతి ఒక్కసారిగా పెరిగింది. ప్రభుత్వ సీనియర్ అధికారి టెరెసిటో బకోల్కోల్ వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశంలోని సుల్తాన్ కుదరత్, సంరగాని ప్రావిన్సుల పరిధిలోని సముద్ర తీరాల్లో ఇప్పటికే సుమారు ఒక మీటర్ (మూడు అడుగులు) ఎత్తున్న సునామీ అలలు వచ్చి పడ్డాయి. మరికొన్ని తీరప్రాంతాల్లో కూడా చిన్న స్థాయి నుండి మధ్యస్థ స్థాయి వరకు సముద్రపు అలల కదలికల్లో వింత మార్పులు కనిపించాయి. తీరంలో నీరు ఒక్కసారిగా వెనక్కి వెళ్లడం, మళ్లీ పెద్ద అలలతో ముందుకు రావడం వంటి పరిణామాలతో మత్స్యకారులు, తీరప్రాంత ప్రజలు భయాందోళనలకు గురవుతున్నారు.

భూకంపం సృష్టించిన భీభత్సం కారణంగా దేశంలోని పలు నగరాలు, పట్టణాలలో విద్యుత్ వ్యవస్థ పూర్తిగా స్తంభించిపోయింది. వందలాది విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు కిందపడటంతో చాలా ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిచిపోయి చీకటి అలుముకుంది. జనరల్ శాంటోస్ నగరంలోని ఒక పెద్ద ఆధునిక షాపింగ్ మాల్‌తో పాటు, అక్కడ ఉన్న ఒక ప్రముఖ ప్రభుత్వ యూనివర్సిటీ భవనం కూడా భూకంప ధాటికి తట్టుకోలేక పాక్షికంగా కూలిపోయాయి. ఈ భవనాల శిథిలాలు కిందపడటంతో కింద పార్క్ చేసి ఉన్న వందలాది కార్లు, ద్విచక్ర వాహనాలు పూర్తిగా నలిగిపోయాయి. ఒక పక్క భారీ ఆస్తి నష్టం సంభవించగా, క్షేత్రస్థాయిలో సహాయక బృందాలు ఇంకా శిథిలాలను తొలగిస్తూ పరిస్థితిని అంచనా వేస్తున్నాయి.

సుదీర్ఘ సెలవుల తర్వాత దేశవ్యాప్తంగా పాఠశాలలు (స్కూళ్లు) తెరిచిన మొదటి రోజే ఈ ఘోర ప్రమాదం జరగడం విద్యార్థుల తల్లిదండ్రులను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. పిల్లలంతా క్లాస్ రూముల్లో ఉన్న సమయంలో ఒక్కసారిగా గోడలు, ఫ్యాన్లు ఊగడంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు కేకలు వేస్తూ మైదానాల్లోకి పరుగులు తీశారు. ఒక నగరంలో నాలుగు అంతస్తుల వాణిజ్య భవనంలోని ఒక ప్రధాన భాగం కుప్పకూలిపోయింది. అయితే అదృష్టవశాత్తూ భవనంలో ఉన్న సిబ్బంది, వ్యాపారులు భూమి కంపించడాన్ని ముందే గ్రహించి వెంటనే మెట్ల మార్గం ద్వారా బయటకు రావడంతో చాలా మందికి ప్రాణాపాయం తప్పింది. గాయపడిన వారందరినీ స్థానిక ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు.

పరిస్థితి తీవ్రతను గమనించిన ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు మార్కోస్ దేశ ప్రజలను ఉద్దేశించి ఒక అత్యవసర భద్రతా ప్రకటన విడుదల చేశారు. తీరప్రాంతాల్లో మరియు లోతట్టు ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలందరూ వెంటనే తమ ఇళ్లను ఖాళీ చేసి ఎత్తైన సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ అధికారులు ఇచ్చే సునామీ హెచ్చరికలను ఎట్టి పరిస్థితుల్లోనూ సామాన్యంగా తీసుకోవద్దని, నిర్లక్ష్యం చేయకుండా వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని కోరారు.

"మనకు మనుషుల ప్రాణాల కంటే విలువైనది ఈ ప్రపంచంలో మరేదీ లేదు.. ఆస్తులు పోయినా మళ్లీ సంపాదించుకోవచ్చు" అని ఆయన పేర్కొన్నారు. విపత్తు ప్రభావిత మిండనావో ప్రాంత ప్రజలకు కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని, ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్ వంటి విపత్తు నిర్వహణ సంస్థలు పూర్తి స్థాయిలో సహాయక చర్యలకు సిద్ధంగా ఉన్నాయని భరోసా ఇచ్చారు.

ఫిలిప్పీన్స్‌లో సంభవించిన ఈ 7.8 తీవ్రత కలిగిన భూకంపం కేవలం ఆ దేశాన్నే కాకుండా చుట్టుపక్కల ఉన్న పొరుగు దేశాలను కూడా భయపెడుతోంది. పొరుగునే ఉన్న ఇండోనేషియా, మలేసియా దేశాల తీర ప్రాంతాల్లో కూడా ఒక మీటరు వరకు ఎత్తున్న సునామీ అలలు వచ్చే అవకాశం ఉందంటూ ఆయా దేశాల వాతావరణ శాఖలు హెచ్చరికలు జారీ చేశాయి. వీటితో పాటు తైవాన్, జపాన్, పపువా న్యూ గునియా వంటి పశ్చిమ పసిఫిక్ మహాసముద్ర ప్రాంతంలోని పలు ద్వీప దేశాలకు కూడా అంతర్జాతీయ విపత్తు నిర్వహణ సంస్థలు ముందస్తు అప్రమత్తతా సూచనలను (అలర్ట్) జారీ చేశాయి.

తీరంలో ఉన్న ఓడరేవులు, వాణిజ్య నౌకలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించాయి.

భౌగోళికంగా చూసుకుంటే ఫిలిప్పీన్స్ దేశం ప్రపంచంలోనే అత్యధికంగా ప్రకృతి వైపరీత్యాలకు మరియు భూకంపాలకు గురయ్యే అతి ప్రమాదకరమైన జోన్‌లో ఉంది. పసిఫిక్ మహాసముద్రాన్ని చుట్టుముట్టి ఉన్న 'పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్' అనే అత్యంత క్రియాశీలకమైన భూఫలకాల సరిహద్దుల్లో ఈ దేశం ఉండటమే ఇందుకు ప్రధాన కారణం. దీనివల్ల ఇక్కడ భూగర్భంలో నిరంతరం కదలికలు జరుగుతూ తరచూ భారీ భూకంపాలు, అగ్నిపర్వత విస్ఫోటనాలు సంభవిస్తుంటాయి. అంతేకాకుండా ప్రతి ఏడాది సుమారు 20 కి పైగా భయంకరమైన తుఫాన్లు, ఉష్ణమండల తుఫాన్ల ప్రభావాన్ని కూడా ఈ దేశం ఎదుర్కొంటోంది. ప్రస్తుతం భూకంపం దాటికి సర్వస్వం కోల్పోయిన ప్రాంతాల్లో సైన్యం మరియు అంతర్జాతీయ రెడ్‌క్రాస్ సహాయక బృందాలు బాధితులకు ఆహారం, వైద్యం అందిస్తూ రెస్క్యూ ఆపరేషన్లను ముమ్మరంగా కొనసాగిస్తున్నాయి.

# అంబేద్కర్ ఆశయాలకు జ్ఞానసౌధాలు





- దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యా సాధికారతకు తెలంగాణ ప్రభుత్వం చారిత్రాత్మక అడుగులు
- లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ – నింబోలీఅడ్డాలో బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహం
- స్థలాలను పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**

సామాజిక న్యాయం, విద్యా సమానత్వం, అంబేద్కర్ ఆశయాల సాధనే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాల్లో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్, బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహ నిర్మాణాలు మైలురాళ్లుగా నిలవనున్నాయని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అన్నారు. విద్య ద్వారానే పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందని, విద్య ద్వారానే సమాజంలో అణగారిన వర్గాలు నాయకత్వ స్థానాలకు చేరుకోగలవని ఆయన స్పష్టం చేశారు.

సోమవారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో ప్రతిపాదిత అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణ స్థలాన్ని, అనంతరం నింబోలీఅడ్డాలో ఆధునికీకరించనున్న బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహ స్థలాన్ని సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి సందర్శించిన ఉప ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు.

ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ, అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ కేవలం ఇటుకలు, సిమెంట్‌తో నిర్మించే భవనం కాదని, కోట్లాది మంది దళిత, గిరిజన, వెనుకబడిన వర్గాల యువత భవిష్యత్తును తీర్చిదిద్దే విజ్ఞాన సౌధమని పేర్కొన్నారు. సెల్లార్, గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు పది అంతస్తుల్లో నిర్మించనున్న ఈ టవర్‌లో డిజిటల్ లైబ్రరీలు, ఈ–లెర్నింగ్ సెంటర్లు, పరిశోధన విభాగాలు, పోటీ పరీక్షల శిక్షణా కేంద్రాలు, కాన్ఫరెన్స్ హాల్స్, కెరీర్ గైడెన్స్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నట్లు స్పష్టం చేశారు .

తెలంగాణ ప్రభుత్వం డిజిటల్ విద్యా విప్లవానికి శ్రీకారం చుట్టిందని, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా నగర విద్యార్థులతో సమానంగా అవకాశాలు పొందేలా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రంలో అంబేద్కర్ నాలెడ్జ్ సెంటర్లను ఏర్పాటు చేసి, హైదరాబాద్‌లోని నిష్ణాతులైన అధ్యాపకుల బోధనను ప్రత్యక్షంగా రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులకు అందించనున్నట్లు వెల్లడించారు.

సివిల్స్, గ్రూప్స్, బ్యాంకింగ్, రైల్వేలు, స్టాఫ్ సెలక్షన్ కమిషన్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల పోటీ పరీక్షలకు అవసరమైన అత్యుత్తమ శిక్షణను పేద విద్యార్థులకు ఉచితంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. విద్య కోసం హైదరాబాద్‌కు రావలేని విద్యార్థులకు వారి ప్రాంతాల నుంచే ఉన్నత అవకాశాలను అందించే వ్యవస్థను ప్రభుత్వం రూపొందిస్తోందన్నారు. నింబోలీ అడ్డాలోని చారిత్రాత్మక విద్యార్థి వసతి గృహాన్ని ప్రస్తావిస్తూ, ఇది కేవలం ఒక హాస్టల్ కాదని, వేలాది మంది పేద విద్యార్థుల కలలకు ఆశ్రయం కల్పించిన సామాజిక చరిత్రకు సజీవ సాక్ష్యమని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఇక్కడ నివసించిన విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, న్యాయవాదులు, రాజకీయ నాయకులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలుగా ఎదిగి సమాజానికి సేవలందించారని గుర్తు చేశారు. ప్రజా ప్రభుత్వం సంక్షేమాన్ని ఖర్చుగా కాకుండా సామాజిక పెట్టుబడిగా చూస్తోందని, సంక్షేమం–అభివృద్ధి రెండింటినీ సమన్వయం చేస్తూ ముందుకు సాగుతోందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఎస్సీ సబ్‌ప్లాన్ నిధుల సమర్థ వినియోగం, హాస్టళ్ల పెండింగ్ బిల్లుల చెల్లింపులు, విద్యా మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుతోందన్నారు. సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాల విద్యా అభ్యున్నతికి కొత్త అధ్యాయానికి శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. లోయర్ ట్యాంక్‌బండ్‌లో సుమారు రూ.110 కోట్లతో అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయని, నింబోలీఅడ్డాలో సుమారు రూ.25 కోట్లతో అత్యాధునిక వసతులతో బాబు జగ్జీవన్‌రామ్ విద్యార్థి వసతి గృహాన్ని నిర్మించనున్నట్లు తెలిపారు. "సాంఘిక సంక్షేమ శాఖ మంత్రిగా నా హయాంలో ఈ రెండు చారిత్రాత్మక ప్రాజెక్టులకు నిధులు కేటాయించి కార్యరూపం దాల్చడం జీవితంలో గర్వకారణమైన ఘట్టం" అని మంత్రి పేర్కొన్నారు. గత పదేళ్లలో కేవలం ప్రకటనలకే పరిమితమైన అంబేద్కర్ నాలెడ్జ్ టవర్ ప్రాజెక్టును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కార్యరూపం దాల్చించారని అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చూపిన "చదువు – చైతన్యం – సంఘటితం కండి" అనే మార్గాన్ని ఆచరణలో పెట్టే దిశగా ఈ నాలెడ్జ్ టవర్ నిలవబోతుందని చెప్పారు. ఈ టవర్ ద్వారా ప్రతి సంవత్సరం వేలాది మంది యువతకు సివిల్స్, గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–3, గ్రూప్–4, పోలీస్, బ్యాంకింగ్, ఇతర పోటీ పరీక్షలకు శిక్షణ అందించడంతో పాటు డిజిటల్ లైబ్రరీలు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, కెరీర్ కౌన్సెలింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. నింబోలీఅడ్డాలోని బాబు జగ్జీవన్‌రామ్ వసతి గృహం గతంలో ఎన్నో తరాల విద్యార్థుల జీవితాలను మార్చినట్లే, కొత్త నిర్మాణంతో భవిష్యత్ తరాలకు మరింత ఉపయోగపడేలా తీర్చిదిద్దనున్నట్లు మంత్రి పేర్కొన్నారు. ఈ రెండు నిర్మాణాలు కేవలం భవనాలు కాదని, సామాజిక న్యాయం, విద్యా సమానత్వం, అవకాశాల సమీకరణకు ప్రతీకలుగా నిలుస్తాయని అన్నారు. భవిష్యత్ తరాలకు ఆశయాలు, అవకాశాలు, ఆత్మవిశ్వాసాన్ని అందించే కేంద్రాలుగా ఇవి మారనున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

తెలంగాణ రాష్ట్రం దేశంలోనే సంక్షేమానికి, విద్యా రంగ సంస్కరణలకు ఆదర్శంగా నిలుస్తోందని, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, కాలేరు వెంకటేష్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, జిల్లా కలెక్టర్ ప్రియాంక అలా, సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి విజయేంద్ర బోయి, ఆర్ అండ్ బి సీఈ రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఈ నర్సింగరావు, ఈఈ మనోహర్, ఆర్డీవో సాయిరాం, ఎస్సీ కార్పొరేషన్ అధికారులు, ఇతర ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# క్రికెటర్ నెవీన్ మానిత్‌ను అభినందించిన టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

- క్రికెట్ లో మరింతగా రాణించేందుకు తన పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని క్రికెటర్ మానిత్ కు హామీ

**సంగారెడ్డి వెలుతురు జూన్ 08:**

సంగారెడ్డి పట్టణానికి చెందిన వర్ధమాన క్రికెటర్ నెవిన్ మానిత్‌ను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. మానిత్ ప్రతిభను మానిత్ తండ్రి, కాంగ్రెస్ నాయకుడు, ఫిజియోథెరపిస్ట్ అయిన మధు ద్వారా తెలుసుకున్న ఆయన, భవిష్యత్తులో మంచి క్రికెటర్ గా ఎదగడానికి తన వంతు పూర్తి సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. మానిత్ ఇంకా మెరుగైన శిక్షణ పొందడానికి, వేర్వేరు టోర్నమెంట్లలో ఆడటానికి అయ్యే పూర్తి ఖర్చులను తానే భరిస్తానని జగ్గారెడ్డి భరోసా ఇచ్చారు. భవిష్యత్తులో మరింత బాగా ఆడి సంగారెడ్డి జిల్లాకు, తెలంగాణ రాష్ట్రానికి మంచి పేరు తీసుకురావాలని జగ్గారెడ్డి ఆకాంక్షించారు.

జాతీయ స్థాయిలో రాణి స్తున్న 18 ఏళ్ల నవీన్ మానిత్ ఇటీవలే ఇంటర్ పూర్తి చేశాడు. చిన్నప్పటి నుండి క్రికెట్ మీద ఉన్న ఇష్టంతో కష్టపడి ఆడుతూ రాణిస్తున్నాడు.

## జాతీయ స్థాయి లో ప్రతిభ

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (SGFI) తరపున 2024 లో బీహార్ (పాట్నా) లో జరిగిన అండర్–17 జాతీయ పోటీల్లో తెలంగాణ తరపున ఆడాడు. 2026 లో చండీగఢ్‌లో జరిగిన అండర్–19 జాతీయ పోటీల్లో కూడా పాల్గొని రాణించాడు. వెంకటస్వామి గోల్డ్ కప్ సీనియర్ లీగ్‌లో మెదక్ జిల్లా తరపున ఆడుతూ మహబూబ్‌నగర్ జట్టుపై హాఫ్ సెంచరీ చేశాడు. ఢిల్లీలోని ఒక ప్రముఖ క్లబ్ తరపున ఆడుతూ అద్భుతమైన సెంచరీ చేశాడు ప్రస్తుతం హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (HCA) లీగ్స్‌లో స్పోర్టి క్లబ్ తరపున T20, వన్డే, టూ–డే మ్యాచ్‌లు ఆడుతున్నాడు.

## కోచ్‌ల శిక్షణలో రాటుదేలి..

ఆరవ తరగతి నుంచే ఎమ్మెస్ క్రికెట్ అకాడమీలో కోచ్ చంద్రమౌళి, ఇనాంల దగ్గర మానిత్ క్రికెట్ నేర్చుకున్నాడు. HCA ఉమ్మడి మెదక్ జిల్లా అధ్యక్షుడు రాజేందర్ రెడ్డి ప్రోత్సాహంతో మరింతగా ఎదిగాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఇక్బాల్ క్రికెట్ అకాడమీలో కోచ్ ఇక్బాల్ దగ్గర శిక్షణ పొందుతున్నాడు.. ఈ అభినందన కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, మాజీ క్రికెటర్ రఘు తదితరులు పాల్గొని మానిత్‌ను అభినందించారు. జగ్గారెడ్డి ఇచ్చిన మద్దతుతో మానిత్ మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తంచేశారు.



# భూ రికార్డులకు...

(మొదటి పేజీ తరువాయి)

- నోట్లకు ఉండే స్థాయి భద్రతతో సరికొత్త డిజిటల్ పాస్ పుస్తకాలు
- సిద్ధాంతం వేదికగా రైతులకు పంపిణీ
- గత పాలకుడి బొమ్మల కోసం రూ. 800 కోట్ల ప్రజాధనం వృథా
- రికార్డుల సరిదిద్దడానికే మూడేళ్లు పట్టిందన్న సీఎం
- బ్లాక్ చెయిన్ సాంకేతికతతో భూములకు సైబర్ రక్షణ..

**అమరావతి వెలుతురు జూన్ 08:**

గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ దుర్మార్గపు నిర్ణయాలు, సామాన్యుల భూములను అక్రమంగా కాజేసేందుకు తెచ్చిన 'ల్యాండ్ టైటిలింగ్ యాక్టు' అనే నల్ల చట్టాన్ని తమ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే శాశ్వతంగా పూడ్చిపెట్టిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పునరుద్ఘాటించారు. పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం పరిధిలోని సిద్ధాంతం గ్రామం వేదికగా నిర్వహించిన 'మీ భూమి – మీ హక్కు' బహిరంగ సభలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులకు నూటికి నూరు శాతం పూర్తి యాజమాన్య హక్కులను కల్పిస్తూ, కరెన్సీ నోట్లకు ఉండే స్థాయి అత్యున్నత భద్రతా ఫీచర్లు, రాజముద్రతో రూపొందించిన సరికొత్త డిజిటల్ పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.

ఉమ్మడి గోదావరి జిల్లాలు పచ్చదనంతో అలరారుతూ దేశానికే అన్నం పెట్టే అన్నపూర్ణలని ముఖ్యమంత్రి చంద్రబాబు కొనియాడారు. పూర్వం బ్రిటిషర్ల కాలంలో రూపొందించిన పటిష్టమైన రికార్డుల వల్లే ఆంధ్రప్రదేశ్‌లో రెవెన్యూ సమస్యలు చాలా తక్కువగా ఉండేవి. ఏపీని బ్రిటిష్ వాళ్లు పాలించారు కాబట్టే భూసమస్యలు తక్కువగా ఉన్నాయని, అదే తెలంగాణలో నిజాం పాలనలో చాలామందికి భూములు రిజిస్ట్రేషన్లు చేసేవారని, అందుకే అక్కడ భూ సమస్యలు ఎక్కువగా ఉన్నాయని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. కానీ గత ఐదేళ్ల దుర్మార్గపు పాలనలో రికార్డులను పూర్తిగా తారుమారు చేశారని మండిపడ్డారు. "భూమి కష్టపడే రైతులదైతే.. పాస్ పుస్తకాలు, పొలం సరిహద్దు రాళ్లపై మాత్రం నాటి పాలకుడి బొమ్మలు ముద్రించుకున్నారు. భూతం తరహాలో రైతుల వెంటపడి, ప్రజాధనం రూ. 800 కోట్లు తగలేసి గెలాక్సీ గ్రానైట్ రాళ్లపై బొమ్మలు వేసుకున్నారు" అని సీఎం తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఒక వ్యక్తి చేసిన ఈ చారిత్రాత్మక దుర్మార్గాన్ని సరిదిద్ది, భూ రికార్డులను ప్రక్షాళన చేయడానికి తమ ప్రభుత్వానికి మూడేళ్ల సమయం పట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు.

భూ వివాదాలకు క్షేత్రస్థాయిలో శాశ్వత పరిష్కారం చూపేందుకు తమ ప్రభుత్వం 'బ్లాక్ చెయిన్ టెక్నాలజీ', 'క్యూఆర్ కోడ్' వంటి అత్యున్నత సాంకేతికతను జోడించి 'వెబ్‌ల్యాండ్ 2.0' వ్యవస్థను తీసుకొచ్చిందని ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ సాంకేతికత వల్ల ప్రభుత్వ వెబ్‌సైట్లలో ఉన్న భూముల వివరాలను గానీ, యజమానుల పేర్లను గానీ ఎవరూ డిజిటల్ పద్ధతిలో మార్చలేరని చెప్పారు. ఎవరైనా హ్యాక్ చేసినా వెంటనే తెలిసిపోతుంది. సర్వే ప్రక్రియలో రైతులను నేరుగా భాగస్వాములను చేస్తూ, సరిహద్దు వివరాలను క్షుణ్ణంగా తనిఖీ చేసి, రైతుల సమక్షంలో సర్వే చేసి ఈ–కేవైసీ పూర్తి చేసిన తర్వాతే ఎలాంటి తప్పులు లేని పాస్ పుస్తకాలను ముద్రిస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 6,688 గ్రామాల్లో రీ–సర్వే పూర్తి చేసి, 26.46 లక్షల మందికి కొత్త పాస్ పుస్తకాలు అందజేశామని సీఎం వెల్లడించారు. మిగిలిన 62.32 లక్షల పుస్తకాలను నిర్దేశిత గడువులోగా వేగంగా పంపిణీ చేస్తామని, మొత్తం 90 లక్షల మంది రైతులకు దీని ద్వారా లబ్ధి చేకూరుతుందని స్పష్టం చేశారు.

గ్రామీణ ప్రాంతాల్లో వారసత్వ ఆస్తుల బదిలీ ప్రక్రియను సులభతరం చేస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రకటన చేశారు. గతంలో రిజిస్ట్రేషన్ ఆఫీసుల చుట్టూ తిరిగి వేల రూపాయలు ఖర్చు పెట్టాల్సి వచ్చేదని, కానీ ఇకపై రూ. 10 లక్షల లోపు విలువైన వారసత్వ ఆస్తులకు కేవలం రూ. 100 లకే బదిలీ చేసుకునే సరికొత్త సౌకర్యాన్ని కల్పించామన్నారు. ఒకవేళ ఆస్తి విలువ అంతకంటే ఎంత ఎక్కువగా ఉన్నప్పటికీ, కేవలం రూ. 1,000 స్టాంప్ డ్యూటీ చెల్లిస్తే సరిపోతుందని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో పేద, మధ్యతరగతి కుటుంబాలపై రిజిస్ట్రేషన్ల భారం పూర్తిగా తప్పిందని, కుటుంబాలలో ఆస్తి పంపకాల వివాదాలు తగ్గుతాయని సీఎం చంద్రబాబు ఆశాభావం వ్యక్తం చేశారు.

రెవెన్యూ వ్యవస్థలో అవినీతిని అరికట్టేందుకు సరికొత్త సంస్కరణలు తెచ్చామని సీఎం చంద్రబాబు తెలిపారు.

# ఏడాదిలోగా అన్ని వైద్య నిర్మాణ పనులు పూర్తి చేయాలి: మంత్రి దామోదర్ రాజనర్సింహ

- టీజీఎంఎస్ఐడీసీ ఆధ్వర్యంలోని నిర్మాణ పనులపై సమీక్ష
- టీచింగ్ ఆసుపత్రుల్లో పరికరాల ఏర్పాటుకు ఆదేశాలు
- టీవీవీపీ ఆసుపత్రుల మైనర్, మేజర్ పనులు మూడు నెలల్లో పూర్తి చేయాలని సూచన
- క్యూర్ ఏరియాలో సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ఏర్పాటుపై చర్చ
- మూడో విడత టీచింగ్ ఆసుపత్రుల నిర్మాణాలు, భూసేకరణపై సమీక్ష
- నర్సింగ్ కాలేజీలు, హాస్టళ్ల నిర్మాణాల పురోగతిపై ఆరా
- క్రిటికల్ కేర్ బ్లాక్స్, మాతా శిశు సంరక్షణ కేంద్రాల పనులపై దృష్టి
- ఆసుపత్రుల ఉన్నతీకరణ పనులను వేగవంతం చేయాలని ఆదేశం
- సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల బ్రాండింగ్‌పై ప్రత్యేక చర్చ
- పీహెచ్‌సీల నిర్మాణాలపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం



**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**

రాష్ట్రంలోని వైద్య మౌలిక వసతుల అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలో తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీజీఎంఎస్ఐడీసీ) ఆధ్వర్యంలో చేపట్టిన నిర్మాణ పనుల పురోగతిపై ఆయన సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా క్యూర్ (CURE) ఏరియాలో ఏర్పాటు చేస్తున్న సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించారు. 70 శాతం నిర్మాణం పూర్తయిన టీచింగ్ ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య పరికరాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

తెలంగాణ వైద్య విధాన పరిషత్ (టీవీవీపీ) పరిధిలో చేపట్టిన అన్ని నిర్మాణ పనులను ఏడాది లోపు పూర్తి చేయాలని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే కొనసాగుతున్న మైనర్, మేజర్ సివిల్ వర్క్సను వచ్చే మూడు నెలల్లో పూర్తి చేయాలని సూచించారు.

డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలో నిర్మాణంలో ఉన్న టీచింగ్ ఆసుపత్రుల పురోగతిని సమీక్షించిన మంత్రి, పనులను శరవేగంగా పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మూడో విడతలో ప్రారంభమైన టీచింగ్ ఆసుపత్రుల నిర్మాణాలు, భూసేకరణ ప్రక్రియపై కూడా చర్చించారు.

నర్సింగ్ కాలేజీలు, విద్యార్థి హాస్టళ్లు, టీచింగ్ హాస్పిటళ్లు, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రులు, మాతా–శిశు సంరక్షణ కేంద్రాలు, క్రిటికల్ కేర్ బ్లాక్స్ నిర్మాణ పనుల పురోగతిని సమీక్షించారు. సెంట్రల్ మెడిసిన్ స్టోర్స్ ఏర్పాటు, ఆసుపత్రుల ఉన్నతీకరణ పనులపై అధికారులతో సుదీర్ఘంగా చర్చించారు.

సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల బ్రాండింగ్ అంశంపై కూడా మంత్రి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల (పీహెచ్‌సీలు) నిర్మాణాలపై సమగ్ర నివేదికను సమర్పించాలని ఇంజనీరింగ్, వైద్య శాఖల ఉన్నతాధికారులను ఆదేశించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జెడ్ చొంగ్తు, టీజీఎంఎస్ఐడీసీ సీఎండీ గౌరవ్ ఉప్పల్, చీఫ్ ఇంజనీర్ శశిధర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పాఠశాలల పునఃప్రారంభానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- విద్యార్థుల ఆరోగ్యం, భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలి
- ములుగు జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులతో మంత్రి సీతక్క వీడియో కాన్ఫరెన్స్



**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**

ఈ నెల 15వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డా. దనసరి అనసూయ సీతక్క అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ములుగు జిల్లా కలెక్టర్ భోర్ఖడే హేమంత్ సహదేవరావు , విద్యాశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులతో మంత్రి హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పాఠశాలల సిద్ధతపై సమగ్రంగా సమీక్షించారు.

వేసవి సెలవుల అనంతరం విద్యార్థులు తిరిగి పాఠశాలలకు హాజరుకానున్న నేపథ్యంలో ప్రతి ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పాఠశాలల ఆవరణ, తరగతి గదులు, హాస్టల్ గదులు, వంటశాలలు, తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్లు తదితర అంశాలను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసి లోపాలుంటే వెంటనే సరిచేయాలని ఆదేశించారు.

విద్యార్థుల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేసిన మంత్రి, పాఠశాలల్లోని తాగునీటి ట్యాంకులను పూర్తిస్థాయిలో శుభ్రపరచి పరిశుభ్రమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ముఖ్యంగా వర్షాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో నీటి ద్వారా వ్యాపించే వ్యాధులు ప్రబలకుండా అన్ని జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

అలాగే పాఠశాలల్లోని టాయిలెట్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, బాలికల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రమైన పాఠశాల వాతావరణం విద్యార్థుల హాజరు, అభ్యాసంపై సానుకూల ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

వేసవి సెలవుల కారణంగా కొంతకాలంగా మూతపడి ఉన్న తరగతి గదులు, హాస్టల్ గదుల్లో విషపురుగులు, పాములు, క్రిమికీటకాలు ఉండే అవకాశం ఉందని మంత్రి పేర్కొన్నారు. అందువల్ల పాఠశాలలు ప్రారంభానికి ముందే ప్రత్యేక తనిఖీలు నిర్వహించి అవసరమైన క్రిమిసంహారక చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల భద్రత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా పదో తరగతి పరీక్షా ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం పట్ల మంత్రి సీతక్క హర్షం వ్యక్తం చేశారు. ఈ విజయానికి కృషి చేసిన జిల్లా యంత్రాంగం, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులను అభినందించారు.

ములుగు జిల్లా సాధించిన ఈ ఘనతను కొనసాగిస్తూ రాబోయే విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాలు సాధించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. విద్యార్థుల అభ్యాస నైపుణ్యాల పెంపు, క్రమశిక్షణ, హాజరు శాతాల మెరుగుదలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.

"విద్య అనేది వ్యక్తిగత అభివృద్ధికే కాదు, సమాజాభివృద్ధికి కూడా మూలాధారం. విద్య అన్ని సమస్యలకు పరిష్కార మార్గాన్ని చూపుతుంది. ప్రతి విద్యార్థి కష్టపడి చదివి తన కుటుంబానికి, గ్రామానికి, సమాజానికి గర్వకారణంగా నిలవాలి. ఉపాధ్యాయులు విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను మరింత నిబద్ధతతో నిర్వహించాలి" అని మంత్రి సీతక్క అన్నారు.

ప్రభుత్వం విద్యారంగ అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన చర్యలు కొనసాగుతున్నాయని మంత్రి పేర్కొన్నారు. విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణం కల్పించడంలో అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

ఆదివాసి గిరిజనుల సంస్కృతి కాపాడే విధంగా బోధన బోధనేతర సిబ్బంది పనిచేయాలని సూచించారు.

# ప్రగతి ప్రస్థానం

**మోదీ సంక్షేమ పాలనకు 12 ఏళ్లు**

- 5 శాతానికి పడిపోయిన పేదరికం
- పేదలు, అట్టడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు
- అపూర్వ 'గరీబ్ కల్యాణ్' ప్రయాణం
- 'ఎక్స్' వేదికగా ప్రధాని మోదీ భావోద్వేగ పోస్ట్
- గత 12 ఏళ్లలో సంభవించిన సానుకూల విప్లవం
- సంక్షేమ పథకాలే కేంద్రబిందువని వెల్లడి

**ఢిల్లీ వెలుతురు జూన్ 08:**

భారతదేశంలో గత దశాబ్ద కాలానికి పైగా సాగుతున్న పాలన కేవలం ఒక ప్రభుత్వ కాలపరిమితి మాత్రమే కాదు.. ఇది దశాబ్దాలుగా అభివృద్ధి ఫలాలకు, కనీస సౌకర్యాలకు దూరంగా ఉండిపోయిన కోట్లాది మంది అట్టడుగు వర్గాల ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన ఒక అపూర్వ సంక్షేమ ప్రయాణం. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన విప్లవాత్మక సంక్షేమ పథకాలు దిగ్విజయంగా అమల్లోకి వచ్చి 12 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ చారిత్రాత్మక మైలురాయిని పురస్కరించుకుని, దేశవ్యాప్తంగా వచ్చిన సామాజిక, ఆర్థిక మార్పులపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'ఎక్స్' (ట్విట్టర్) వేదికగా అత్యంత కీలకమైన సందేశాన్ని పంచుకున్నారు.

ప్రధాని నరేంద్ర మోదీ తన సుదీర్ఘ సందేశంలో.. తమ ప్రభుత్వం సాగించిన 'గరీబ్ కల్యాణ్' (పేదల సంక్షేమం) ప్రయాణం అనేది కేవలం ఒక సాధారణ ప్రభుత్వ సాయం లేదా ఉచిత పథకాల పంపిణీ మాత్రమే కాదని స్పష్టం చేశారు. ఇది ప్రతి పౌరుడిలో మానవ సాధికారతను పెంపొందిస్తూ, భవిష్యత్తులో 'వికసిత్ భారత్' (అభివృద్ధి చెందిన భారతదేశం) లక్ష్యాన్ని సాకారం చేసేందుకు దారితీసే ఒక శక్తివంతమైన సామాజిక ఉద్యమమని ఆయన అభివర్ణించారు. గత 12 ఏళ్ల కాలంలో భారతదేశం ప్రతి రంగంలోనూ ఎన్నో అద్భుతమైన సానుకూల మార్పులను చవిచూసిందని, ఆ విప్లవాత్మక మార్పులన్నింటికీ పేదలు, శ్రామికులు, అట్టడుగు వర్గాల సంక్షేమమే ఏకైక కేంద్ర బిందువుగా నిలిచిందని మోదీ సగర్వంగా పేర్కొన్నారు.

దేశంలో గతంలో ఎన్నడూ లేని విధంగా అంత్యోదయ అన్న యోజన, స్వచ్ఛ భారత్ మిషన్, పీఎం ఆవాస్ యోజన, జల్ జీవన్ మిషన్, ఆయుష్మాన్ భారత్ వంటి వినూత్న కార్యక్రమాలు క్షేత్రస్థాయిలో సామాన్య ప్రజల ప్రాథమిక అవసరాలను తీర్చడంలో అద్భుత విజయం సాధించాయని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి, పక్కా ఇల్లు, స్వచ్ఛమైన తాగునీరు, ఉచిత వైద్య భరోసా కల్పించడం ద్వారా సమాజంలో పేదలకు సమాన అవకాశాలు లభించాయన్నారు. ఈ పథకాలు కేవలం భౌతిక వసతులను మాత్రమే కాకుండా, సమాజంలో పేద వర్గాలకు సమాన గౌరవాన్ని, ఉన్నతమైన ఆత్మగౌరవాన్ని కల్పించాయని ప్రధాని మోదీ తన సందేశంలో భావోద్వేగంగా పంచుకున్నారు.

భారతదేశంలో ఒకప్పుడు బ్యాంకుల చుట్టూ తిరగడం కేవలం ధనవంతులకు మాత్రమే సాధ్యమయ్యే పనిగా ఉండేదని, కానీ తమ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' ఈ వివక్షకు పూర్తిగా చరమగీతం పాడిందని ప్రధాని గుర్తు చేశారు. కోట్ల సంఖ్యలో జీరో బ్యాలెన్స్ ఖాతాలను తెరవడం ద్వారా బ్యాంకింగ్ రంగాన్ని సామాన్యుడి ముంగిటకు తీసుకువచ్చామన్నారు. ఈ జన్ ధన్ ఖాతాల విప్లవం కారణంగా దేశంలోని ప్రతి పేదవాడికి దేశ ఆర్థిక వ్యవస్థతో బలమైన అనుసంధానం ఏర్పడిందని వివరించారు. లబ్ధిదారులకు అందే ప్రతి పైసా మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా వారి ఆత్మాభిమానాన్ని పెంపొందించేలా చేయడంలో ఈ ఖాతాలు కీలక పాత్ర పోషించాయని చెప్పారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన వందల కోట్ల రూపాయల ప్రయోజనాలను పేద ప్రజలకు ఎక్కడా అవినీతి లేకుండా నేరుగా, పారదర్శకంగా అందించడంలో ఆధునిక డిజిటల్ సాంకేతికత పోషించిన పాత్రను ప్రధాని మోదీ ఈ సందర్భంగా ప్రత్యేకంగా నొక్కి చెప్పారు. సమాచార, కమ్యూనికేషన్ సాంకేతికత వినియోగంతో 2013 జనవరి 1న దేశంలో చిన్నగా ప్రారంభమైన డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ విధానాన్ని తమ ప్రభుత్వం అత్యంత సమర్థవంతంగా దేశంలోని మారుమూల గ్రామాల్లోని క్షేత్రస్థాయికి తీసుకెళ్లిందని గుర్తుచేశారు. పూర్వం పథకాల నిధులను మింగేసే మధ్యవర్తుల దోపిడీని, అక్రమాలను డిజిటల్ టెక్నాలజీతో అడ్డుకున్నామని స్పష్టం చేశారు.

గతంలో ప్రభుత్వ నిధులు లబ్ధిదారులకు చేరేసరికి సగానికి పైగా మాయమైపోయే పరిస్థితులు ఉండేవని, కానీ నేడు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు లేదా పోస్టల్ ఖాతాల్లోకే వంద శాతం నిధులు సురక్షితంగా జమ అవుతున్నాయని ప్రధాని మోదీ వివరించారు.

వ్యవస్థలోని లీకేజీలను, అక్రమాలను పూర్తిగా నిర్మూలించడం ద్వారా ప్రభుత్వ పాలనపై సామాన్య ప్రజల్లో నమ్మకం మరియు విశ్వాసం రెట్టింపు అయ్యాయని చెప్పారు. నిజాయితీతో కూడిన డిజిటల్ పాలన వల్ల ప్రభుత్వ ఖజానాకు చెందిన వేల కోట్లు ఆదా అవ్వడమే కాకుండా, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరుగుతోందని ప్రధాని మోదీ ధీమా వ్యక్తం చేశారు.

ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో ఇటీవల వెల్లడించిన అధికారిక గణాంకాలు భారతదేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో, పేదల జీవన ప్రమాణాల్లో వచ్చిన అద్భుతమైన మార్పును సజీవంగా స్పష్టం చేస్తున్నాయి. ప్రభుత్వ నివేదికల ప్రకారం.. 2012 నాటి వాతావరణంలో దేశంలో సుమారు 26 శాతంగా నమోదైన భయంకరమైన గ్రామీణ పేదరికం.. గడిచిన 12 ఏళ్ల నిరంతర సంక్షేమ పథకాల పుణ్యమా అని, 2024 నాటికి ఏకంగా ఐదు శాతం కంటే తక్కువకు పడిపోయింది. అంతర్జాతీయ వేదికలపై సైతం భారతదేశం సాధించిన ఈ పేదరిక నిర్మూలన విజయం ఒక సరికొత్త రికార్డుగా నిలిచింది.

కేవలం ఒక దశాబ్ద కాలంలోనే దేశంలోని లక్షలాది గ్రామీణ పేద కుటుంబాలు దారిద్ర్య రేఖ మరియు పేదరికపు కోరల నుంచి శాశ్వతంగా విముక్తి పొంది, సమాజంలో గౌరవప్రదమైన, సుఖవంతమైన జీవనాన్ని సాగించడం ఆధునిక భారతదేశ చరిత్రలోనే అతిపెద్ద సామాజిక–ఆర్థిక పరిణామంగా నిలిచింది.

# పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు

- ఇరాన్ వదిలి వచ్చేయండి.. భారతీయులకు ఎంబసీ అత్యవసర ఆదేశాలు!
- ఇరాన్-అమెరికా శాంతి చర్చలను భగ్నం చేసేందుకు ఇజ్రాయెల్ వ్యూహాత్మక దాడులు
- లెబనాన్ రాజధాని బీరుట్‌పై బాంబుల వర్షం.. ఇరాన్, లెబనాన్ ఉమ్మడి ప్రతీకార చర్యలు
- మళ్లీ మొదటికొచ్చిన సుదీర్ఘ ఘర్షణ.. ఇజ్రాయెల్ ఎదురుదాడులతో దద్దరిల్లుతున్న పశ్చిమాసియా
- తీవ్రరూపం దాల్చిన ఉద్రిక్తతలు.. ఇరాన్‌కు వెళ్లొద్దంటూ భారత విదేశాంగ శాఖ కీలక ప్రకటన
- అక్కడ ఉన్న స్వదేశీయులు తక్షణమే అందుబాటులో ఉన్న విమానాల ద్వారా వచ్చేయాలని ఆదేశం
- క్షేత్రస్థాయిలో పెరిగిన ముప్పు.. గత 24 గంటల్లో మారిన పరిణామాలపై ఎంబసీ అలర్ట్
- భారతీయులను సురక్షితంగా రప్పించేందుకు రంగంలోకి దిగిన దౌత్య అధికారులు.. ప్రత్యేక ప్రణాళికలు
- యుద్ధం గనుక ముదిరితే అటకెక్కనున్న వాషింగ్టన్-టెహ్రాన్ చర్చలు.. ఆందోళనలో అంతర్జాతీయ సమాజం

**పశ్చిమాసియా వెలుతురు జూన్ 08:**

పశ్చిమాసియా (మిడిల్ ఈస్ట్) ప్రాంతంలో శాంతిని నెలకొల్పేందుకు ఇరాన్, అమెరికా దేశాల మధ్య సాగుతున్న దౌత్యపరమైన చర్చలు దాదాపు ఒక ముగింపు దశకు చేరుకుంటున్న తరుణంలో అక్కడ మళ్లీ యుద్ధ జ్వాలలు ఎగిసిపడ్డాయి. ఈ రెండు దేశాల మధ్య కుదురుతున్న ఒప్పందాన్ని ఎలాగైనా సరే మధ్యలోనే భగ్నం చేయాలని గట్టిగా నిర్ణయించుకున్న ఇజ్రాయెల్.. తన శత్రు దేశమైన లెబనాన్‌ను లక్ష్యంగా చేసుకుని సరిహద్దుల్లో వరుస దాడులకు దిగింది. అమెరికా, ఇరాన్ దేశాలు దగ్గరైతే అంతర్జాతీయంగా తనకు రక్షణ పరమైన ఇబ్బందులు ఎదురవుతాయనే భయంతోనే ఇజ్రాయెల్ ఈ విధమైన వ్యూహాత్మక సైనిక చర్యలకు పాల్పడుతోందని అంతర్జాతీయ రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

తాజాగా లెబనాన్ రాజధాని బీరుట్ నగరంతో పాటు ఆ దేశంలోని పలు కీలక ప్రాంతాలపై ఇజ్రాయెల్ సైన్యం అత్యంత దారుణంగా వైమానిక దాడులు జరిపింది. ఈ విచక్షణారహిత బాంబుల దాడి ఇటు లెబనాన్ మిత్రదేశమైన ఇరాన్‌కు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది. ఇజ్రాయెల్ దూకుడుకు పగ్గాలు వేయాలనే ఉద్దేశంతో ఇరాన్, లెబనాన్ దేశాలు చేతులు కలిపి ఉమ్మడిగా ఇజ్రాయెల్ సైనిక స్థావరాలపై క్షిపణులు, డ్రోన్లతో మూకుమ్మడి దాడులకు దిగాయి. ఈ ఊహించని ఎదురుదెబ్బతో ఇజ్రాయెల్ ఒక్కసారిగా విలవిల్లాడిపోయింది. తమ సరిహద్దులను దాటుకుని వస్తున్న రాకెట్లను అడ్డుకునేందుకు ఇజ్రాయెల్ రక్షణ వ్యవస్థలు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది.

తమ భూభాగంపై ఇరాన్ ఉమ్మడి దాడులు చేయడాన్ని తీవ్రంగా పరిగణించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు సర్కార్.. తక్షణమే రంగంలోకి దిగి మరింత భయంకరమైన ప్రతీకార దాడులను ప్రారంభించింది. ఇరాన్‌లోని కొన్ని ప్రధాన వ్యూహాత్మక కేంద్రాలను లక్ష్యంగా చేసుకుని క్షిపణులను ప్రయోగించింది. ఈ తాజా దాడులు, ప్రతిదాడుల పరంపరతో పశ్చిమాసియా అంతటా మళ్లీ పాత యుద్ధ వాతావరణం నెలకొంది. గత కొద్ది రోజులుగా ఇరాన్ చుట్టూ శాంతి కుదురుతుందని ఆశించిన అంతర్జాతీయ సమాజానికి ఈ పరిణామాలు పెద్ద షాక్ ఇచ్చాయి. ఎక్కడికక్కడ బాంబుల మోతతో ఉద్రిక్తతలు తారస్థాయికి చేరడంతో ఇరాన్ వివాదం మళ్లీ మొదటికొచ్చేసింది.

ఇరాన్ మరియు ఇజ్రాయెల్ దేశాల మధ్య యుద్ధ తీవ్రత గంటగంటకూ పెరుగుతుండటంతో, అక్కడ నివసిస్తున్న వేలాది మంది భారతీయ పౌరుల రక్షణ, భద్రతపై కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు ప్రారంభించింది. ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో ఉన్న భారత రాయబార కార్యాలయం అక్కడి భారతీయులను అప్రమత్తం చేస్తూ ఒక అత్యవసర భద్రతా ప్రకటన విడుదల చేసింది. ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న పరిస్థితులు సామాన్యులకు ఏమాత్రం సురక్షితం కావని, అందువల్ల భారతీయులు ఎవరైనా ఉంటే తక్షణమే ఆ దేశాన్ని విడిచి సురక్షితంగా స్వదేశానికి వెళ్లిపోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.

పశ్చిమాసియాలోని ప్రస్తుత అస్థిరమైన పరిస్థితుల దృష్ట్యా, భారత దేశంలో ఉన్న పౌరులు ఎవరూ కూడా ప్రస్తుతం ఇరాన్ దేశానికి ఎలాంటి ప్రయాణాలు పెట్టుకోవద్దని భారత ఎంబసీ గట్టిగా సూచించింది. గతంలో తాము ఇచ్చిన ప్రయాణ మార్గదర్శకాలను ప్రతి ఒక్కరూ తప్పని సరిగా పాటించాలని, వ్యాపార, పర్యాటక లేదా వ్యక్తిగత కారణాలతో ఇరాన్ వెళ్లాలనుకునే వారు తమ ప్రయాణాలను పూర్తిగా రద్దు చేసుకోవాలని కోరింది. నిప్పుల కొలిమిలా మారిన ఆ ప్రాంతానికి వెళ్లి అనవసరంగా ప్రాణాలను ప్రమాదంలో పడేసుకోవద్దని కేంద్ర విదేశాంగ శాఖ హెచ్చరించింది.

గడిచిన 24 గంటల్లో ఇరాన్, ఇజ్రాయెల్ సరిహద్దులలో జరిగిన సైనిక కదలికలు మరియు క్షిపణి దాడుల తీవ్రత అక్కడ ఉద్రిక్తతలు ఎంతలా పెరిగాయో స్పష్టం చేస్తున్నాయి. నిత్యం విమానాల రాకపోకలతో రద్దీగా ఉండే ఇరాన్ వాయుమార్గంపై కూడా ఈ యుద్ధ ప్రభావం పడే అవకాశం ఉందని నిపుణులు చెప్తున్నారు. ఇరాన్‌లోని వివిధ నగరాల్లో ఉద్యోగాలు, వ్యాపారాలు మరియు ఉన్నత చదువుల కోసం స్థిరపడిన వందలాది మంది భారతీయులు తాజా బాంబు దాడుల వార్తలతో తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. తమకు ఎప్పుడు ఏం జరుగుతుందోనని స్వదేశంలో ఉన్న వారి కుటుంబ సభ్యులు సైతం కంటిమీద కునుకు లేకుండా గడుపుతున్నారు.

ఇరాన్‌లో ఉన్న ప్రతి ఒక్క భారతీయుడిని క్షేమంగా స్వదేశానికి తీసుకురావడమే తమ మొదటి ప్రాధాన్యతని భారత దౌత్య అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం అక్కడ అందుబాటులో ఉన్న అంతర్జాతీయ వాణిజ్య రవాణా మార్గాలు, విమాన సర్వీసుల ద్వారా వెంటనే దేశం విడిచి వెళ్లాలని అక్కడి పౌరులకు సూచించారు.

ఒకవేళ ఇరు దేశాల మధ్య యుద్ధం మరింత ముదిరి, సాధారణ విమాన సర్వీసులు నిలిచిపోతే గనుక.. గతంలో ఉక్రెయిన్, సూడాన్ సంక్షోభాల సమయంలో చేపట్టిన మాదిరిగానే 'ఆపరేషన్' విధానం ద్వారా ప్రత్యేక విమానాలను పంపి భారతీయులందరినీ సురక్షితంగా ఇండియాకు చేర్చేందుకు అత్యవసర ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఎంబసీ వర్గాలు వెల్లడించాయి.

ఈ దాడులు, ప్రతిదాడుల తీవ్రత గనుక ఇలాగే మరికొన్ని రోజులు కొనసాగితే.. ఎంతో కష్టమ్మీద మొదలైన అమెరికా–ఇరాన్ (వాషింగ్టన్–టెహ్రాన్) శాంతి చర్చలు పూర్తిగా అటకెక్కడం ఖాయమని అంతర్జాతీయ రాజకీయ పరిశీలకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇజ్రాయెల్ ఆశించినట్లే ఈ రెండు దేశాల మధ్య దౌత్య బంధం తెగిపోతే, పశ్చిమాసియాలో శాశ్వత శాంతి అనేది ఒక కలగానే మిగిలిపోతుంది. ఈ ఘర్షణలు ఇక్కడితో ఆగకుండా అరబ్ దేశాలన్నింటికీ విస్తరిస్తే, ప్రపంచ వ్యాప్తంగా ముడి చమురు సరఫరా నిలిచిపోయి తీవ్ర ఆర్థిక సంక్షోభం తలెత్తే ప్రమాదం ఉందని, కాబట్టి ఐక్యరాజ్యసమితి తక్షణమే జోక్యం చేసుకుని యుద్ధాన్ని ఆపాలని అంతర్జాతీయ సమాజం కోరుతోంది.

# రేవంత్ మార్క్...

(మొదటి పేజీ తరువాయి)

- రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ స్కూళ్లను 4 వేలకు తగ్గించేందుకు కుట్రలు
- సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయాలు నియంత హిట్లర్, తాలిబాన్ల పాలనను తలపిస్తున్నాయని విమర్శ
- రూ. 11 వేల కోట్ల భారీ ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను గాలికొదిలేసిన సర్కార్
- డిగ్రీ అడ్మిషన్లలో తీవ్ర గందరగోళం.. అనుమతి లేని కోర్సుల్లోనూ యథేచ్ఛగా అడ్మిషన్లు
- గురుకులాల్లో వంద మందికి పైగా విద్యార్థులు చనిపోయినా సీఎంకు పట్టదా అని ప్రశ్న
- పేద విద్యార్థులకు శాపంగా మారిన జీవో నెం.7.. ప్రైవేట్ కాలేజీల దోపిడీకి సర్కార్ వత్తాసు
- ఫీజు నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలంటూ బీఆర్ఎస్ డిమాండ్
- రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలపై ప్రజలంతా ముక్తకంఠంతో పోరాడాలని పిలుపు

**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**

తెలంగాణ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న తప్పుడు విధానాల వల్ల రాష్ట్ర విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయిందని బీఆర్ఎస్ (తెలంగాణ రాష్ట్ర సమితి) సీనియర్ నాయకురాలు, మాజీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనాలోచిత నిర్ణయాల వల్ల విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని మండిపడ్డారు. సోషల్ మీడియా వేదికగా విడుదల చేసిన ఒక ప్రత్యేక వీడియో సందేశంలో కవిత.. రాష్ట్రంలో విద్యారంగాన్ని రేవంత్ రెడ్డి పూర్తిగా నాశనం చేస్తున్నారంటూ మండిపడ్డారు. సీఎం రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్యబద్ధంగా లేదని, అది హిట్లర్ ఆలోచన విధానాన్ని మరియు తాలిబాన్ల మొండి వైఖరిని తలపిస్తోందని విమర్శించారు.

రాష్ట్రంలో ప్రస్తుతం పేద విద్యార్థులకు అండగా ఉన్న దాదాపు 27 వేల ప్రభుత్వ పాఠశాలలను (గవర్నమెంట్ స్కూల్స్) కేవలం 4 వేలకు తగ్గించాలని కాంగ్రెస్ ప్రభుత్వం యోచిస్తోందంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన తాజా ప్రకటనపై కవిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది స్కూళ్లను మూసివేయడం లేదా విలీనం చేయడం ద్వారా పేద, మధ్యతరగతి విద్యార్థులను.. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని బాలికలను చదువుకు పూర్తిగా దూరం చేయాలని రేవంత్ రెడ్డి చూస్తున్నారని ఆరోపించారు. ఒక బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి స్థానంలో ఉండి ఇలా పాఠశాలలను మూసివేస్తామని మాట్లాడటం దుర్మార్గమన్నారు. ఇది తీవ్రమైన నియంతృత్వ ఆలోచనని, రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాంగ్రెస్ నాయకులు ఒక పెద్ద సర్కస్ లాగా మార్చేశారని ఎద్దేవా చేశారు.

రాష్ట్రంలో ఉన్నత విద్యారంగం కూడా అధ్వాన్నంగా తయారైందని కవిత ఆరోపించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో డిగ్రీ అడ్మిషన్ల ప్రక్రియలో తీవ్రమైన గందరగోళం నెలకొందని స్పష్టం చేశారు. హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ (ఉన్నత విద్యా మండలి) ఒకలా చెబితే.. కాలేజీల కమిషనరేట్ మరోలా ప్రవర్తిస్తోందని, రెండు విభాగాలూ వేర్వేరు కోర్సులను సిఫార్సు చేస్తూ విద్యార్థులను అయోమయంలో పడేస్తున్నాయని విమర్శించారు. యూనివర్సిటీల నుంచి ఎలాంటి అధికారిక అనుమతులు, గుర్తింపు లేని కోర్సుల్లో కూడా ప్రైవేట్ కాలేజీలు యథేచ్ఛగా అడ్మిషన్లు జరుపుతున్నా ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు కూర్చోవడం వెనుక పెద్ద అవినీతి దాగి ఉందని ఆరోపించారు.

తెలంగాణలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నడుస్తున్న ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో (రెసిడెన్షియల్ స్కూల్స్) కనీస వసతులు కరువయ్యాయని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ కొద్ది కాలంలోనే రకరకాల కారణాలు, అనారోగ్య సమస్యలు మరియు ఆహార కాలుష్యం (ఫుడ్ పాయిజన్) వల్ల దాదాపు 100 మందికి పైగా విద్యార్థులు గురుకులాల్లో మరణించారని గుర్తు చేశారు. ఇంత పెద్ద సంఖ్యలో దేశ భవిష్యత్తు అయిన విద్యార్థులు చనిపోతున్నా, విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కనీసం ఒక్కటంటే ఒక్క సమీక్షా సమావేశం కూడా నిర్వహించకపోవడం అత్యంత దారుణమన్నారు. పేద పిల్లల ప్రాణాలంటే ఈ ప్రభుత్వానికి ఎందుకంత అలుసని ఆమె ప్రశ్నించారు.

పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదువుకోవడానికి గత బీఆర్ఎస్ ప్రభుత్వం అందించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించిందని కవిత మండిపడ్డారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రైవేట్ మరియు ఎయిడెడ్ కాలేజీలకు ప్రభుత్వం చెల్లించాల్సిన రూ. 11 వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను రేవంత్ రెడ్డి సర్కార్ ఉద్దేశపూర్వకంగానే పెండింగ్‌లో పెట్టిందని ధ్వజమెత్తారు. దీనివల్ల కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని, ఫలితంగా వేలాది మంది నిరుపేద విద్యార్థులు చదువు ముగించుకుని కూడా ఉద్యోగ అవకాశాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన వివాదాస్పద జీవో నెం.7 వల్ల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కవిత తెలిపారు. ఈ జీవో ప్రకారం విద్యార్థులు కాలేజీలకు నేరుగా తమ చేతుల్లో నుంచే ట్యూషన్ ఫీజులు చెల్లించాల్సి వస్తోందని.. ప్రభుత్వం ఎప్పుడు డబ్బులు ఇస్తుందో తెలియని పరిస్థితి నెలకొందని చెప్పారు. ఒకవైపు ప్రభుత్వం నుంచి కాలేజీలకు బకాయిలు రాక, మరోవైపు ప్రభుత్వం తెచ్చిన జీవోల సాకుతో ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను పీల్చి పిప్పి చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేద విద్యార్థులను ప్రైవేట్ శక్తుల దోపిడీకి గురిచేసేందుకే కాంగ్రెస్ సర్కార్ ఈ జీవోను తెచ్చిందని ఆరోపించారు.

ప్రైవేట్ విద్యా సంస్థల ఇష్టారాజ్యానికి, మితిమీరిన ఫీజుల దోపిడీకి అడ్డుకట్ట వేయాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం తక్షణమే స్పందించాలని కవిత డిమాండ్ చేశారు. విద్యార్థుల పాలిట శాపంగా మారిన జీవో నెం.7ను వెంటనే రద్దు చేయాలని స్పష్టం చేశారు. అలాగే ప్రైవేట్ స్కూళ్లు, కాలేజీలలో ఫీజులను అదుపులో ఉంచేందుకు గతంలో ప్రతిపాదించిన 'ఫీజు నియంత్రణ చట్టాన్ని' ఎక్కడా రాజీ పడకుండా అత్యంత కఠినంగా అమలు చేయాలని కోరారు. విద్యా వ్యవస్థను కేవలం ఒక వ్యాపారంగా మార్చాలని చూస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి నిరుద్యోగులను, విద్యార్థులను వంచిస్తూనే ఉన్నారని కవిత విమర్శించారు. ప్రభుత్వ విద్యా సంస్థలను నిర్వీర్యం చేస్తూ, ప్రైవేట్ శక్తులకు మేలు చేకూర్చేలా సీఎం రేవంత్ రెడ్డి తీసుకుంటున్న విద్యా వ్యతిరేక నిర్ణయాలను రాష్ట్ర ప్రజలంతా, మేధావులు, విద్యార్థి సంఘాలు ముక్తకంఠంతో వ్యతిరేకించాలని ఆమె పిలుపునిచ్చారు. పేదలకు చదువును దూరం చేసే ఎలాంటి చర్యలనైనా తాము సహించబోమని, విద్యార్థుల హక్కుల కోసం బీఆర్ఎస్ పార్టీ తరపున క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున ప్రజా పోరాటాలు చేస్తామని కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు.

# ప్రభుత్వ భూములను కాజేసేవారిపై...

(మొదటి పేజీ తరువాయి)

**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:-**

చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత కలిగిన ప్రభుత్వ అధికారులే కంచే చేను మేసినట్లుగా ఆనాటి బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ భూములను కొల్లగొట్టారని అటువంటి వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ప్రభుత్వ భూములను అంగుళం కూడా ఆక్రమించేందుకు ప్రయత్నించినా, అలాంటి ప్రయత్నాలను ప్రోత్సహించినా ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన అధికారులే వాటిని దోచుకునే ప్రయత్నం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.

ప్రస్తుతం రెవెన్యూ శాఖలో డిప్యూటీ కలెక్టర్ గా పని చేస్తున్న రాము నాయిక్ , 2013 నుంచి 2018 వరకు డిప్యూటేషన్‌పై హౌసింగ్ బోర్డులో ల్యాండ్ అక్విషన్ ఆఫీసర్ ( ఎల్.ఎ.ఓ)గా బాధ్యతలు నిర్వహించారు. ఈ సమయంలో అనేక భూ దందాలకు, అక్రమ రిజిస్ట్రేషన్లకు పాల్పడినట్లు ప్రాథమికంగా నిర్ధారణ కావడంతో తక్షణమే రామునాయిక్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి ప్రకటించారు.

హైదరాబాద్, క్యూర్ పరిధిలో పేదలకు ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి స్థలాల గుర్తింపు కోసం హౌసింగ్ బోర్డు భూములను పరిశీలిస్తున్న సమయంలో రాము నాయిక్ భూలీలలు బయటకు వచ్చాయని తెలిపారు.

బహిరంగ మార్కెట్లో గజం రెండు లక్షల రూపాయిలకు పైగా విలువ చేసే హైకోర్టు 5–6 గేట్ల మధ్య ఉన్న తెలంగాణ హౌసింగ్ బోర్డు కు చెందిన 33.53 చదరపు గజాల స్థలాన్ని రాము నాయిక్ 2018 ఫిబ్రవరి 17న అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించినట్లు బయటపడింది. దీనిపై లోతైన విచారణ జరుపగా రాము నాయిక్ భూదందాలు వెలుగులోకి వచ్చాయని తెలిపారు.

రామునాయిక్ హౌసింగ్ బోర్డు ఎల్.ఎ.ఓగా .. గతంలో హౌసింగ్ బోర్డులో వర్క్ ఇన్స్‌పెక్టర్ గా పనిచేసి ఉద్యోగం నుంచి తొలగింపబడిన ఇఫ్తాకర్ అహ్మద్ భార్య సుబియా సుల్తానా పేరిట ఈ భూమిని అక్రమంగా రిజిస్ట్రేషన్ డబ్బులు కూడా నేటి వరకు బోర్డుకు జమకాలేదు. ఈ భూమికి సంబంధించిన పత్రాలను బోర్డు అనుమతులను పరిశీలించకుండా రిజిస్ట్రేషన్ చేసిన నాటి చార్మినార్ సబ్ రిజిస్ట్రార్ పై కూడా విచారణకు ఆదేశించామని మంత్రి తెలిపారు. ఇదిలాఉండగా కాలక్రమంలో 2025 ఏప్రిల్ లో ఈ భూమిని సుబియా సుల్తానా మరొకరికి విక్రయించారు. ఈ మొత్తం వ్యవహారంపై కూడా ప్రభుత్వ పరంగా తగు విచారణ జరిపిస్తున్నామని తెలిపారు. తీగలాగితే డొంక కదిలినట్లుగా రాము నాయిక్ అక్రమాలు ఒక్కొక్కటి బయటపడ్డాయని తెలిపారు.

రాము నాయిక్ భూ దందాలకు సంబంధించి 2017 నుంచి పలు కేసులు ఉన్నాయని, అప్పట్లో బి. ఆర్. ఎస్ పాలకులు, అధికారులు స్పందించలేదని మంత్రి తెలిపారు. విజయనగర్ కాలనీలో 400 చదరపు గజాలు, తుల్జాగూడలో 22 చదరపు గజాలు, లక్ష్మి గూడలో 130 చదరపు గజాలు, మహబూబ్ గంజ్‌లో 497 చదరపు గజాల స్థలాలను రామునాయిక్ పలువురి పేరిట అక్రమంగా రిజిస్ట్రేషన్ చేయించారని వీటిపై ఇప్పటికే లోతైన విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఈ కేసులలో సబ్ రిజిస్ట్రార్‌ల పాత్రపైనా కూడా విచారణ జరపాలని స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐజీని ఆదేశించామని తెలిపారు.

ప్రభుత్వ అధికారిగా అక్రమాలకు పాల్పడిన రామునాయిక్‌ను తక్షణమే సస్పెండ్ చేశామని, యుద్ధ ప్రాతిపదికన విచారణ పూర్తి చేసి అన్ని ఆధారాలను నిర్ధారించిన తర్వాత శాశ్వతంగా ఉద్యోగం నుంచి తొలగిస్తామని ప్రకటించారు. రాము నాయిక్ భూ అక్రమాలకు సహకరించిన సూపరింటెండెంట్ వివేకానంద్ రిటైర్మెంట్ మరో పది సంవత్సరాలు ఉండగానే విధుల నుంచి శాశ్వతంగా తొలగించామని , మరో సూపరింటెండెంట్ బోనా నాయిక్‌ను సస్పెండ్ చేయడం జరిగిందని తెలిపారు.ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన వ్యక్తులే వాటిని దోచుకునే ప్రయత్నం చేయడం అత్యంత దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు.

ప్రభుత్వ భూములపై కన్నేసిన వారెవ్వరినీ వదిలిపెట్టం. వారు ఎంతటి హోదాలో ఉన్నా, ఎంతటి పలుకుబడి కలిగి ఉన్నా చట్టం ముందు అందరూ సమానమే. ప్రజల ఆస్తులను కబ్జా చేయాలనే దురాలోచనతో వ్యవహరించే వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఉద్యోగి అనే పేరుతో అక్రమాలకు పాల్పడితే శిక్ష మరింత కఠినంగా ఉంటుంది అని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు.



ప్రజల ఆస్తులను కబ్జా చేయాలనే దురాలోచనతో వ్యవహరించే వారిపై నిర్దాక్షిణ్యంగా చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ ఉద్యోగి అనే పేరుతో అక్రమాలకు పాల్పడితే శిక్ష మరింత కఠినంగా ఉంటుంది" అని మంత్రి స్పష్టం చేశారు.

ప్రభుత్వ భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు, నకిలీ పత్రాలు సృష్టించేందుకు లేదా అధికార దుర్వినియోగానికి పాల్పడే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయడంతో పాటు శాఖాపరమైన చర్యలను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

"ప్రభుత్వ భూములను కొల్లగొట్టే అధికారులకు ప్రభుత్వ సేవలో కొనసాగే అర్హత లేదు. ఇలాంటి వారిని గుర్తించి శాశ్వతంగా తొలగించే దిశగా చర్యలు తీసుకుంటాం. ప్రజల ఆస్తులను దోచుకునే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ క్షమించేది లేదు.

ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రజల ఆస్తులను కాపాడటం ప్రభుత్వ ప్రథమ బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు. భూ కబ్జాలు, అక్రమ రిజిస్ట్రేషన్లు, అధికార దుర్వినియోగంపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని, తప్పు చేసిన వారెవరైనా చట్ట ప్రకారం కఠిన మూల్యం చెల్లించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

# జహీరాబాద్ ఛాంపియన్స్ లీగ్-1 విజేతగా ఫ్రెండ్స్ ఝురాసంగం సీసీ





- ఉత్కంఠభరిత ఫైనల్లో యంగ్ స్టార్ సీసీపై 10 పరుగుల తేడాతో ఘన విజయం
- విజేతలకు రూ.1 లక్ష నగదు బహుమతి

**జహీరాబాద్ వెలుతురు, జూన్ 08:**

క్రీడల్లో గెలుపు–ఓటములు సహజమని, విజయం సాధించిన వారు మరింత ఉన్నత లక్ష్యాల కోసం సిద్ధం కావాలని, ఓడిన వారు నిరుత్సాహపడకుండా కఠోర శ్రమతో ముందుకు సాగాలని శేఖపూర్ గ్రామ సర్పంచ్ మొహమ్మద్ చేష్మోద్దీన్ అన్నారు. ఆదివారం రాత్రి జహీరాబాద్ పట్టణంలోని శ్రీ ఎం. భాగరెడ్డి క్రీడా మైదానంలో నిర్వహించిన జహీరాబాద్ ఛాంపియన్స్ లీగ్–1 క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో ఫ్రెండ్స్ ఝురాసంగం సీసీ మరియు యంగ్ స్టార్ సీసీ జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన ఫ్రెండ్స్ ఝురాసంగం సీసీ జట్టు ముందుగా బ్యాటింగ్ ఎంచుకుని నిర్ణీత 10 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 107 పరుగులు చేసింది. దీంతో ప్రత్యర్థి యంగ్ స్టార్ సీసీకి 108 పరుగుల విజయ లక్ష్యాన్ని నిర్దేశించింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన యంగ్ స్టార్ సీసీ జట్టు ప్రత్యర్థి బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్‌కు తట్టుకోలేక నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 97 పరుగులు మాత్రమే చేయగలిగింది. దీంతో ఫ్రెండ్స్ ఝురాసంగం సీసీ 10 పరుగుల తేడాతో విజయం సాధించి జహీరాబాద్ ఛాంపియన్స్ లీగ్–1 టైటిల్‌ను కైవసం చేసుకుంది. టోర్నమెంట్ విజేతగా నిలిచిన ఫ్రెండ్స్ ఝురాసంగం సీసీ జట్టుకు రూ.1 లక్ష నగదు బహుమతితో పాటు ట్రోఫీని అందజేశారు. రన్నరప్‌గా నిలిచిన యంగ్ స్టార్ సీసీ జట్టుకు రూ.50 వేల నగదు బహుమతి మరియు ట్రోఫీని ప్రముఖ సామాజిక సేవకుడు, బీఆర్ఎస్ నాయకుడు ఖిజర్ యాఫై తరఫున ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్ మాట్లాడుతూ క్రీడల్లో క్రమశిక్షణ, అంకితభావం, సహనం, ఓర్పు అత్యంత ముఖ్యమని అన్నారు. నిరంతర సాధనతోనే క్రీడాకారులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు మొహమ్మద్ చేష్మోద్దీన్, ప్రేమ్ రాథోడ్, కేతావత్ మోహన్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు నరేష్ గౌడ్, అబుద్ యాఫై, టోర్నమెంట్ నిర్వాహకులు సయ్యద్ అరఫత్, మొహమ్మద్ అతిక్, మూతబ్బీర్ పటేల్, సయ్యద్ సుబూర్, మొహమ్మద్ అల్తాఫ్, మొహమ్మద్ రహేమాత్, అబూ హుజెఫ్, అబ్బు జవాద్, మొహమ్మద్ ఫెరోజ్ తదితరులు పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో క్రికెట్ అభిమానులు తరలివచ్చి ఆటగాళ్లను ఉత్సాహపరిచారు. ఉత్కంఠభరితంగా సాగిన ఈ పోరు ప్రేక్షకులను చివరి వరకు అలరించింది.

# తెలంగాణను తాకిన నైరుతి రుతుపవనాలు

- జోగులాంబ గద్వాల జిల్లా సరిహద్దుల గుండా ప్రవేశం
- రాష్ట్రంలోకి ప్రవేశించిన చల్లని పవనాలు
- అరేబియా, బంగాళాఖాతాల్లో రెండు తుపాను ఆవర్తనాలు
- ఈ నెల 10 నుంచి 12 నాటికి తెలంగాణ అంతటా విస్తారంగా వర్షాలు
- ఈ ఏడాది జూన్ 4న ఆలస్యంగా కేరళ తీరాన్ని తాకిన నైరుతి రుతుపవనాలు
- దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు, కర్ణాటకలో ఇప్పటికే వంద శాతం విస్తరణ
- ఏపీ, మహారాష్ట్ర సరిహద్దుల్లో 30 శాతానికి పైగా విస్తరించిన వర్షపాత వ్యవస్థ
- 'ఎల్ నినో' ఎఫెక్ట్: ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా సాధారణం కంటే తక్కువ వర్షాలు కురిసే ఛాన్స్
- తొలకరి పలకరింపుతో సాగు పనుల్లో నిమగ్నమైన అన్నదాతలు



**హైదరాబాద్ వెలుతురు జూన్ 08:**

గత కొన్ని వారాలుగా రికార్డు స్థాయి తీవ్రమైన ఎండలు, ఉక్కపోత, పొడి వాతావరణంతో అల్లాడిపోతున్న తెలంగాణ ప్రజలకు, రాష్ట్ర రైతాంగానికి వాతావరణ శాఖ అత్యంత తీపి కబురు అందించింది. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న నైరుతి రుతుపవనాలు ఎట్టకేలకు తెలంగాణ రాష్ట్రంలోకి అధికారికంగా ప్రవేశించాయి. దీంతో రాష్ట్రవ్యాప్తంగా ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశం మేఘావృతమై చల్లని గాలులు వీస్తుండటంతో గుక్కతిప్పుకోకుండా చేస్తున్న భానుడి భగభగల నుండి సామాన్య జనానికి పెద్ద ఉపశమనం లభించింది. ఈ రుతుపవనాల రాకతో రాష్ట్రంలో వానాకాలం సీజన్ ప్రారంభమైనట్లయింది.

భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించిన తాజా నివేదికల ప్రకారం.. నైరుతి రుతుపవనాలు సరిహద్దు రాష్ట్రమైన కర్ణాటక నుండి కదులుతూ తెలంగాణలోని దక్షిణ సరిహద్దు ప్రాంతమైన జోగులాంబ గద్వాల జిల్లా ద్వారా రాష్ట్రంలోకి అడుగుపెట్టాయి. గద్వాల జిల్లాలోని పలు ప్రాంతాలలో ఇప్పటికే ఆకాశం దట్టమైన నల్లటి మేఘాలతో కమ్ముకుని, చల్లని ఈక గాలులతో కూడిన మోస్తరు వర్షాలు ప్రారంభమయ్యాయి. రుతుపవనాల ప్రవేశానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడటంతో, ఇవి వేగంగా ముందుకు సాగుతున్నాయని, రాబోయే కొన్ని గంటల్లోనే పొరుగున ఉన్న మహబూబ్ నగర్, నారాయణపేట, వనపర్తి జిల్లాలకు సైతం విస్తరించనున్నాయని శాస్త్రవేత్తలు ప్రకటించారు.

ప్రస్తుతం రుతుపవనాల కదలికలు వేగవంతం కావడానికి సముద్రంలో ఏర్పడిన సరికొత్త వాతావరణ మార్పులే ప్రధాన కారణమని తెలుస్తోంది. ఈశాన్య అరేబియా సముద్రంతో పాటు, అటు ఉత్తర బంగాళాఖాతంలో ఒకే సమయంలో రెండు బలమైన తుపాను ఆవర్తనాలు ఏర్పడ్డాయి. ఈ రెండు ఆవర్తనాల ప్రభావం వల్ల రుతుపవనాల కదలికలకు అంతర్జాతీయంగా, స్థానికంగా తీవ్రమైన సానుకూల పరిస్థితులు లభించాయి. ఇవి సముద్రాల నుంచి తేమతో కూడిన మేఘాలను భూభాగం వైపునకు బలంగా నెడుతుండటంతో రుతుపవన ద్రోణి మరింత ఉత్తర దిశగా వేగంగా విస్తరిస్తోంది.

సాధారణంగా ప్రతి ఏడూ జూన్ 1వ తేదీ నాటికే నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకాల్సి ఉంటుంది. కానీ ఈ ఏడాది మూడు రోజులు ఆలస్యంగా, అంటే జూన్ 4వ తేదీన ఇవి కేరళలో ప్రవేశించాయి. ప్రవేశం కొద్దిగా ఆలస్యమైనప్పటికీ, ఆ తర్వాత ఏర్పడిన వాతావరణ పరిస్థితుల వల్ల ఇవి భారత తీరప్రాంతాలు, ఈశాన్య రాష్ట్రాల గుండా అత్యంత వేగంగా ముందుకు సాగాయి. దక్కన్ పీఠభూమిలో ఉన్న తెలంగాణ ప్రాంతం కొద్ది రోజులుగా ఈ రుతుపవనాల రాక కోసం ఎదురుచూడగా, జూన్ 10 నుంచి 12 మధ్యన ఇవి రాష్ట్రవ్యాప్తంగా పూర్తి స్థాయిలో విస్తరిస్తాయని వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు.

ప్రస్తుత ప్రయాణంలో నైరుతి రుతుపవనాలు దేశంలోని దక్షిణాది రాష్ట్రాలైన కేరళ, తమిళనాడు మరియు కర్ణాటక రాష్ట్రాలలో ఇప్పటికే వంద శాతం పూర్తిగా విస్తరించాయి. బంగాళాఖాతంలో కూడా ఇవి పూర్తిగా విస్తరించి బలంగా మారాయి. మరోవైపు పొరుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్ (రాయలసీమ, దక్షిణ కోస్తా ప్రాంతాలు), అలాగే మహారాష్ట్రలోని కొన్ని భాగాలలో దాదాపు 30 శాతం మేర ఈ రుతుపవన వ్యవస్థ విస్తరించింది. ఏపీలో విస్తరించిన ఈ పవనాలే ఇప్పుడు తెలంగాణ సరిహద్దుల్లోకి చొచ్చుకువచ్చి వర్షాలు కురిపిస్తున్నాయి.

రుతుపవనాల ద్రోణి వెంబడి ఏర్పడిన తుపాను ఆవర్తనాల కారణంగా అరేబియా సముద్రం నుంచి వస్తున్న తేమతో కూడిన గాలులు దేశం నడిబొడ్డు వైపు కదులుతున్నాయి. అదే సమయంలో బంగాళాఖాతంలో ఉన్న ఆవర్తనం చుట్టుపక్కల గాలిని తన వైపునకు లాక్కుంటోంది. ఈ రెండింటి కలయిక వల్ల మధ్య భారతదేశంతో పాటు తెలంగాణపై మేఘాలు దట్టంగా కమ్ముకుంటున్నాయి. ఈ వ్యవస్థ జూన్ 11వ తేదీ నాటికి మరింత బలపడనుందని, దీనివల్ల తెలంగాణవ్యాప్తంగా విస్తారంగా మరియు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ స్పష్టం చేసింది. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో ముందస్తుగా మోస్తరు జల్లులు కురుస్తున్నాయి.

రుతుపవనాల రాక సంతోషాన్ని కలిగిస్తున్నప్పటికీ, వాతావరణ శాస్త్రవేత్తలు మరో ఆందోళనకరమైన నివేదికను కూడా వెల్లడించారు. ఈ ఏడాది పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిన తీవ్రమైన 'ఎల్ నినో' ప్రభావం కారణంగా దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే ప్రమాదం ఉందని ఐఎండీ అంచనా వేసింది. దేశ సగటు వర్షపాతంలో కేవలం 90 శాతం మేరకే వానలు కురిసే అవకాశం ఉందని, కొన్ని ప్రాంతాలలో కరువు పరిస్థితులు లేదా పొడి వాతావరణం ఉండవచ్చని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న నీటి వనరులను, భూగర్భ జలాలను ప్రజలు ఎంతో పొదుపుగా వాడుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

ఏది ఏమైనప్పటికీ, తెలంగాణలోకి నైరుతి రుతుపవనాల ప్రవేశం ఖరీఫ్ (వానాకాలం) పంటల సాగుకు సిద్ధమవుతున్న రైతులకు ఒక పెద్ద ఊరటనిచ్చింది. తొలకరి వానలు పడటంతో అన్నదాతలు తమ పొలాలను దున్నడం, విత్తనాలు కొనుగోలు చేయడం వంటి వ్యవసాయ పనులను ఉత్సాహంగా ప్రారంభించారు. అయితే, ఎల్ నినో ప్రభావం ఉన్నందున రైతులు తొందరపడి తక్కువ వర్షాలకే విత్తనాలు వేయవద్దని, భూమి పూర్తిగా పదును అయిన తర్వాతే సాగు పనులు మొదలుపెట్టాలని వ్యవసాయ అధికారులు సలహా ఇస్తున్నారు. రాబోయే రోజుల్లో వర్షాల తీవ్రతను బట్టి నీటి నిర్వహణపై రైతులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

# రాహుల్‌ను టార్గెట్ చేస్తూ ...

(మొదటి పేజీ తరువాయి)

- కాంగ్రెస్ నమ్మకద్రోహం చేసిందంటూ నేటి 'ఇండియా జన్ బంధన్' భేటీని బహిష్కరించిన స్టాలిన్ పార్టీ

**ఢిల్లీ వెలుతురు జూన్ 08:**

కేంద్రంలోని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్‌డీఏ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై దేశవ్యాప్తంగా బలమైన ప్రజా పోరాటాలు చేయడమే ఏకైక అజెండాగా విపక్షాల 'ఇండియా' కూటమి సోమవారం న్యూఢిల్లీలో భారీ సమావేశం ఏర్పాటు చేసింది. అయితే ఈ కీలక సమావేశం ప్రారంభం కావడానికి ముందే విపక్షాల మధ్య ఉన్న తీవ్ర అంతర్గత విభేదాలు, అపోహలు ఒక్కసారిగా బట్టబయలయ్యాయి. దేశ రాజధాని వేదికగా సాగుతున్న ఈ రాజకీయ పరిణామాలు జాతీయ స్థాయిలో తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి. కేంద్రంపై ఉమ్మడి పోరాటం పక్కన పెట్టి, ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకునే స్థాయికి విపక్ష నేతలు చేరుకోవడం కూటమి ఉనికికే ప్రమాదకరంగా మారింది.

ఇండియా కూటమి అగ్రనేతలు ఢిల్లీకి చేరుకుంటున్న తరుణంలో అక్కడ ఒక ఊహించని కీలక పరిణామం చోటు చేసుకుంది. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ అగ్ర ఎంపీ రాహుల్ గాంధీని నేరుగా లక్ష్యంగా చేసుకుని ఢిల్లీలోని ప్రధాన కూడళ్లు, వీధుల్లో భారీ ఎత్తున వివాదాస్పద పోస్టర్లు వెలిశాయి. ఈ పోస్టర్లలో రాహుల్ గాంధీకి, కాంగ్రెస్ పార్టీకి వ్యతిరేకంగా ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాల నేతలే గతంలో చేసిన తీవ్ర వ్యాఖ్యలను ముద్రించడం గమనార్హం. విపక్షాల ఐక్యతను దెబ్బతీసేలా, వారిలోనే ఒకరిపై ఒకరికి నమ్మకం లేదనే విషయాన్ని చాటిచెప్పేలా ఈ పోస్టర్ల ప్రదర్శన సాగడం రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది.

ఢిల్లీ నడిబొడ్డున వెలిసిన ఈ పోస్టర్లలో ఎన్‌సీపీ (ఎస్‌సీపీ) జాతీయ అధినేత శరద్ పవార్, తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధినేత్రి మమతా బెనర్జీ, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ మరియు డీఎంకే యువనేత ఉదయనిధి స్టాలిన్ గతంలో విభిన్న సందర్భాలలో కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తూ చేసిన ఘాటు వ్యాఖ్యలను ప్రముఖంగా పొందుపరిచారు. "కాంగ్రెస్ పార్టీతో దేశానికి ప్రమాదం", "రాహుల్ గాంధీ నాయకత్వంపై నమ్మకం లేదు" అనే అర్థం వచ్చేలా ఉన్న ఈ పాత వ్యాఖ్యలను ఇప్పుడు కరెంట్ పాలిటిక్స్‌కు ముడిపెడుతూ ప్రదర్శించడంతో ఇండియా కూటమి అసలు ఐక్యంగా ఉందా లేదా అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

ఇండియా కూటమిలో ఈ స్థాయి ముసలం పుట్టడానికి ప్రధాన కారణం తమిళనాడు రాష్ట్రంలో మారిన సరికొత్త రాజకీయ సమీకరణాలే. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత, అక్కడ అధికారంలో ఉన్న డీఎంకే పార్టీతో కాంగ్రెస్ తన సుదీర్ఘ బంధాన్ని తెంచుకుంది. అంతటితో ఆగకుండా, తమిళ చిత్రసీమ అగ్ర హీరో విజయ్ నేతృత్వంలో కొత్తగా ఏర్పాటైన 'తమిళగ వెట్రి కజగం' పార్టీతో కాంగ్రెస్ అధిష్ఠానం అనూహ్యంగా చేతులు కలిపింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు తదుపరి పార్లమెంట్ ఎన్నికలలో తమిళనాడులో అధికారికంగా టీవీకేతో కలిసే పోటీ చేస్తామని కాంగ్రెస్ ప్రకటించడం డీఎంకే శ్రేణులకు తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించింది.

ఈ నమ్మకద్రోహ పరిణామాలపై డీఎంకే సీనియర్ నాయకుడు టీకేఎస్ ఎలాంగోవన్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ వైఖరిపై తీవ్ర అసంతృప్తి మరియు నిప్పులు చెరిగారు. తమతో కలిసి ఇన్నాళ్లూ పొత్తులో ఉండి, ఎన్నికలు ముగియగానే రాత్రికి రాత్రే కొత్తగా వచ్చిన టీవీకే వైపునకు కాంగ్రెస్ తన విధేయతను మార్చుకుందని మండిపడ్డారు. ఇండియా కూటమి నియమ నిబంధనలను ఉల్లంఘించి, కూటమితో ఎలాంటి సంబంధం లేని ఒక సరికొత్త ప్రైవేట్ పార్టీకి కాంగ్రెస్ నేతలు మద్దతు ప్రకటించడం దారుణమన్నారు. ఈ ద్రోహపూరిత చర్యల వల్లే తమిళనాడులోని డీఎంకే కార్యకర్తలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, అందుకే తాము నేటి ఇండియా కూటమి సమావేశానికి హాజరుకావడం లేదని స్పష్టం చేశారు.

కాంగ్రెస్ పార్టీని తీవ్రంగా విమర్శించిన ఎలాంగోవన్.. దానికి రాజకీయంగా ఎలాంటి విశ్వసనీయత లేదా నైతిక విలువలు లేవని అభివర్ణించారు. తమ స్వార్థ ప్రయోజనాల కోసం భాగస్వామ్య పక్షాలను వాడుకుని వదిలేయడం హస్తం పార్టీకి అలవాటుగా మారిందని ఆరోపించారు. కాంగ్రెస్ అనుసరిస్తున్న ఇటువంటి ఏకపక్ష మరియు బాధ్యతారహిత విధానాల కారణంగానే భవిష్యత్తులో మరిన్ని బలమైన ప్రాంతీయ పార్టీలు ఇండియా బ్లాక్ నుంచి శాశ్వతంగా వైదొలగడానికి సిద్ధంగా ఉన్నాయని సంచలన అంచనా వేశారు. ఆమ్ ఆద్మీ పార్టీ కూడా ఈ భేటీకి రావడం లేదని, ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ వంటి పెద్దలు కూడా దీనిపై త్వరలోనే ఒక గట్టి నిర్ణయం తీసుకుంటారని ఆయన పేర్కొన్నారు.

కేవలం డీఎంకే మాత్రమే కాకుండా, ఢిల్లీలో అధికారంలో ఉన్న ఆమ్ ఆద్మీ పార్టీ కూడా కాంగ్రెస్ ధోరణి నచ్చక నేటి ఉమ్మడి సమావేశానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. మరోవైపు కేరళ రాష్ట్రంలో కాంగ్రెస్, వామపక్షాల మధ్య తీవ్ర స్థాయి రాజకీయ పోరు నడుస్తోంది. కేరళలోని అధికార వామపక్షాలు లోపాయికారిగా బీజేపీతో కుమ్మక్కయ్యాయంటూ కాంగ్రెస్ అగ్ర నాయకులు చేసిన ఆరోపణలపై సీపీఎం శ్రేణులు తీవ్రంగా మండిపడ్డాయి. కాంగ్రెస్ చేస్తున్న ఈ అబద్ధపు ప్రచారాలు కూటమి స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయని ధ్వజమెత్తాయి. అయితే కూటమి మర్యాద కోసం తమ పార్టీ తరఫున కేవలం ఎంపీ జాన్ బ్రిట్టాస్‌ను మాత్రమే ఈ సమావేశానికి పంపుతున్నట్లు సీపీఎం వెల్లడించింది.

ఈ తీవ్రమైన అంతర్గత గందరగోళం, బహిష్కరణల మధ్యే దేశ రాజధానిలోని కానిస్టిట్యూషనల్ క్లబ్ వేదికగా సోమవారం మధ్యాహ్నం ఇండియా కూటమి సమావేశం ప్రారంభం కానుంది. ఈ మీటింగ్‌కు కాంగ్రెస్ నుంచి రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, ఎస్పీ నుంచి అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ తరఫున తేజస్వీ యాదవ్ తదితరులు హాజరవుతున్నారు.

